అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

గురువారం 4-5-2023

సంపుటి : 9 | సంచిక : 65 | Published from Karimnagar , Rangareddy, Hyderabad, Khammam, | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 6.50

సిట్ దర్యాప్తుపై అసంతృప్తి

- ప్రాసిక్యూషన్ సాక్ష్యాలలో వైరుధ్యాలు
- నరోడా గామ్ కేసులో ప్రత్యేక కోర్టు వ్యాఖ్య



అహ్మదాబాద్ : నరోడా గామ్ హింసపై సిట్ జరిపిన దర్యాప్తుపై ప్రత్యేక కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రాసిక్యూషన్ సాక్ష్యాలలో వైరుధ్యాలు ఉన్నాయనీ, అవి విశ్వసించదగినవిగా లేవని తెలిపింది. కోర్టు ఆదేశాల ప్రతి మంగళవారం అందుబాటులోకి వచ్చింది. హింసకు కుట్ర జరిగిందంటూ సంఘటన జరిగిన ఆరున్నర సంవత్సరాల తర్వాత సాక్షులు తెలిపారనీ, అయితే ...5లో



161వ స్థానానికి పడిపోయిన భారత్

ప్రెస్ ఫ్రీడమ్ ఇండెక్స్‌లో...


- గతేడాదికంటే 11 స్థానాలు వెనక్కి
- మీడియా రంగానికి అత్యంత ప్రమాదకరమైన దేశం : ఆర్ఎస్ఎఫ్

న్యూఢిల్లీ : మీడియా స్వేచ్ఛలో భారత్ 161 స్థానానికి పడిపోయింది. గతేడాది 150వ స్థానంలో నిలవగా.. 11 స్థానాలు దిగజారి 161 ర్యాంకుకు చేరింది. మొత్తం 180 దేశాల్లోని పరిస్థితులను అధ్యయనం చేసిన పారిస్‌కు చెందిన స్వతంత్ర ఎన్‌జీఓ రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్, రిపోర్టర్స్ సాన్స్ ఫ్రాంటియర్స్ (ఆర్ఎస్ఎఫ్) బుధవారం గ్లోబల్ ప్రెస్ ఫ్రీడమ్ ఆఫ్ ఇండెక్స్‌ను విడుదల చేసింది. ఈ సూచిలో బంగ్లాదేశ్ 163 స్థానంలో ఉండగా, పాకిస్తాన్ భారత్ కన్నా మెరుగ్గా 150వ స్థానంలో నిలవడం గమనార్హం. తాలిబన్‌ల స్వాధీనంలో ఉన్న ఆఫ్ఘనిస్తాన్ కూడా 152వ స్థానంలో నిలిచింది. భూటాన్ 90వ ర్యాంకు సాధించగా, శ్రీలంక 135వ ర్యాంకులో ఉన్నట్టు ఆర్ఎస్ఎఫ్ తెలిపింది.

భారత్ 161 స్థానానికి పడిపోవడంపై ఆర్ఎస్ఎఫ్ ఈ వివరణ నిచ్చింది. 2014లో ప్రధాని మోడీ అధికారం చేపట్టిన నాటి నుంచి జర్నలిస్టులపై దాడులు పెరిగాయని ఆర్ఎస్ఎఫ్ పేర్కొంది. మీడియాలో రాజకీయ పక్షపాత ధోరణి, మీడియా యాజమాన్యాలు ఏకీకృతం కావడం ఇవన్నీ భారత్‌లో మీడియా స్వేచ్ఛను అడ్డుకుంటున్నాయని తెలిపింది.

దేశంలోని హిందీ భాషలో మూడొంతుల మంది పాఠకులకు కేవలం నాలుగు వార్తాపత్రికలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ప్రాంతీయ భాషల విషయానికొస్తే.. కోల్‌కతాలో ఆనంద్ బజార్ పత్రిక, ముంబయిలో లోక్‌మాత్, దక్షిణాదిలో మలయాళ మనోరమలు ప్రచురితమవుతున్నాయి. టీవీ రంగంలోనూ మీడియా యాజమాన్యాలు ఏకీకృతం కావడం కనిపిస్తున్నది. అలాగే ఆల్ ఇండియా ...5లో





భారీ వర్షంలోనూ కొనసాగిన రెజ్లర్ల ఆందోళన

దోషులకు రక్ష! బాధితులపై కక్ష!

- మద్దతుగా విద్యార్థుల ర్యాలీ.. పోలీసుల దాడి
- విద్యార్థినులను సైతం ఈడ్చిపారేసిన ఢిల్లీ పోలీసులు
- దాడిని ఖండించిన మల్లయోధులు, విద్యార్థి నేతలు
- రెజ్లర్ల వద్దకు పీటీ ఉష



భారీ వర్షంలోనూ రెజ్లర్ల ఆందోళన కొనసాగుతున్నది. లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ, భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తున్న వారికి మద్దతుగా విద్యార్థులు బుధవారం నిర్వహించిన ర్యాలీపై ఢిల్లీ పోలీసులు విరుచుకుపడ్డారు. వేధించిన దోషి స్వేచ్ఛగా తిరుగుతుంటే.. ప్రశ్నించిన విద్యార్థులపై పోలీసులు దాడి చేశారు. తద్వారా రెజ్లర్లను పరోక్షంగా హెచ్చరించారు. అయినప్పటికీ రెజ్లర్లు మొక్కవోని దీక్షతో తమ ఆందోళనను కొనసాగిస్తున్నారు.

న్యూఢిల్లీ : జంతర్ మంతర్ వద్ద రెజ్లర్లు చేస్తున్న ఆందోళన 11వ రోజూ కొనసాగింది. నటులు, క్రీడాకారులు, రాజకీయ నాయకులు సహా ప్రముఖ నాయకులు వారి ఆందోళనకు మద్దతు తెలుపుతున్నారు. కాగా, ఆందోళన శిబిరాన్ని సందర్శించిన భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలు పీటీ ఉష ఆందోళనకారుల ఆగ్రహాన్ని ఎదుర్కొన్నారు. పీటీ ఉష తిరిగి వెళుతుండగా... ఆమెకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బజరంగ్ పునియా మాట్లాడుతూ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ జైలుకు వెళ్లే వరకు తాము ఇక్కడే ఉంటామని మరోసారి స్పష్టం చేశారు. కేంద్ర క్రీడా మంత్రి (అనురాగ్ ఠాకూర్) హామీతోనే తొలుత తమ ఆందోళనను ముగించామనీ, అథ్లెట్లందరూ లైంగిక వేధింపుల గురించి చెప్పారని వినేష్ ఫోగట్ తెలిపారు. ఒక కమిటీ వేసి చేతులు దులుపుకున్నారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. జంతర్ మంతర్ వద్ద కూర్చోవడానికి మూడు-నాలుగు నెలల ముందు తాము ఒక అధికారిని కలిశామని చెప్పారు. మహిళా అథ్లెట్లు లైంగిక వేధింపులకు ఎలా గురవుతున్నారో, మానసికంగా ఎలా హింసించబడుతున్నారో ఆ అధికారికి వివరించామన్నారు. అయినా ...2లో



విద్యార్థులపై పోలీసుల దాడి

ఎస్ఎఫ్ఐ ఖండన

బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా, రెజ్లర్లు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థులు మార్చ్ చేపట్టారు. మార్చ్‌కు అనుమతి లేదనే పేరుతో విద్యార్థులను పోలీసులు ఈడ్చిపారేశారు. ఇందులో పలువురు విద్యార్థినులు గాయపడ్డారు. అదే సమయంలో చాలా మంది బాలికల బట్టలు చిరిగిపోయాయి. ఢిల్లీ పోలీసులు 144వ సెక్షన్ విధించారు. ఎస్ఎఫ్ఐ సెంట్రల్ సెక్రటేరియట్ సభ్యురాలు ఐషీ ఘోష్‌తో సహా పలువురు విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకుని భౌతికంగా దాడి చేశారు. విద్యార్థినుల పట్ల పోలీసులు అసభ్యంగా ప్రవర్తించారనీ, దాడి చేశారని ఎస్ఎఫ్ఐ నేత ఐషీఘోష్ విమర్శించారు. పలువురు ...2లో

రాజ్యాంగ పదవికి గౌరవ మర్యాదలు ఇవ్వడం లేదు

రాష్ట్ర ప్రభుత్వంపై గవర్నర్ తమిళిసై ఆగ్రహం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అత్యున్నత రాజ్యాంగ పదవికి ఇవ్వాల్సిన గౌరవ మర్యాదలను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడం లేదని రాష్ట్ర గవర్నర్ తమిళి సై సౌందరరాజన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయ ప్రారంభోత్సవానికి తనకు ఆహ్వానం రాలేదని తెలిపారు. రాష్ట్ర ప్రథమ పౌరురాలిగా ప్రభుత్వం ఎప్పుడూ ప్రొటోకాల్ పాటించలేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. జీ-20 సమావేశాల్లో భాగంగా హైదరాబాద్ గచ్చిబౌలిలో ఏర్పాటు చేసిన సీ-20 సమావేశాల్లో గవర్నర్ మాట్లాడారు. తాను తెలంగాణకు సేవ చేయడానికే వచ్చాననీ, రాజకీయాలు చేయడానికి కాదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మొదటి నుంచీ తనపై వ్యతిరేక వైఖరి ప్రదర్శిస్తోందని విమర్శించారు.



షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ వెల్లడి

వివరాలు 5లో..

నీరాకేఫ్ ప్రారంభం

అవమానించిన చోటే ఆత్మగౌరవం : మంత్రి శ్రీనివాస్‌గౌడ్

- వారం రోజుల్లో నీరా, తాటిముంజలతో ఐస్‌క్రీం
- 'రక్షిత మోకు'కు పరిశోధనలు చేస్తున్నామని వెల్లడి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

'కల్లులో కల్తీ ఉందని, నీరాలో ఆల్కహాల్ ఉందని గౌడ వృత్తిని అవమానించారు. అవమానించిన చోటే గౌడన్న ఆత్మగౌరవం కాపాడేలా వేదామృతమైన ...5లో

భద్రాద్రిలో రేలా పండుగ ప్రారంభం

ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహణ

- అపురూపం ఆదివాసీల ఆటాపాట
- సాంస్కృతిక ఉత్సవాలను ప్రారంభించిన పద్మశ్రీ సకిని రామచంద్రయ్య
- రాష్ట్ర నలుమూలల నుంచి హాజరైన ఆదివాసీ కళాకారులు



నవతెలంగాణ-భద్రాచలం

డప్పు దరువు దద్దరిల్లింది..! ఘల్లు ఘల్లు మంటూ గజ్జలు సవ్వడి చేశాయి..! డోలు, సన్నాయి మేళాలు హోరెత్తాయి..! అడుగడుగు కలుపుతూ లయబద్ధంగా నాట్యం సాగింది..! సంప్రదాయ సంస్కృతి సాక్షాత్కారమైంది..! రంగు రంగుల వస్త్రాలు కండ్లను జిగేల్ మనిపించాయి..! అపురూప వేషధారణలు మనస్సును హత్తుకున్నాయి..! ఇలాంటి ఎన్నో ఆదివాసీల ఆటపాటలు.. ఔరా అనిపించేలా ఆదివాసీ సాంస్కృతిక జాతర 'రేలా పండుం' అబాల గోపాలన్ని మరిపించింది. ఈ నెల 5,6 తేదీల్లో జరుగుతున్న తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) ...2లో

నేడు బీఆర్ఎస్ జాతీయ కార్యాలయం ప్రారంభం

ఏర్పాట్లు పూర్తి : మంత్రి ప్రశాంత్ రెడ్డి

న్యూఢిల్లీ : బీఆర్ఎస్ రాజకీయ ప్రస్థానంలో మరో మైలురాయి పడనుంది. రాజకీయ విస్తరణలో భాగంగా దేశ రాజధాని ఢిల్లీ కేంద్రంలో నూతన భవనాన్ని బీఆర్ఎస్ గురువారం ప్రారంభించనుంది. శాస్త్రోక్త కార్యక్రమాల అనంతర పార్టీ అధినేత కేసీఆర్ మధ్యాహ్నం 1:05 గంటలకు పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. ఆడంబరాలకు దూరంగా జరగనున్న ఈ ప్రారంభోత్సవంలో కేసీఆర్‌తో పాటు కొద్దిమంది మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు మాత్రమే పాల్గొననున్నారు. అలాగే ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు కొందరు కార్యకర్తలు ఢిల్లీకి చేరుకున్నారు.



బీఆర్ఎస్ భవన ప్రారంభోత్సవంలో భాగంగా గురువారం ఉదయం 05:30 గంటల నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభంకానున్నాయి. పూర్ణాహుతి కార్యక్రమం ముగిశాక ...5లో

విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు

24 లక్షల మందికి ప్రయోజనం

- బడులు ప్రారంభమయ్యే నాటికి అందించేలా చర్యలు
- జూన్ మొదటివారంలోగా మన ఊరు-మనబడి పనులు పూర్తి చేయాలి : విద్యాశాఖ అధికారులకు మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదేశం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వర్క్‌బుక్స్‌ను, ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు నోట్ పుస్తకాలను ఉచితంగా అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో విద్యారంగం అభివృద్ధికి ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు తీసుకున్న గొప్ప నిర్ణయమిదని పేర్కొన్నారు. బుధవారం సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో విద్యాశాఖ పనితీరుపై ఆమె సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల రాష్ట్రంలోని 24 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందని మంత్రి తెలిపారు. వర్క్‌బుక్స్‌ను, నోట్ పుస్తకాలను పాఠశాల ప్రారంభమయ్యే నాటికి అందజేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆమె ఆదేశించారు. అదేవిధంగా రాష్ట్రంలోని పాఠశాల విద్యార్థులందరికీ బైలింగ్వల్ (తెలుగు, ఇంగ్లీష్ రెండు మాధ్యమాల) పాఠ్యపుస్తకాలను పాఠశాలలు పున్ణ ప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు అందజేయాలని కోరారు. గతేడాది పాఠ్య పుస్తకాల పంపిణీ కోసం రూ.132 కోట్లు ఖర్చు చేశామని వివరించారు. రానున్న విద్యా సంవత్సరానికి రూ.200 కోట్లు ...5లో

డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని తిరిగి ప్రవేశపెట్టాలి

అది జీవశాస్త్రానికి వెన్నెముక

- ఎన్‌సీఈఆర్టీ పాఠ్యపుస్తకాల నుంచి తొలగించటం అన్యాయం
- జేవీవీ మీడియా సమావేశంలో పలువురు వక్తలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎన్‌సీఈఆర్టీ పాఠ్యపుస్తకాల్లో డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని పునరుద్ధరించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. జన విజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. సీసీఎంబీ మాజీ డైరెక్టర్ డాక్టర్ రాకేష్ మిశ్రా మాట్లాడుతూ "డార్విన్ పరిణామ సిద్ధాంతం జీవశాస్త్రానికి వెన్నెముక. అది హైస్కూల్ నుంచి విద్యార్థినీ విద్యార్థులకు బోధించాలి. జీవశాస్త్రంలో దాని అనువర్తనాలు అనేకం. పునరాలోచించి డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని తిరిగి ప్రవేశపెట్టాలి. సిలబస్ ఎక్కువగా ఉన్నదని దానిని తొలగించడం అన్యాయం. ఈ పరిణామ సిద్ధాంతం లేకుండా కోవిడ్‌ను ఎదుర్కోగలిగేవారమా? ఈ సిద్ధాంతం ఏ మతానికి వ్యతిరేకం కాదు. అది వసుధైక కుటుంబ భావన... " అని తెలిపారు. జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) మాజీ డిప్యూటీ డైరెక్టర్ మెహతాబ్ బాంబ్లీ మాట్లాడుతూ డార్విన్ పరిణామ సిద్ధాంతం అనేక ఆధారాలతో చెప్పబడిందని తెలిపారు. ఐసీఏఆర్ ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ సోమ మర్ల మాట్లాడుతూ ...5లో



నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణమండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

స్వీడన్ పెట్టుబడులకు స్వాగతం

ఆ దేశ రాయబారి జాన్‌తెస్లెఫ్‌తో సమావేశంలో మంత్రి కేటీఆర్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

భారతదేశంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే స్వీడన్ కంపెనీలకు తెలంగాణ అత్యుత్తమ గమ్యస్థానమని పరిశ్రమల శాఖ మంత్రి కె.తారకరామారావు అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడి పెట్టే స్వీడన్ కంపెనీలకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని ప్రకటించారు. భారత్‌లోని స్వీడన్ రాయబారి జాన్ తెస్లెఫ్ ఆధ్వర్యంలో వచ్చిన ఆ దేశ వ్యాపార, వాణిజ్య ప్రతినిధులు, పలు కంపెనీల అధిపతులతో బుధవారం సచివాలయంలో మంత్రి కేటీఆర్ సమావేశమయ్యారు. రాష్ట్ర పారిశ్రామిక విధానాలు, ప్రభుత్వ ఆలోచన విధానాన్ని వారికి కేటీఆర్ వివరించారు. పెట్టుబడి అవకాశాల గురించి చెప్పారు. ముఖ్యంగా టెక్నాలజీ, తయారీ రంగాల్లో స్వీడన్ కంపెనీలు పెట్టుబడులు పెట్టాలని కోరారు. ఈ దిశగా భారతదేశంలో పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తిగా ఉన్న కంపెనీలను తెలంగాణకు ఆహ్వానించారు. స్వీడన్ రాయబారి ప్రతినిధి బందంలో భాగంగా వచ్చిన ఆ దేశానికి చెందిన కంపెనీల ప్రతినిధులు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాల పట్ల సంతప్తిని వ్యక్తం చేశారు. పారిశ్రామిక అనుకూల ప్రభుత్వ విధానాలను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఎనిమిదేండ్ల కాలంలో హైదరాబాద్ నగరం రూపురేఖలు సంపూర్ణంగా మార్చేలా తీసుకొచ్చిన మౌలిక వసతుల కల్పన అంశాన్ని ప్రస్తావించారు.

హైదరాబాద్ నగరంలో ఉన్న వ్యాపార అనుకూల వాతావరణంతో మరిన్ని పెట్టుబడులను తెలంగాణకు రప్పించేందుకు ప్రయత్నం చేస్తానని మంత్రి కేటీఆర్‌కు స్వీడన్ రాయబారి జాన్ తెస్లెఫ్ హామీ ఇచ్చారు. భారత దేశంలో పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చే కంపెనీల బందంతో కలిసి పనిచేసేందుకు ఇన్వెస్ట్ మెంట్ ఫెసిలిటేషన్ మెకానిజం పేరుతో తాము ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నామని, ఇది స్వీడన్ వ్యాపార వాణిజ్య సంస్థలతో పాటు పలు కంపెనీలతోనూ కలిసి పని చేస్తుందని వివరించారు. రాష్ట్రంలో ఉన్న పెట్టుబడి అవకాశాలపైనా తమ రాయబార కార్యాలయం నిరంతరం పరిశీలన చేస్తున్నదని, స్వీడన్ కంపెనీలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నామని మంత్రి కేటీఆర్‌కు జాన్ తెస్లెఫ్ తెలిపారు.

గ్రేటర్ హైదరాబాద్‌లో వార్డు స్థాయి పాలన

- 150 వార్డుల్లో కార్యాలయాల ఏర్పాటు
- ఈనెలాఖరు నుంచి అమల్లోకి...

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలో త్వరలో వార్డు స్థాయి పరిపాలన అందించనున్నట్టు పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు చెప్పారు. దీనికోసం జీహెచ్ఎంసీ పరిధిలోని 150 వార్డుల్లో కార్యాలయాలు ఏర్పాటు చేసి, పరిపాలనను వికేంద్రీకరిస్తామన్నారు. దీనివల్ల ప్రజలకు మరింత మెరుగైన, వేగవంతమైన సేవలు లభిస్తాయని అన్నారు. బుధవారంనాడిక్కడి బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో పురపాలక, జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. కొత్తగా ఏర్పడే వార్డు కార్యాలయంలో పదిమంది మంది అధికారులు ఎప్పుడూ అందుబాటులో ఉంటారనీ, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ స్థాయి అధికారి ఇంచార్జిగా ఉంటారని తెలిపారు. స్థానిక ప్రజలు సర్కిల్, జోనల్ ఆఫీసులకు వెళ్లకుండా వార్డు కార్యాలయంలోనే సేవల్ని పొందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సిటిజన్ ఫ్రెండ్లీగా జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయాలు ఉండాలనీ, ప్రతి వార్డు ఇంకో వార్డు కార్యాలయంతో అనుసంధానం కావాలని సూచించారు. ఈ నెలాఖరునాటికి వార్డు పాలనా వ్యవస్థను సిద్ధం చేయాలనీ, వచ్చే రెండు వారాల్లో వార్డు కార్యాలయాల్లో ఉంచాల్సిన సిబ్బందితో కూడిన బందాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ బృందాలకు వార్డు పాలన వ్యవస్థ ఉద్దేశాలు, లక్ష్యాలు, అది పనిచేసే తీరుకు సంబంధించిన అంశాల్లో పక్కా ప్రణాళికతో శిక్షణ ఇవ్వాలని చెప్పారు. వార్డు కార్యాలయాలన్నీ ఏకరూపంగా ఉండేట్టు చూడాలనీ, సిటిజన్ ఫ్రెండ్లీ డిజైన్‌ను రూపొందించాలని కోరారు. సమావేశంలో పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్‌కుమార్, జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ దానకిషోర్‌తో పాటు పలు విభాగాల పాల్గొన్నారు.



తిరువనంతపురం. కేరళ సచివాలయం గోల్డెన్ జూబ్లీ సందర్భంగా బుధవారం.. ఆర్ఎస్ఎస్.. కమ్యూనలిజం అండ్ ఇండియన్ పొలిటిక్స్ అంశంపై జరిగిన సెమినార్ లో సీపీఐ(ఎం)జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడారు. బీజేపీ,ఆర్ఎస్ఎస్‌లు దేశంలో ఏ విధంగా మతవిభజన రాజకీయాలు చేస్తున్నాయో ..వివరించారు..

తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనాలి

- నష్టపోయిన పంటలకు పరిహారమివ్వాలి : సీఎం కేసీఆర్‌కు జూలకంటి లేఖ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఐకేపీ కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. అకాల వర్షాల కారణంగా నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించాలని తెలిపారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు బుధవారం ఆయన లేఖ రాశారు. యాసంగిలో ఐకేపీ కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభ మయ్యాయని తెలిపారు. కొనుగోళ్లలో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. నల్లగొండ జిల్లాలోని అనేక కేంద్రాలను స్వయం గా పర్యటించి పరిశీలించిన విషయాలను సీఎం దృష్టికి తెస్తున్నానని వివరించారు. తగు చర్యలు తీసుకుని రైతులను ఆదుకోవాలని కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పట్టాల్లేక తడిసి ముద్దై మొలకెత్తుతున్నదని పేర్కొన్నారు. ధాన్యాన్ని ఆరబెట్టేందుకు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనేక కేంద్రాల్లో ధాన్యం వర్షం నీటిలో కొట్టుకుపోతున్నదని తెలిపారు. గోనెసంచుల కొరత తీవ్రంగా కనిపిస్తున్నదని వివరించారు. పది లారీలకు పంపాల్సిన గోనెసంచులను కేవలం ఒకట్రెండు లారీలకు మాత్రమే సరఫరా చేస్తున్నారని పేర్కొన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని లారీలను అన్‌లోడ్ చేయడంలో రైస్‌మిల్లర్ల దగ్గర కొంత జాప్యం జరుగుతున్నదని తెలిపారు. ఏరోజుకారోజు కొనుగోలు చేయకపోవడంతో ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం గుట్టలు గుట్టలుగా పేరుకు పోతున్నదని వివరించారు. దీంతో వారాలపాటు రైతులు పడిగాపులు కాయాల్సి వస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడ కనీస సదుపాయాల్లేవని పేర్కొన్నారు. భద్రత లేక దొంగతనాలు జరుగుతున్నాయని తెలిపారు. ధాన్యం తూకం వేయడానికి తేమను సాకుగా చూపుతున్నారని పేర్కొన్నారు. తరుగు తీయడం, బిల్లుల్లో కోతలు పెట్టడం ద్వారా రైతులకు తీవ్ర నష్టం కలుగుతున్నదని వివరించారు. మార్కెట్లలో ప్రత్యక్ష దోపిడీకి పాల్పడుతున్నట్టు స్పష్టంగా కనుబడుతున్నదని తెలిపారు. కోతకొచ్చిన వివిధ రకాల పంటలు, తోటలు కూడా ఈ అకాల వర్షాలకు దెబ్బతినడంతో ఆ రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లు, అకాల వర్షాలు, రైతుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు ప్రకటిస్తున్నా క్షేత్రస్థాయి అధికారుల్లో కదలిక లేక రైతులు మనోవ్యధకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఐకేపీ కేంద్రాల్లో సరిపోయినన్ని గోనెసంచులు, లారీలు, పట్టాలను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కనీస సౌకర్యాలను కల్పించాలని కోరారు. నష్టపోయిన అన్ని పంటల వివరాలను సేకరించి నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని సూచించారు.

కేంద్ర ప్రభుత్వమే పంట నష్టపరిహారమివ్వాలి

కౌలురైతులకూ నష్టపరిహారం ఇవ్వాలి :సీపీఐ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రాల మీద నెపం నెట్టకుండా చిత్తశుద్ధితో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తన బాధ్యతగా తక్షణమే పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. కేంద్రం, రాష్ట్రం బీమా పథకం నిలిపేయడం దురదృష్టకరమని అన్నారు. కౌలు రైతుల పంటలకు కూడా పంట నష్టపరిహారమివ్వాలని బుధవారం ఒక ప్రకటనలో కోరారు. గత మూడు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాల కారణంగా 10 లక్షల ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లిందని తెలిపారు. మార్చిలో కురిసిన అకాల వర్షాల కారణంగా ఆరు లక్షల ఎకరాల వరి పంటకు నష్టం చేకూరిందని పేర్కొన్నారు. నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.10 వేలు ఇస్తామంటూ పంటలను పరిశీలించినప్పుడు స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారని గుర్తు చేశారు. కానీ ఇప్పటికీ ఆ పంటల నష్ట పరిహారం అందలేదని పేర్కొన్నారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల ఎకరాల మామిడి, ఆరు లక్షల ఎకరాల మొక్కజొన్న పంటలు, ఇతర పంటలు నష్టపోయాయని వివరించారు. తేమ శాతంతో నిమిత్తం లేకుండా వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామంటూ సీఎం కేసీఆర్ ప్రకటించినా 17 శాతం తేమ వస్తేనే ధాన్యాన్ని కొనుగోలు చేస్తామంటూ కింది స్థాయి అధికారులు అంటున్నారని తెలిపారు. దీంతో వరి ధాన్యాన్ని కల్లాలలో ఆరబెట్టుకునే క్రమంలో అకాల వర్షాలకు పూర్తిగా ధాన్యం తడిచిపోయి మొలకలెత్తి పాడైపోయిందని పేర్కొన్నారు. ప్రభుత్వం వద్ద నిల్వ చేసుకునే సామర్థ్యం, మిల్లర్లకు అమ్ముకునే వెసులుబాటు ఉన్నందున వెంటనే తేమశాతం, మొలకలతో సంబంధం లేకుండా వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు.

ప్రపంచ బ్యాంక్ అధ్యక్షుడిగా అజయ్ బంగా

- ప్రకటించిన ఎగ్జిక్యూటివ్ బోర్డు

వాషింగ్టన్: ప్రపంచ బ్యాంక్ అధ్యక్షుడిగా భారతీయ అమెరికన్ వ్యాపారవేత్త అజయ్ బంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు 25 మంది సభ్యులతో కూడిన ప్రపంచ బ్యాంకు ఎగ్జిక్యూటివ్ బోర్డు బంగాను నాలుగు గంటలపాటు ఇంటర్వ్యూ చేసింది. అనంతరం ఆయన్ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు ప్రకటించింది. "బంగా సారథ్యంలో పనిచేసేందుకు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నాం. అభివద్ధి చెందుతున్న దేశాలు ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించే లక్ష్యంతో ప్రపంచ బ్యాంక్ లక్ష్యాలను బంగా నెరవేరుస్తారని ఆశిస్తున్నాం" అని ఎగ్జిక్యూటివ్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

భద్రాద్రిలో రేలా పండుగ ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర 3వ మహాసభలను పురస్కరించుకొని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ, రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం ఆధ్వర్యంలో ఆదివాసీ గిరిజనుల కళాకారుల ప్రదర్శనలు భద్రాద్రి నడి బొడ్డునున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో బుధవారం సాయంత్రం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. వీటిని ప్రముఖ ఆదివాసీ డోలు వాయిద్య కళాకారులు, పద్మశ్రీ అవార్డు గ్రహీత సకిని రామచంద్రయ్య ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధునిక కళలు సంస్కృతికి పునాదని, ఆదివాసీ సంస్కృతి కళలేనని తెలిపారు. ఆదివాసీ సంస్కృతి జీవన విధానం, కళలు, పాటలు అత్యంత పురాతనమైనవని, మనిషి జీవనం ప్రారంభమైన నాటివన్నారు. మానవ సమాజంలోని అత్యంత పురాతనమైన ప్రకృతి తోటి, శ్రమతోటి మమేకమైన ఆదివాసీ కళలు, సంస్కృతిని, సాహిత్య వారసత్వాన్ని నేటి సమాజం ఆదరించి అభివృద్ధి పరచాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. అంతరించిపోతున్న ఆదివాసీ కళలను, నృత్యాలను వాయిద్యా పరికరాలను సమాజంలో సజీవంగా ఉంచటం కోసం, భావితరాలకు వాటిని పరిచయం చేయటం కోసం ఇటువంటి ఉత్సవాలు బాగా ఉపయోగపడతాయని తెలిపారు.

తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బందారు రవికుమార్ మాట్లాడుతూ.. ప్రపంచీకరణ నేపథ్యంలో ఆదివాసీ సంస్కృతి, కళలు, పాటలు, వాయిద్య పరికరాలకు సరైన గుర్తింపు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచీకరణ ఆధునిక సాహిత్యం మరోవైపు మతోన్మాద ఆధిపత్య భావజాలం ఆదివాసీ సంస్కృతిని ఆదివాసీ కళలను మింగేస్తున్నాయన్నారు. ఆదివాసీ హక్కుల పైన దాడి జరుగుతున్న విధంగానే వారి సాంస్కృతిక సంపదపై, కళలపై.. ఆధిపత్య భావజాలం దాడి చేస్తుందని అన్నారు. రాష్ట్రంతో పాటు భారత దేశంలోని అనేక ఆదివాసీ తెగల భాషలకు లిపిలేని కారణంగా ఆదివాసీల జీవన సంస్కృతి, వారి సాహిత్య నృత్యాలు, పాటలు భావితరాలకి అందుబాటులోకి రాలేకపోతున్నాయని తెలిపారు. వాటిని రక్షించేందుకు ఆదివాసీ భాషలకు లిపిని కనిపెట్టి వారి సాంస్కృతిక జీవనాన్ని తద్వారా ఆర్థిక, రాజకీయ జీవితాలను అభివృద్ధి పరచాల్సిన అవసరం ఉందని చెప్పారు. దాని కోసం టీఏజీఎస్ పోరాడుతుందని తెలిపారు. భూమిపై హక్కులు, గిరిజన యువతి, యువకులకు ఉపాధి అవకాశాలు, గిరిజన గ్రామాల అభివృద్ధి, గిరిజన ప్రజల సంక్షేమం, గిరిజన చట్టాల అమలు, ప్రభుత్వ విధానాల వల్ల గిరిజనులకు ఎదురవుతున్న కష్టాలు, ఇబ్బందులపై భద్రాచలంలో జరిగే సంఘం రాష్ట్ర మహాసభలో చర్చించి నిర్ణయాలు చేస్తామని, వాటి ద్వారా పోరాటాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ప్రారంభ కార్యక్రమానికి తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం సాంస్కృతిక విభాగం రాష్ట్ర కన్వీనర్ నేస్రం రాజు అధ్యక్షత వహించగా రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు పాయం రవి వర్మ రాష్ట్ర ఉపాధ్యక్షులు కారం పుల్లయ్య, టీఏజీఎస్ జిల్లా అధ్యక్షులు వజ్జ సురేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు సున్నం గంగ, ఆహ్వాన సంఘం నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

దోషులకు రక్షణ ! బాధితులపై కక్ష !

(మొదటిపేజీ తరువాయి)

ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడంతో ధర్నాకు దిగామని వివరించారు. చాలాకాలంగా తన అధికారాన్ని, పదవిని దుర్వినియోగం చేస్తున్న శక్తివంతమైన వ్యక్తికి వ్యతిరేకంగా నిలబడ్డామని అన్నారు. ద్రోణాచార్య అవార్డు గ్రహీత మహావీర్ ఫోగట్ మాట్లాడుతూ బ్రిజ్ భూషణ్ అబద్దాలు చెబుతున్నారని అన్నారు.

సీల్డ్ కవర్‌లో బ్రిజ్ భూషణ్‌పై అదనపు సమాచారం

బ్రిజ్ భూషణ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలకు సంబంధించి అదనపు సమాచారాన్ని సీల్డ్ కవర్‌లో సమర్పించడానికి మహిళా రెజ్లర్ల తరపు న్యాయవాదిని సుప్రీంకోర్టు అనుమతించింది. ఏడుగురు రెజ్లర్లు దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం సుప్రీంకోర్టు విచారించింది. సీల్డ్ కవర్‌ను ఢిల్లీ పోలీసులకు ఇవ్వాలని తెలిపింది. మహిళా రెజ్లర్ల ఆరోపణలపై దర్యాప్తు చేయడంలో ఢిల్లీ పోలీసులు ఏమీ చేయడం లేదని మహిళా రెజ్లర్ల న్యాయవాది తెలిపారు.

బ్రిజ్ భూషణ్ రాజీనామా చేయాలి

హర్యానాలోని బీజేపీ -జేజేపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న రంజిత్ చౌతాలా సైతం బ్రిజ్ భూషణ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దీనికి బీజేపీ ఎంపీ మేనకా గాంధీ మద్దతు తెలిపారు. బ్రిజ్ భూషణ్, ఆయన ఇద్దరు కుమారులు, అల్లుడు, అల్లుడి బావమరిది రెజ్లింగ్ అసోసియేషన్‌లో వివిధ పదవులు నిర్వహిస్తున్నారని కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ దిగ్విజయ్ సింగ్ ట్వీట్‌లో ప్రశ్నించారు. ఇది కుటుంబ వాదం కాదా? అని ప్రధాని మోడీని ప్రశ్నించారు.

విద్యార్థులపై పోలీస్ చర్యను ఖండించిన రెజ్లర్లు

విద్యార్థులతో ఢిల్లీ పోలీసులు అసభ్యంగా ప్రవర్తించడాన్ని రెజ్లర్లు ఖండించారు. వేధించిన వ్యక్తి స్వేచ్ఛగా తిరుగుతున్నాడని, కానీ ఆయనను పట్టుకోకుండా మహిళా రెజ్లర్లకు మద్దతుగా వస్తున్న విద్యార్థులను పోలీసులు పట్టుకుంటున్నారని విమర్శించారు. ఇది చాలా ఇబ్బందికరంగా ఉందని పేర్కొన్నారు.

విద్యార్థులపై పోలీసుల దాడి

విద్యార్థులను పోలీసులు చితకబాదారు. ఈ దేశంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా నశించిందని, మహిళా రెజ్లర్లను వేధించిన వ్యక్తికి రక్షణ లభిస్తున్నదని విమర్శించారు. బ్రిజ్ భూషణ్ సింగ్‌ను ఇంకా ఎందుకు అరెస్టు చేయలేదని ఐషీఘోష్ ప్రశ్నించారు.రెజ్లర్లకు మద్దతుగా నిరసన తెలిపిన ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థులపై ఢిల్లీ పోలీసుల హింసాత్మక చర్యలను ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విపి సాను, మయూక్ బిస్వాస్‌లు ప్రకటన విడుదల చేశారు. నిరసనలో పాల్గొన్న విద్యార్థులపైనే కాక, రెజ్లర్ల కుటుంబ సభ్యులపైనా పోలీసులు దాడి చేశారని పేర్కొన్నారు. విద్యార్థుల శాంతియుత ఆందోళనపై ఢిల్లీ పోలీసుల క్రూరమైన అణిచివేతకు వ్యతిరేకంగా దేశవ్యాప్త నిరసనలకు ఎస్ఎఫ్ఐ పిలుపు ఇస్తుందని అన్నారు.

జీహెచ్ఎంసీ కౌన్సిల్ నుంచి అధికారుల బాయ్‌కాట్

- జలమండలి కార్యాలయం వద్ద బీజేపీ కార్పొరేటర్ల తీరుకు నిరసనగా..
- పోడియం వద్దకు దూసుకొచ్చిన బీజేపీ కార్పొరేటర్లు



నవతెలంగాణ-సిటీబ్యూరో

చరిత్రలో మొదటిసారి జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశాన్ని ప్రభుత్వ అధికారులు బాయ్‌కాట్ చేశారు. మంగళవారం వాటర్‌బోర్డు కార్యాలయం వద్ద జరిగిన పరిణామాలపై బీజేపీ కార్పొరేటర్ల తీరును నిరసిస్తూ జలమండలి అధికారులు జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశాన్ని బాయ్‌కాట్ చేశారు. జీహెచ్ఎంసీ అధికారులు సైతం వారికి మద్దతు పలికారు. ఈ క్రమంలో అధికారుల తీరును, సభ్యుల తీరును బీజేపీ కార్పొరేటర్లు తప్పుబడుతూ పోడియం వద్దకు దూసుకొచ్చే ప్రయత్నం చేశారు. దాంతో మేయర్ సమావేశాన్ని వాయిదా వేశారు. బుధవారం నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన జీహెచ్ఎంసీ 6వ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ముందుగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే జి.సాయన్న, గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దేవర కరుణాకర్‌తోపాటు ఇటీవల ఉగ్రవాద దాడిలో మృతిచెందిన సైనికులకు సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం మేయర్ అభివృద్ధి కార్యక్రమాలపై వివరించారు.

బీజేపీ కార్పొరేటర్ల తీరుపై నిరసన

జలమండలి ఈ.డి. డాక్టర్ ఎం.సత్యనారాయణ మాట్లాడుతూ.. 126 కిలోమీటర్ల దూరం నుంచి గోదావరి జలాలు, 110కిలోమీటర్ల దూరం నుంచి కృష్ణా జలాలతోపాటు ఇతర ప్రాంతాల నుంచి తరలిస్తున్న జలాల నుంచి నగర వాసులకు తాగునీరు అందిస్తున్నామని వివరిస్తున్న సమయంలో బీజేపీ కార్పొరేటర్లు అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయినా ఆయన మాట్లాడుతూ.. మంగళవారం సైతం బీజేపీ కార్పొరేటర్లు జలమండలి వద్ద వ్యవహరించిన తీరు అధికారుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయన్నారు. మూసాపేట్ సెక్షన్ పరిధి నుంచి మురుగునీరు తీసుకొచ్చి జలమండలి మహిళా అధికారిపై వేశారని చెప్పారు. జలమండలి కార్యాలయం వద్ద అనుచితంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశాన్ని బాయ్‌కాట్ చేస్తున్నామని ప్రకటించారు. వారికి మద్దతు తెలుపుతూ జీహెచ్ఎంసీ అధికారులు సైతం సమావేశాన్ని బాయ్‌కాట్ చేశారు. ఈ క్రమంలో బీజేపీ కార్పొరేటర్లు మేయర్ పోడియాన్ని ముట్టడించడంతో మేయర్ సభను వాయిదా వేశారు.

కొలువుల కోసం కొట్లాడే సమయం వచ్చింది

- ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ పిడమర్తి రవి
- ప్రారంభమైన విద్యార్థి నిరుద్యోగ భరోసా బస్సు యాత్ర



నవతెలంగాణ-ఓయూ

కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పట్టిపీడిస్తుందని, కొలువుల కోసం మళ్లీ కొట్లాడే సమయం వచ్చిందని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ పిడమర్తి రవి అన్నారు. విద్యార్థి నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తాను నిలబడి పోరాడుతానన్నారు. తెలంగాణ రాష్ట్ర విద్యార్థి సంఘాల జేఏసీ కన్వీనర్ మిడతనపల్లి విజయ్ ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్ర యూనివర్సిటీల విద్యార్థి నిరుద్యోగ భరోసా బస్సు యాత్రను బుధవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద పిడమర్తి రవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వల్ల విద్యార్థులు ఆత్మస్థైర్యం కోల్పోయారన్నారు. ఆత్మస్థైర్యం కోల్పోవద్దని చదువుతూ కొట్లాడాలని సూచించారు. నిరుద్యోగుల బాధలు ప్రభుత్వానికి కనిపించడం లేదన్నారు. నిరుద్యోగులు కూర్చుంటే న్యాయం జరగదని, కొలువుల కోసం కొట్లాడాలని సూచించారు. మిడతనపల్లి విజయ్ మాట్లాడుతూ.. పేపర్ లీకేజీకి కారకులైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి టీఎస్‌పీఎస్సీని రద్దు చేయలని డిమాండ్ చేశారు. ఈ భరోసా యాత్ర తరువాత విద్యార్థి నిరుద్యోగుల సమస్యలు ముఖ్యమంత్రికి వినిపించేలా అన్ని విద్యార్థి, ప్రజా సంఘాలను కలుపుకొని బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్ర బీసీ సంఘం నాయకులు తుర్క నర్సింహా, చొప్పరి శంకర్ పిట్ల రమేష్ యాత్రకు సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో ఓయూ విద్యార్థి జేఏసీ నాయకులు రెడ్డి శ్రీనివాస్ ముదిరాజ్, ఆంజనేయులు ముదిరాజ్, వెంకట్ యాదవ్, వీర రాజు, మోహన్ నాయక్, వినోద్, రమేష్, జనార్దన్ ముదిరాజ్, అశోక్, రవి, సురేష్, రాజేందర్, నవీన్, రామకృష్ణ, సురేందర్, రవీందర్, అజయ్ పాల్గొన్నారు.

వ్యక్తిగత హాజరు మినహాయింపునకు 'నో'

- రాహుల్‌కు రాంచీ కోర్టు షాక్

రాంచీ : పరువునష్టం కేసులో వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన అభ్యర్థనను రాంచీ కోర్టు బుధవారం తోసిపుచ్చింది. దీంతో 'మోడీ ఇంటిపేరు'పై చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా దాఖలైన పరువునష్టం కేసులో రాహుల్‌కు మరోసారి చుక్కెదురు అయినట్లయింది. 2019 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కర్నాటకలోని కోలార్‌లో జరిగిన సభలో రాహుల్ ప్రసంగిస్తూ దేశంలో అత్యున్నత స్థాయిలో అవినీతి జరుగుతోందని విమర్శిం చారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాని నరేంద్ర మోడీ, వ్యాపార వేత్తలు నీరవ్ మోడీ, లలిత్ మోడీ పేర్లను ప్రస్తావించిన విషయం తెలిసిందే. దీనిపై జార్ఖండ్‌కు చెందిన ప్రదీప్ మోడీ అనే వ్యక్తి రాహుల్‌పై పరువు నష్టం కేసు వేశారు. బీజేపీకి చెందిన సూరత్ వెస్ట్ ఎమ్మెల్యే పూర్ణేష్ మోడీ కూడా మరో కేసు వేశారు. దీనిపై సూరత్ కోర్టు మార్చి 23న తీర్పు ఇస్తూ రాహుల్‌కు రెండేళ్ల జైలుశిక్ష విధించింది. దీంతో ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని కోల్పోయారు.

అకాల వర్షాలతో రైతుల కుదేలు


నీట మునిగిన పంటలు

- కోసిన పంట కూడా వర్షార్పణమే



న్యూఢిల్లీ : దేశంలోని వివిధ రాష్ట్రాలలో మండు వేసవిలో కురు స్తున్న అకాల వర్షాలు రైతులను నట్టేట ముంచుతున్నాయి. తెలం గాణతో పాటు పంజాబ్, హర్యానా, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రా లలో రానున్న రోజులలో మరిన్ని వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో అన్నదాతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. కొన్ని చోట్ల పంట కోతకు రాగా మరికొన్ని ప్రాంతాలలో కోసిన పంట మార్కెట్ యార్డుల లో నీటిలో నానుతోంది. పంజాబ్‌లో రైతులు 55 వేల టన్నుల గోధుమలను మండీలకు తరలించగా అవి ఇంకా అమ్ముడు పోలే దు. దీనికితోడు ప్రభుత్వం సేకరించిన 52 లక్షల టన్నుల గోధుమలను ఇంకా మండీల నుండి తరలిం చలేదు. వర్షాలు పడితే తమ పరిస్థితి ఏమిటని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి వరకూ కొను గోలు చేసిన గోధుమలలో 46 శాతం పంట ఇంకా మండీలలోనే ఉంది. ప్రతి రోజూ రైతులు పెద్ద సంఖ్యలో మండీలకు గోధుమలను తీసుకు వస్తుండటంతో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

పంజాబ్‌లోని మొత్తం 22 జిల్లాలలో ఐదింటిలో మినహా మిగిలిన వాటి లో వారం రోజులుగా అధిక వర్షపాతం నమోదవుతోంది. రాష్ట్రంలో వాతావ రణ శాఖ ఆరంజ్ అలర్ట్ (అధిక వర్షపాతం హెచ్చరిక) జారీ చేసింది. పంజాబ్ లో రబీ సీజన్‌లో రైతులు 4.49 హెక్టార్ల భూమిలో గోధుమ పంట వేశారు. అకాల వర్షాల కారణంగా మహారాష్ట్రలో ఇరవై శాతం ఉల్లి పంటకు నష్టం వాటిల్లింది. రాబోయే రోజులలో మరింత వర్షపాతం నమోదవుతుందని వాతా వరణ శాఖ హెచ్చరించింది. 'మార్చి నెల నుండి వర్షాలు పడుతూనే ఉన్నాయి. నాణ్యత లోపించడం తో గతంలో నష్టాలు వచ్చినప్పటికీ రైతులు ఉల్లి పంటే వేశారు. ప్రస్తుతం సగటున ఉల్లి ధర కిలో రూ. 3-4 మాత్రమే పలుకుతోంది' అని రైతు సమాఖ్య అధ్యక్షుడు భరత్ దిగోలే ఆవేదన వ్యక్తం చేశారు. మధ్య ప్రదేశ్‌లో వేసవి పంటలుగా వేసిన పప్పు ధాన్యపు పంటలు, ఉద్యాన పంటలు వర్షాల బారిన పడ్డాయి. మండీలలో సౌకర్యాలు సరిగా లేకపోవడంతో రైతుల ఇబ్బందులు చెప్పనలవి కావడం లేదు. గత రెండు మూడు రోజులుగా ఏక ధాటిగా వర్షం పడుతోంది. మండీలకు పంటను తరలించడానికి సైతం రైతు లు ఇబ్బంది పడుతున్నారు. సకాలంలో అమ్ముడు పోకపోతే పంట వర్షార్పణం అవుతుందని వారు భయపడుతున్నారు. ఈ వర్షాల కారణం గా రాబోనే ఖరీఫ్ సీజన్‌కు పొలాన్ని సిద్ధం చేసుకోవడం కూడా కష్టమవుతోంది.



మినీవర్కర్లు, టీచర్లు, ఆయాలకు 15 రోజుల సెలవులివ్వాలి : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మినీవర్కర్లు, ఆయాలు లేని టీచర్లకు, టీచర్లు లేని ఆయాలకు మే నెలలో 15 రోజుల వేసవి సెలవులు ఇవ్వాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కమిషనర్‌కు తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం ఆ శాఖ కమిషనర్‌కు ఆ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.పద్మ, పి.జయలక్ష్మి, కోశాధికారి కె.సునీత లేఖ రాశారు. 'మినీవర్కర్లు లేని టీచర్లు, టీచర్లు లేని ఆయాలకు సెలవులపై రాష్ట్ర సర్కారు జారీ చేసిన సర్క్యులర్‌లో స్పష్టత లేదు. గతేడాది వారికి 15 రోజుల సెలవులు ఇచ్చింది. ఈ ఏడాది కూడా ప్రభుత్వం అదే విధంగా నిర్ణయం చేస్తుందని వారు ఆశపడ్డారు. కానీ, నేటి వరకు కూడా విడిగా సర్క్యులర్ రాకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఆయాలు లేకుండా మినీ వర్కర్ల వ్యవస్థను నిర్మించడం, నేటికీ రాష్ట్ర వ్యాప్తంగా అనేక ఖాళీ పోస్టులను భర్తీ చేయకుండా ఆలస్యం చేస్తున్నది. ఈ సమస్యలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి. అంతే తప్ప సెలవుల్లేకుండా పని చేయించుకోవడం సబబు కాదు. అందరితో సమానంగా వారికి కూడా గతేడాది ఇచ్చినట్టు 15 రోజుల సెలవులు ఇవ్వాలి' అని లేఖలో పేర్కొన్నారు. ఆ లేఖకు గతేడాది జారీ చేసిన సర్క్యులర్‌ను కూడా జతపరిచారు.

177 మంది ల్యాబ్ టెక్నీషియన్ల క్రమబద్ధీకరణ

- సర్కారుకు కృతజ్ఞతలు : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇచ్చిన హామీ మేరకు 177 మంది కాంట్రాక్టు ల్యాబ్ టెక్నీషియన్ల సేవలను రాష్ట్ర ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. ఈ మేరకు బుధవారం వైద్యారోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ వ్యవస్థాపక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంచాల రవీందర్, కాంట్రాక్టు క్రమబద్ధీకరణ బాధ్యులు నగేష్, రామారావు, జ్యోతి, శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం కేసీఆర్, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు చొరవతో క్రమబద్ధీకరించారని వారు కొనియాడారు. హామీని నిలబెట్టుకున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి జీవితాంతం రుణపడి ఉంటామని చెప్పారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు మాట నిలుపుకోలేదనీ, కానీ ల్యాబ్ టెక్నీషియన్లను అక్కున చేర్చుకుని వారు ఆత్మగౌరవంతో జీవించేలా బీఆర్ఎస్ సర్కారు నిర్ణయం తీసుకుందని హర్షం వ్యక్తం చేశారు. నూతన సచివాలయం ప్రారంభం రోజునే సీఎం కేసీఆర్ సంతకం చేయడం, ఆ మేరకు జీవో విడుదల అయిందని ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు.

రైతాంగాన్ని అన్ని విధాలా ఆదుకుంటాం

- ఆందోళన చెందొద్దు :పౌరసరఫరాల సంస్థ చైర్మెన్ సర్దార్ రవీందర్ సింగ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అకాల వర్షాలతో తడిచిన ధాన్యం విషయంలో అన్ని విధాల ఆదుకుంటామనీ, ఆందోళన చెందొద్దని పౌరసరఫరాల సంస్థ చైర్మెన్ సర్దార్ రవీందర్ సింగ్ రైతాంగాన్ని కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని పౌరసరఫరాల భవన్‌లో అకాల వర్షాలపై ఆయన సమీక్షించారు. ధాన్యం కొనుగోలు, తరలింపు, తడిసిన ధాన్యం, గన్నీ సంచులు తదితర అంశాలపై చర్చించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైసు మిల్లులకు తరలించాలనీ, మిల్లర్లు వెంటనే అన్‌లోడింగ్ చేసుకుని వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. కేంద్రాల్లో అవసరమైన సదుపాయాలన్ని కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సీజన్లో ఇప్పటివరకు ఒక లక్ష మంది రైతుల నుంచి రూ.1,710కోట్ల విలువ చేసే 8.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 7 వేల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అకాల వర్షాల నేపథ్యంలో హైదరాబాదులోని పౌరసరఫరాల భవన్లో టోల్ ఫ్రీ నెంబర్ 1967, 1800 4250 0333 నెంబర్లు ఏర్పాటు చేసినట్టు ప్రకటించారు. వీటికి కాల్ చేసి రైతులు తమ సమస్యలను, ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చని సూచించారు.

వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి

- ఉన్నత విద్యామండలి వద్ద టీఆక్టా జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో 11 సర్కారు విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్ల సంఘం (టీఆక్టా) జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం ఆ సంఘం ఆధ్వర్యంలో ఉన్నత విద్యా మండలి కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మెన్ డాక్టర్ ఎం రామేశ్వరరావు, కన్వీనర్ డాక్టర్ శ్రీధర్ కుమార్ లోధ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 11 విశ్వవిద్యాలయాల్లో 1,335 మంది కాంట్రాక్టు అధ్యాపకులు పనిచేస్తున్నారని చెప్పారు. వారందరినీ కూడా రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 16 ప్రకారం ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. అదే పద్ధతిలో విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులందర్నీ రెగ్యులరైజ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఆక్టా నాయకులు జి వెంకటేశ్వర్లు, రాజేష్ ఖన్నా, సతీష్ కుమార్, జయశ్రీ, వి. హర్షిత, శ్రీనివాస్, పల్లా రేష్మారెడ్డి, సోమేశ్, సుదర్శన్, శరత్, కర్ణాకర్, సంయుక్త, పద్మ, ఆదిత్య మూర్తి, పద్మశ్రీ, శిరీష, కళ్యాణి, మను, రాధిక, జితేందర్, హరీష్, ఉదయ శంకర్, వంశీ శంకర్, మసూద్, వెంకటేష్, ఉదయ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల రక్తంలో నుంచి పుట్టిందే ఎర్రజెండా

- వచ్చే మేడే నాటికి బీజేపీని గద్దె దించుతాం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



నవతెలంగాణ-నేలకొండపల్లి

కష్టజీవులు, కార్మికుల రక్తంలో నుంచి పుట్టిందే ఎర్రజెండా అని, రాజకీయ పార్టీల కార్యాలయాల్లో నాయకులు తీర్మానం చేసి రంగులతో అద్దింది కాదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం రాయగూడెం గ్రామంలో మంగళవారం రాత్రి సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. తొలుత పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తమ్మినేనికి ఘనస్వాగతం పలికారు. ఎర్రజెండాలు చేతబట్టి ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ప్రధాన సెంటర్లో జెండాను తమ్మినేని ఆవిష్కరించారు. అనంతరం నాయకులు దుగ్గి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. కమ్యూనిస్టులు ఉద్యమాలతో సాధించిన అనేక హక్కులు, చట్టాలను దేశంలో బీజేపీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అందులో భాగంగానే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి భారీగా నిధులు తగ్గించిందన్నారు. నిత్యావసర వస్తువుల ధరల భారంతో పేదోడు బతికే పరిస్థితి లేదన్నారు. కేంద్రం ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు కారుచౌకగా కట్టబెడుతోందని విమర్శించారు. బీజేపీ రాజకీయ లబ్ది కోసం మతాల మధ్య చిచ్చు పెడుతూ ఘర్షణ వాతావరణం సృష్టిస్తుందన్నారు. పౌర హక్కులకు భంగం కలిగిస్తూ ప్రశ్నించిన వారిపై దేశద్రోహులనే పేరుతో అక్రమ కేసులు బనాయించి జైలుపాలు చేస్తుందన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను బలహీనపరుస్తూ అనాగరికమైన మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేసేందుకు యత్నిస్తోందన్నారు. దేశాన్ని అధోగతి పాలుచేస్తున్న బీజేపీని ఇంటికి సాగనంపాలన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీ వ్యతిరేక శక్తులను కూడగట్టి రానున్న మేడే నాటికి దాన్ని గద్దె దించడం ఖాయమన్నారు. చట్టసభల్లో పేదల పక్షాన గొంతెత్తి నిలదీసేది, అడిగేది, కడిగేది కమ్యూనిస్టులు మాత్రమేనని చెప్పారు. రానున్న కాలంలో దేశంలో, రాష్ట్రంలో బీజేపీ వ్యతిరేక శక్తులతో కలిసి ఉద్యమాలను మరింత ఉధృతం చేసి ఎర్రజెండాను యథాస్థానానికి తీసుకొచ్చేందుకు అవిశ్రాంతంగా కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ముఖ్యమంత్రిపై ఒత్తిడి తీసుకొచ్చి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. 13 లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, ధరణి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మధ్యతరగతి ఉద్యోగులు, టీచర్లు, ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్టు చెప్పారు. గ్రామపంచాయతీ కార్మికులను రెగ్యులర్ చేయాలని, రైతులకు రుణమాఫీ చేయాలని, పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని, దళితబంధు పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కోరుతూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్, మండల కార్యదర్శి కె.వి రామిరెడ్డి, నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, ఏటుకూరి రామారావు, పగిడికత్తుల నాగేశ్వరరావు, భూక్య కృష్ణ, దేగల వెంకటేశ్వరరావు, మారుతి కొండలరావు, శీలం అప్పారావు, పోతనబోయిన పెరుమాళ్ళు, శాఖ కార్యదర్శి లింగనబోయిన కొండలరావు, సురేష్, దుగ్గి నరసింహారావు, వీరబాబు పాల్గొన్నారు.

దేశంలోనే నిజమైన రైతు నాయకుడు సీఎం కేసీఆరే

ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ-నంగునూరు

దేశంలోనే నిజమైన రైతు నాయకుడు సీఎం కేసీఆరేనని, రైతు కోసం సకాలంలో ఎరువులు, కరెంట్, సాగునీరు అందించిన ఘనత ఆయనకే దక్కుతుందని, తక్కువ రోజుల్లో పంటలు చేతికి వచ్చే హైబ్రిడ్ విత్తనాలు వినియోగించేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు రైతులకు అవగాహన కల్పించాలని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట తరహాలో నంగునూరులో నాలుగు లైన్ల రహదారిపై బట్టర్ ఫ్లై లైట్లు ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. బుధవారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. నంగునూరు మండలం కొనాయపల్లి గ్రామంలో దుద్దెడ- బంధారం, కొనాయపల్లి- ముండ్రాయి గ్రామాలను కలుపుకుని వెళ్లే డబుల్‌లైన్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. సీఎం కేసీఆర్‌కు సెంటిమెంట్ ఆలయమైన కొనాయపల్లి వెంకటేశ్వరాలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నంగునూరు మండలం నర్మెట సీతారాముల బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సుదర్శన హోమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నంగునూరులో బట్టర్ ఫ్లై వెలుగులో నాలుగు లైన్ల రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. నూతన తహసీల్దార్ కార్యాలయం, ఇరిగేషన్ గెస్ట్ హౌస్ భవనం, మండల పరిషత్తు కార్యాలయ భవనాలను ప్రారంభించారు. అనంతరం నంగునూరు ఎంపీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నంగునూరు మండలంలో రూ.307 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రూ.200 కోట్లతో నర్మెట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కాళేశ్వరం నీళ్లతో వాగు అవతలి గ్రామాలకు అందేలా ఏర్పాటు చేశామన్నారు. వడగండ్ల వాన వల్ల నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేలు అందిస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అకాల వర్షాలు, వడగండ్ల వానలతో 80 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని అంచనా వేశామని తెలిపారు. ఆయిల్ పామ్ సాగుకు అన్ని రకాల సబ్సిడీలు ప్రభుత్వం ఇస్తున్నదని, దాని కోసం బడ్జెట్లో వెయ్యి కోట్లు పెట్టామన్నారు. నంగునూరు మీదుగా వెళ్తున్న ఔటర్ రింగురోడ్డుతో నంగునూరు దశ దిశ మారుతుందని తెలిపారు. గత కాంగ్రెస్ హయాంలో గతుకులమయం, మన ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో అన్నింటా బతుకులమయంగా మారిందన్నారు. బతుకు దెరువు కోసం బయటకు వెళ్లే వాళ్లు, ఇవాళ పక్క రాష్ట్రాల వారికి తెలంగాణలో ఉపాధి కల్పిస్తూ బతుకుతున్నారని వెల్లడించారు. కార్యక్రమాల్లో జెడ్పీ చైర్మెన్ రోజాశర్మ, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, జెడ్పీటీసీ తడిసిన ఉమావెంకట్ రెడ్డి, ఎంపీపీ జాప అరుణా దేవి, ఆర్డీఓ అనంతరెడ్డి, తహసీల్దార్ దిలీప్ నాయక్, ఇంచార్జి ఎంపీడీవో వేణుగోపాల్, గ్రామ సర్పంచ్ చౌడుచర్ల మమతా జయపాల్ రెడ్డి, మండల ప్రజాప్రతినిధులు,మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు, బీఆర్ఎస్ అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ శాఖలన్నీ ఆస్తిపన్ను బకాయిలు చెల్లించాలి

ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేయాలి : ఎఫ్ఎఫ్‌జీజీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ శాఖలకు ఆస్తిపన్ను బకాయిలు చెల్లించేలా రాష్ట్ర సర్కారు ఉత్తర్వులు ఇవ్వాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ కోరింది. బుధవారం ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి ఎఫ్ఎఫ్‌జీజీ కార్యదర్శి యం.పద్మనాభరెడ్డి లేఖ రాశారు. 'ఏప్రిల్ నెలలో ఇంటిపన్ను చెల్లించిన వారికి పన్నులో ఐదు శాతం రిబేట్ ఇస్తామని జీహెచ్ఎంసీ ప్రకటించింది. ఆ తర్వాత హైదరాబాద్ నగరంలోని సుమారు 8 లక్షల మంది రూ.786.75 కోట్ల ఆస్తిపన్ను చెల్లించారు. వాటితో తమకు కావలసిన పౌరసేవలు ముఖ్యంగా నాలాలు, రోడ్ల మరమ్మత్తు వంటివి చేపడుతారని ఆశించారు. కానీ, వాస్తవంలో ఆ పన్ను డబ్బు ఉద్యోగుల జీతభత్యాలకే సరిపోతున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్నేండ్లుగా పన్ను కట్టకపోవడంతో రూ. 5935 కోట్లు(రాష్ట్ర సర్కారు రూ.5560 కోట్లు, కేంద్ర ప్రభుత్వం రూ.371 కోట్లు) బకాయి పడ్డాయి. గతంలో సీఎస్‌కు ఇదే అంశంపై లేఖ రాస్తే ఆయా శాఖల అధికారులకు పన్నులు చెల్లించాలని ఆదేశించారు. కొన్ని శాఖలే రూ.8 కోట్ల మేర పన్ను కట్టాయి. మిగతావి వసూలు కావాల్సి ఉంది. రాష్ట్ర సర్కారు హైదరాబాద్ నగరపాలక సంస్థపై కక్ష కట్టినట్టుగా వ్యవహరిస్తున్నది. ఎటువంటి కేటాయింపులు లేక నగరపాలక సంస్థను అప్పుల ఊబిలోకి దింపింది. ఇప్పటివరకు చేసిన అప్పులపై రోజుకు రూ.2 కోట్ల వడ్డీ చెల్లింపులు జరుగుతున్నాయని వినిపిస్తున్నది. రాష్ట్ర పన్నుల వసూలులో 80 శాతం నగరపాలక సంస్థ పరిధిలో నుంచే వస్తున్నాయి. అయినా, రాష్ట్ర ప్రభుత్వం నగరపాలక సంస్థకు ఎటువంటి బడ్జెట్ కేటాయింపులు లేవు. నిధుల లేమితో జీహెచ్ఎంసీ ప్రజలకు కావలసిన పౌరసేవలు అందించడం లేదు' అని లేఖలో పేర్కొన్నారు.

అకాల వర్షాలతో పంట నష్టాలు

పరిహారం చెల్లించండి

- ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు నివారించండి :సీఎం కేసీఆర్‌కు తెలంగాణ రైతు సంఘం లేఖ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అకాల వర్షాలు, వడగండ్ల వానలతో పంటలకు తీవ్రమైన నష్టం జరిగిందని తెలంగాణ రైతు సంఘం తెలిపింది. వరి, పత్తి, మొక్కజొన్న, ముతక ధాన్యాలు, మామిడి, కూరగాయల పంటలు పెద్దఎత్తున నష్టపోయాయని పేర్కొంది. కల్లాలోని ధాన్యం తడిసిపోయిందని గుర్తు చేసింది. ఎకరానికి రూ.50 వేలు పెట్టుబడి పెట్టిన రైతులు వానలతో పూర్తిగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేసింది.1500 కోళ్ళు, 150 గొర్రెలు, 13 దుక్కిటెడ్లు మృత్యువాత పడ్డాయని పేర్కొంది. వెంటనే పరిహారం చెల్లించాలనీ, ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు నివారించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్, సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, ఉపాధ్యక్షులు అరిబండి ప్రసాదరావు, సహాయ కార్యదర్శి మూడ్‌శోభన్...బుధవారం ఈమేరకు సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. అకాల వర్షాలకు 10 లక్షల ఎకరాల్లో రూ.1800 కోట్ల విలువ గల పంటలకు నష్టం వాటిల్లిందని తెలిపారు. అంతకు ముందు ఫిబ్రవరిలో అకాల వర్షాల్లో ఐదు లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. ఇంత నష్టం గతంలో ఎప్పుడు వాటిల్లలేదనీ, మొత్తంగా రూ. 4850 కోట్ల పంటల నష్టం జరిగిందనే అంచనా వేశారని గుర్తు చేశారు. ఎకరాకు రూ.10 వేలు ఇస్తామని ప్రకటిం చారని తెలిపారు. 15వ ఫైనాన్స్ కమిషన్ 2022-23కి ప్రకృతి వైపరీత్యాల పరిహారానికి కేంద్ర ప్రభుత్వం రూ.472 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.157 కోట్లు మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వాలనీ, 2022-23 సంవత్సరానికి కేంద్రం రూ.495 కోట్లు, రాష్ట్రం రూ.165 కోట్లు విడుదల చేయాలని కోరారు. ఈ మొత్తం రూ. 1289



కోట్లవుతాయని తెలిపారు. కనీసం ఈ నిధులను రైతులకు ఎకరాకు రూ.20 వేల చొప్పున పరిహారం చెల్లించడం కొంతమేరకు ఉపశమనం కలుగు తున్నదని పేర్కొన్నారు. భూపేంద్రసింగ్ హుడా కమిషన్ కూడా ఇదే అంశంపై సిఫార్సులు చేసిందని తెలిపారు.

తడిసిన ధాన్యం కొంటామన్నారు... మార్కెట్లలో తూకాలు వేయడం లేదు



తడిసిన ధాన్యాన్ని చివరిగింజ వరకు కొనుగోలు చేస్తామని ప్రకటించారనీ, మార్కెట్‌కు వచ్చిన ధాన్యాన్ని వారాల తరబడి తూకాలు వేయడం లేదని పేర్కొన్నారు. టార్పాలిన్‌గానీ, ఎలాంటి రక్షణ వ్యవస్థగానీ మార్కెట్ యార్డుల్లో లేదని తెలిపారు. ప్రమాణాల ప్రకారం తేమ ఉన్నప్పటికి మిల్లర్లు తగాదాలు పెట్టి, తూకం వేసిన తర్వాత 40 కిలోల బస్తాకు 4 కేజీలు కోత పెడుతున్నారని వివరించారు. వ్యవహారమంతా మార్కెట్ కమిటీలకు, ఐకేపీ, సొసైటీలకు మిల్లర్లకు తెలిసి జరుగుతున్నదని ఫిర్యాదు చేశారు. మొక్కజొన్నలు కొనుగోలు చేస్తామని ప్రకటించడం హర్షనీయమని పేర్కొన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా మద్దతు ధరలు ప్రకటించిన ముతక ధాన్యాలను మొక్కజొన్నలు, రాగులు, సజ్జలు, కొర్రలు కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రైతులు నష్టపోకుండా మద్దతు ధరలపై రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ఇవ్వాలని కోరారు. రెవెన్యూ, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలతోపాటు మార్కెట్ కమిటీలు సమన్వయంతో వ్యవహరించి, రైతు ప్రయోజనాలను రక్షించాలని కోరారు. సమస్య పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు.

విరబూసిన మే పుష్పాలు

- చూడటానికి తరలివచ్చిన జనం



నవతెలంగాణ-శాయంపేట

హన్మకొండ జిల్లాలోని ఓ ఇంటిలో ఒకేరోజు 57 మే పుష్పాలు విరబూయడంతో స్థానికులు పువ్వులను చూడటానికి భారీగా తరలివచ్చారు. శాయంపేట మండలం పెద్దకొడెపాక గ్రామానికి చెందిన వన ప్రేమికుడు కోమనేని రఘు ఇంటి ఆవరణలో అరుదైన మే పుష్పాలు (ఫుట్‌బాల్ లిల్లీ ఫ్లవర్ - స్కాడోక్సస్ మల్టీఫ్లోరస్) ఒకే రోజు విరబూశాయి. ఈ పుష్పాల గడ్డను 18 ఏండ్ల కిందట ఆఫ్రికా దేశం నుంచి దిగుమతి చేసుకున్నామని తెలిపారు. ప్రతి ఏడాది మే నెలలో పువ్వు విరబూసిన రోజు నుంచి సుమారు 20 రోజుల వరకు వాడి పోకుండా ఉండటం వీటి ప్రత్యేకత అన్నారు.

అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి

- ఆటో అండ్ మోటార్ క్యాబ్ డ్రైవర్స్ వెల్ఫేర్ సొసైటీ నాయకులు
- ఆర్టీఏ కార్యాలయం ముందు ధర్నా



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఆటో స్క్రాప్ స్కాంలో అవినీతికి పాల్పడిన అధికారులను విధుల నుంచి తొలగించాలని సిటీ ఆటో అండ్ మోటార్ క్యాబ్ డ్రైవర్స్ వెల్ఫేర్ సొసైటీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ర్యాలీగా రవాణా శాఖ కార్యాలయం వద్దకు చేరుకున్న ఆటో, క్యాబ్ డ్రైవర్లు నిరసనకు దిగారు. రవాణాశాఖలో అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చే వేతనాలతో పనిచేస్తున్న అధికారులు రూ.100 కోట్ల అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. దాంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడటంతో వేలాదిమంది డ్రైవర్ల జీవితాలు ఆగం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ధర్నా చేస్తున్న పలువురు డ్రైవర్లను పంజాగుట్ట పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో అక్తర్ అహ్మద్, హాసం మక్కే తదితరులు పాల్గొన్నారు.

అల్పపీడనం ఎఫెక్ట్.. పెరగనున్న ఉష్ణోగ్రతలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఈ నెల ఆరోతేదీ నాటికి ఉపరితల ఆవర్తనం ఏర్పడి ఏడో తేదీ నాటికి అది అల్పపీడనంగా మారే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి కె.నాగరత్న తెలిపారు. ఇది ఎనిమిదో తేదీ నాటికి తీవ్ర అల్పపీడనంగా కేంద్రీకృతమయ్యే అవకాశముందనీ, మధ్య బంగాళాఖాతం వైపు కదులుతూ తీవ్రమయ్యే అవకాశముందని సూచించారు. దీని ప్రభావం వల్ల రాబోయే రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో రాబోయే మూడు రోజుల పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే అవకాశముందని పేర్కొన్నారు. రాబోయే 48 గంటల పాటు జీహెచ్ఎంసీ పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వాన, ఎక్కువ ప్రాంతాల్లో ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశాలున్నాయి. బుధవారం రాత్రి 9 గంటల వరకు రాష్ట్రంలో 120కిపైగా ప్రాంతాల్లో వర్షం కురిసింది.

మత్స్యకారబంధు అమలు చేయాలి

- ముదిరాజ్ ఎంప్లాయిస్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రైతుబంధు తరహాలో మత్స్యకారబంధు అమలు చేయాలని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ మత్స్యరంగ అభివృద్ధి కోసం గతంలో ఎన్నడూ లేనంతగా పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నారని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారి సంక్షేమం కోసం సామూహిక ప్రమాద బీమా పథకం కింద ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకం ఉన్నప్పటికీ అమలులో ప్రభావం చూపడం లేదని పేర్కొన్నారు. మత్స్య సహకార సంఘాలలో నమోదు చేసిన సభ్యులందరికీ బీమా పథకం వర్తింపు ప్రకటనలకే పరిమితమైందని తెలిపారు. రైతుబీమా తరహాలోనే ప్రత్యేకంగా మత్స్యకారుల బీమా అమలు చేయాలని కోరారు. నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ (జాతీయ మత్స్య అభివృద్ధి) బోర్డు, ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎస్) కింద తీసుకొచ్చిన గ్రూపు బీమాలో మత్స్యకారులు ఎలాంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. కేవలం ప్రాథమిక సహకార సంఘంలో సభ్యులై ఉంటే బీమా వర్తిస్తుందంటూ నిబంధనలున్నా అమలు కావడం లేదని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ వెంటనే స్పందించి రైతు బంధు తరహాలో మత్స్యకార కుటుంబాలకు వేగవంతంగా బీమా చెల్లించేలా విధి విధానాలను రూపొందించాలని కోరారు. నోడల్ ఏజెన్సీలతో అయ్యేదేమీ లేదని, ప్రభుత్వమే పూనుకుని స్వతహాగా స్థానిక అధికారుల నివేదికలతో మత్స్యకార బీమా బాధిత కుటుంబానికి తక్షణమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

మేడారం మహా జాతర- 2024 తేదీలు ఖరారు

- పూజార్ల సంఘం అధ్యక్షులు సిద్ధబోయిన జగ్గారావు



నవతెలగాణ - ములుగు

ఆసియాలోనే అతిపెద్ద ఆదివాసీ జాతరగా పేరుగాంచిన సామక్క సారలమ్మ మేడారం జాతర - 2024 తేదీలను ఆలయ పూజరులు ప్రకటించారు. బుధవారం ములుగు జిల్లా తాడ్వాయి పరిధి మేడారంలోనిసమ్మక్క-సారలమ్మ గద్దెల సమీపంలో పూజారుల సంఘం అధ్యక్షులు సిద్ధబోయిన జగ్గారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో తేదీలను ఖరారు చేసి ప్రకటించారు. 2024 ఫిబ్రవరి 14వ తేదీన (బుధవారం) మండమేలగడం మొదలవుతుందని తెలిపారు. 21న సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజును గద్దెకు తీసుకువస్తారని, 22.02.2024(గురువారం)న సమ్మక్కను గద్దె వద్దకు తీసుకొస్తారని, 23.02.2024(శుక్రవారం)న భక్తులు మొక్కులు తీర్చుకుంటారని వెల్లడించారు. 24.02.2024(శనివారం)న దేవతల వనప్రవేశం, 28.02.2024(బుధవారం) తిరుగువారం జాతర, పూజలతో జాతర ముగుస్తుందని తెలిపారు.

సంపాదకీయం

కర్'నాటక' ఎజెండా!

మత విద్వేష రాజకీయమే ఎజెండాగా కర్నాటకలో బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేసింది. ఉచితాలను రేవడి కల్చర్‌గా, రాష్ట్ర ప్రభుత్వాలకు గుదిబండగా ప్రధాని అభివర్ణించి రెండు రోజులు తిరక్కుండానే... ఏటా మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, రోజూ అరలీటరు

> కర్నాటక స్టేట్ వింగ్ ఎగైనెస్ట్ రెలిజియస్ ఫండమెంటలిజం అండ్ టెర్రర్ (కె-స్విఫ్ట్) పేరుతో మైనారిటీలపై విరుచుకుపడేందుకు కొత్తగా మరో గూండాల దళాన్ని ఏర్పాటు చేస్తామని నిస్సిగ్గుగా ఎజెండాలో పెట్టేశారు! రోజుకు అరలీటరు పాలు, ఏటా 3 గ్యాస్ సిలిండర్లు ఫ్రీగా ఇస్తామని హామీలు గుప్పించారు. రేవడి కల్చర్ అంటూ తిట్టిపోసే ఆ పార్టీ నేతలు ఈ హామీలను ఎలా సమర్థించుకుంటారు? హామీలను జుమ్లాలుగా అభివర్ణించిన ఆ పార్టీ నేతలు ఈ హామీలైనా అమలు చేస్తారా? అన్న ప్రతిపక్ష పార్టీల ప్రశ్నలకు ఏమని సమాధానం చెబుతారు?


పాలు ఉచితం అంటూ మేనిఫెస్టోలో ఊదరగొట్టడం ఆ పార్టీ రెండు నాల్కల ధోరణికి నిదర్శనం. దక్షిణాదిన బీజేపీ పాలనకు ముఖద్వారంగా భావించే కర్నాటకలో అడ్డగోలుగా ప్రతిపక్ష ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి, రాజీనామా చేయించి, అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ మతతత్వ విషం చిమ్మేందుకు, కార్పొరేట్లకు సాగిల పడేందుకు సకల ప్రయత్నాలు చేసింది. ముస్లింలలో వెనుకబడిన పేదలకిచ్చే నాలుగు శాతం రిజర్వేషన్లను రద్దుచేసి ఎన్నికల్లో లబ్ది పొందేందుకు లింగాయతులు, ఒక్కలిగల్లో పేదలకు 2శాతం చొప్పున కేటాయిస్తూ ఇటీవల తీసుకున్న నిర్ణయాన్ని మే 9 వరకూ నిలిపివేయాలంటూ సుప్రీంకోర్టు ఆదేశించింది. హిజాబ్ ధరించి వచ్చిన విద్యార్థినులు పాఠశాలల్లోకి రాకుండా అడ్డుకోవడం, లవ్ జీహాద్ పేరిట విషం చిమ్మటం, ఆలయాల వద్ద ముస్లిములు వ్యాపారం చేయకూడదని, హలాల్ చేసిన మాంసం కొనుగోలు చేయొద్దని, టిప్పు సుల్తాన్ వ్యతిరేకత... ఇలా ఎన్నో మత విద్వేష చర్యలకు పూనుకుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్‌లకు దోచిపెట్టే విధానాలతో... విపరీతమైన భారాలు మోస్తున్న కష్టజీవుల కడుపు మంటలే ప్రధాన ఎజెండాగా ముందుకొచ్చాయని... ఇటీవల జరిగిన ప్రీ పోల్ సర్వేలు చెబుతున్నాయి. బీజేపీ ఓటమి తప్పదని అంచనా వేస్తున్నాయి.



ఈ నేపథ్యంలోనే కాషాయ పార్టీ మరింతగా విద్వేష విషాన్ని దట్టించేందుకు ఎన్ఆర్‌సి, ఉమ్మడి పౌర స్మృతిని పార్టీ ఎన్నికల ఎజెండాగా ముందుకు తెచ్చింది. ఎన్ఆర్‌సిని కర్నాటకలో అమలు చేస్తామని, అనధికారికంగా ఉంటున్న వారినందరినీ తరిమేస్తామని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు ప్రకటించారు. కర్నాటక స్టేట్ వింగ్ ఎగైనెస్ట్ రెలిజియస్ ఫండమెంటలిజం అండ్ టెర్రర్ (కె-స్విఫ్ట్) పేరుతో మైనారిటీలపై విరుచుకుపడేందుకు కొత్తగా మరో గూండాల దళాన్ని ఏర్పాటు చేస్తామని నిస్సిగ్గుగా ఎజెండాలో పెట్టేశారు! రోజుకు అరలీటరు పాలు, ఏటా 3 గ్యాస్ సిలిండర్లు ఫ్రీగా ఇస్తామని హామీలు గుప్పించారు. రేవడి కల్చర్ అంటూ తిట్టిపోసే ఆ పార్టీ నేతలు ఈ హామీలను ఎలా సమర్థించుకుంటారు? హామీలను జుమ్లాలుగా అభివర్ణించిన ఆ పార్టీ నేతలు ఈ హామీలైనా అమలు చేస్తారా? అన్న ప్రతిపక్ష పార్టీల ప్రశ్నలకు ఏమని సమాధానం చెబుతారు? డబుల్ ఇంజిన్ ప్రభుత్వముంటే అభివృద్ధి జరుగు తుందంటూ చేసే ప్రచారం బసవరాజు బొమ్మై పాలనలో ఒట్టిదేనని తేలిపోయింది. మరోవైపు చాప కింద నీరులా కార్పొరేట్లిచ్చిన కాసులను బూత్ స్థాయి వరకూ పంపిణీ చేసి, ఎలాగైనా గట్టెక్కాలని పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది.

800ఏళ్ల క్రితమే దళితులు, మహిళలను సైతం భాగస్వాములను చేసి అనుభవ మండపం పేరుతో అనధికార పార్లమెంటును నడిపిన, కులాంతర వివాహం చేసిన, 'దేహమే దేవాలయం...' అంటూ శ్రమ విలువను చాటిచెప్పిన బసవన్న అడుగుజాడలు కన్నడనాట ఇప్పటికీ ఉన్నాయి. బసవన్న సంస్కరణ వాదాన్ని వెలుగులోకి తీసుకొచ్చిన ప్రఖ్యాత రచయిత కల్బుర్గిని 2017లో మతోన్మాదులు పొట్టనబెట్టుకున్నా... ఆయన రచించిన 'మార్గ' ఇప్పటికీ బసవన్న అభ్యుదయ మార్గాన్ని చూపుతూనే ఉంది. ఇతర పార్టీల కంటే బీజేపీ అధ్వాన పాలన చేసిందని ఈసడిస్తున్నారని తాజా సర్వేలు చెబుతున్నాయి. 'నందిని'ని కబళించే అమూల్ పడగ నీడపై భగ్గుమంటున్న రైతులు, నిరుద్యోగంతో తల్లడిల్లుతున్న యువత, గ్యాస్ బండ నుంచి... అన్నింటా భారాలతో నలిగిపోతున్న పేద ప్రజలు, కష్టజీవులు... మతతత్వ పార్టీకి బుద్ధి చెప్పేందుకు అన్ని శక్తులూ సిద్ధమవుతున్న పరిస్థితి కనిపిస్తోంది. 'మనుషులంతా ఒక్కటే... కులాలు, ఉపకులాలు లేవు.. ఆహారం, ఇల్లు, బట్ట, జ్ఞానం, వైద్యం... ఇవి ప్రతి మనిషి కనీస అవసరాలు' అన్న బసవన్న మాటలు కన్నడ నాట ప్రతిధ్వనించేలా ఓటరు తీర్పునివ్వాలి. కార్పొరేట్ - మతతత్వ కూటమి పాలనకు అది చెంపపెట్టు కావాలి.

ఆధునిక జీవనంలోనూ వెంటాడుతున్న వివక్ష



ఎస్. వీరయ్య

కుల వివక్ష కార్మికవర్గంలో కూడా ఉంటుందా? మహిళలు అన్ని రంగాలలో తన ప్రతిభను రుజువు చేసుకుంటున్న ఈ ఆధునిక సమాజంలో కూడా లింగ వివక్ష ఉంటుందా? వివక్షలు, వేధింపుల గురించి సిఐటియు సర్వే నిర్వహించాలని నిర్ణయించినపుడు కొంత మంది నుంచి సహజంగానే ఈ ప్రశ్నలు ఎదురైనాయి. అంతేకాదు.. గ్రామాలలో ఉంటే ఆశ్చర్యం లేదు. పట్టణాలలో కూడా ఉన్నదా! అసంఘటిత రంగంలోనేనా, ఆధునిక పరిశ్రమలలో కూడా ఉన్నదా? పనిలోకి దిగిన తర్వాత అనుమానాలన్నీ పటాపంచలైనాయి. ప్రశ్నలన్నీ తేలిపోయాయి. ఆధునిక పరిశ్రమలలో కూడా వివక్ష రూపాలు ఆధునిక రూపాల్లో ప్రత్యక్షమయ్యాయి. సాక్షాత్తూ కేంద్రపాలకులు కులవ్యవస్థనూ, మను వాదాన్నీ, ఛాందస విధానాలను ప్రజల మీద రుద్దే ప్రయత్నం చేస్తున్న సమయమిది. ఆధునిక ప్రపంచంలో ఎంతోకొంత వెనుకపట్టు పడతాయనుకున్న వివక్షలు పెట్టుబడిదారుల ఆశీస్సులతో కొనసాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్, బీజేపీలు అనుసరిస్తున్న విధానాలవల్ల మరింత ఊపందుకుంటున్నాయి. అందువల్ల ఈ సమస్యకు ప్రాధాన్యత పెరిగింది. టెక్స్‌టైల్ వంటి పరిశ్రమలలో మహిళలకు రాత్రి షిఫ్టు పడకుండా చూసే ఆనవాయితీ

> సామాజిక న్యాయం కోసం సిఐటియు నిర్వహించిన వారోత్సవాలకు ప్రాధాన్యత సంతరించుకున్నది. కులసంఘాలు నిర్వహించినపుడు ఆయా కులాల ప్రయోజనాలు ముందుకొస్తున్నాయి. కుల చైతన్యమే బలపడుతున్నది. కులాలు మరింత బలపడడానికే దోహదపడుతున్నాయి. ఇందుకు భిన్నంగా కార్మిక వర్గమే ఈ ఉత్సవాలు నిర్వహించటం వల్ల వర్గ చైతన్యం పెరుగుతున్నది. కార్మికవర్గ ఐక్యత ఆవశ్యకత ముందుకొస్తున్నది. కులం, పురుషాధిక్యత కార్మికవర్గ ఐక్యతకు ఆటంకంగా ఉన్నాయి. అందుకే కులవివక్ష, లింగవివక్షలకు వ్యతిరేకంగా కార్మికవర్గం ఐక్యంగా పోరాడవల్సిన అవసరం ఉన్నది. ఇందుకోసం జరుగుతున్న పోరాటాలకు కార్మికవర్గం అండగా నిలువటం కూడా అవసరం. ఈ వారోత్సవాల సందర్భంగా కార్మికవర్గానికి ఇచ్చిన సందేశం ఇదే!

ఉన్నచోట కూడా తోటి కార్మికుల నుంచే "రెగ్యులర్‌గా పురుషులే నైట్‌షిఫ్ట్ చేయాలా?" అన్న ప్రశ్న ఎదురవుతున్నది. మహిళలను రెండవతరగతి పౌరులుగా గుర్తించే మనువాద సంస్కృతిని మోడీ ప్రభుత్వం ప్రోత్సహించటం వల్ల, ఇప్పటికే కార్మికులలో ఉన్న సామాజిక స్పృహ, సంఘీభావ స్ఫూర్తి కూడా ప్రభావితమవుతున్నది. ఆమేరకు కార్మికవర్గ ఐక్యతకు హాని కలిగిస్తున్నది. అందుకే కార్మికవర్గం 'సామాజిక వివక్ష'ను విస్మరించజాలదు.

మహిళల పట్ల వివక్ష అనేక రూపాలలో వ్యక్తమవుతున్నది. కరీంనగర్ జిల్లాలో భవననిర్మాణ రంగంలో మహిళలు సూటిగా ప్రశ్నించారు. ఇంకా 'ఆడకూలి, మగకూలి' విధానం ఎందుకుండాలని అడిగారు. నిర్మాణ రంగంలో 'మహిళలకు తక్కువ కూలి' జాడ్యం బలంగా ఉన్నది. ఇది యజమానులలోనే కాదు... నిర్మాణరంగంలోని పురుష కార్మికులలో కూడా 'ఇది సహజమే కదా!' అన్న భావన ఉన్నది. హైదరాబాద్ మహానగరంతో సహా అంతటా ఇదే పరిస్థితి. షాప్ ఎంప్లాయీస్‌లో కూడా ఇదే పరిస్థితి వెలుగులోకి వచ్చింది. నల్గొండ జిల్లాలో, పెద్ద షాపింగ్ మాల్‌లో కూడా, అన్ని అర్హతలున్నప్పటికీ మహిళలనూ, దళితులనూ నైపుణ్యంతో కూడిన పనులలో నియమించటం లేదు. బట్టల దుకాణాలలో అమ్మకాన్ని బట్టి కమీషన్ ఉన్నది. కానీ ఇక్కడ కులాన్నీ, లింగభేదాన్నీ కూడా చూస్తున్నారు. ఎస్‌సీలకూ, మహిళలకూ తక్కువ కమీషన్ ఇస్తున్నారని కార్మికులు ఆరోపించారు. ఆధునిక పరిశ్రమలలో కూడా మహిళలకు తక్కువ వేతనం ఇస్తున్నారు. పెట్టుబడిదారీ వర్గం లాభం పెంచుకోడానికి సామాజిక వివక్షలను కూడా వినియోగించుకుంటున్నది. తమ ప్రయోజనం కోసం ఈ వివక్షలను ప్రోత్సహిస్తున్నది. మహిళల పట్ల లైంగిక వేధింపులు పెరుగుతున్నాయి. నిర్మాణం, పారిశుధ్య రంగాలు మొదలు, అత్యంత ఆధునిక పరిశ్రమల వరకు ఇది సర్వసాధారణమైంది. శ్రామిక మహిళలు చెప్పుకోలేక కుమిలిపోతున్నారు. రోజూ ఎదురవుతున్న సమస్యలు ఏమని చెప్పుకోగలమంటున్నారు. చెప్పుకుంటే ఒకవైపు ఉపాధి పోతుందనీ, మరోవైపు కుటుంబంలో సమస్యలు తలెత్తుతాయనీ చెప్పారు. మున్సిపల్ రంగంలో మహిళలను జవాన్లు వేధిస్తున్నారని చెప్పారు. "తాము చెప్పినట్టు వినకపోతే" అటెండెన్స్ వేయకుండా వేధిస్తున్నారు. పని అప్పగించకుండా పక్కన పెడుతున్నారు. చెప్పినట్టు వినకపోవటం అంటే ఏమిటో తెలిసిందే! జవాన్లు ఎక్కువమంది బీసీలున్నారు. పారిశుధ్య కార్మికులలో దళిత మహిళలున్నారు. కొద్దిమంది దళిత జవాన్లు ఉన్నప్పటికీ.. వారుకూడా ఇదే ధోరణి ప్రదర్శిస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. అనేకచోట్ల మహిళలకు మూత్రశాలలు లేవు. దీనివల్ల మూత్రం ఆపుకోవటం లేదా మంచినీళ్ళు తగినన్ని తాగకపోవటం వల్ల మూత్రకోశ వ్యాధులు వస్తున్నాయి. మధ్యతరగతి ఉద్యోగులున్న కాలనీలలో కూడా పారిశుధ్య కార్మికులకు మంచినీరు ఇచ్చేటపుడు అవమానకర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. పైనుంచి దోసిట్లో పోయటం లేదా లోటాలతో ఇస్తున్నారు.

పట్టణాలలో దళితులు, గిరిజనులు, ముస్లిం, క్రైస్తవులకు ఇండ్లు కిరాయికి దొరకటం సమస్యగా ఉన్నది. ముందే కులం అడుగుతున్నారు. పొరపాటున ఇచ్చినప్పటికీ, కులం తెలియగానే ఖాళీ చేయిస్తున్నారు. అనేకచోట్ల ఇంటిముందు 'శాఖాహారులకు మాత్రమే' అనే బోర్డులు కూడా పెడుతున్నారు. నల్లగొండలో రాష్ట్ర ప్రభుత్వో ద్యోగులకు కూడా ఇదే దుస్థితి. ఒక ఉద్యోగికి, ఇంకా ఇంట్లోకి మారకముందే, తీసుకున్న అడ్వాన్స్ తిరిగి ఇచ్చేసారని చెప్పి బాధపడ్డాడు. కాంట్రాక్టు ఉద్యోగులకు ఈ సమస్య మరింత తీవ్రంగా ఉన్నది. సిద్దిపేటలో షాప్ వర్కర్లు కూడా ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నారు. మెదక్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయులు కూడా ఇదే అనుభవాన్ని చెప్పారు. చివరకు కలెక్టర్ కార్యాలయం ఉద్యోగికి కూడా ఈ వివక్ష తప్పలేదు. ఉద్యోగి దళితుడని తెలిసిన వెంటనే రెడ్డి సామాజిక తరగతికి చెందిన ఇంటి యజమాని కిరాయికి ఇవ్వడానికి నిరాకరించాడు. స్థానిక శాసనసభ్యుడి జోక్యం కూడా ఫలించలేదు. నిర్మాణ రంగంలో కార్మికులు భోజన సమయంలో దళితులకు దూరంగా ఇతర కులాలవారు కూర్చుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులుగా దళిత మహిళలను నిరాకరిస్తున్నారు. దళితులు చేసిన వంటను తమ పిల్లలకు పెట్టవద్దని అడ్డుకుంటున్నారు. కొన్ని సందర్భాలలో ఇవి ఘర్షణలకు దారితీశాయి. పోలీసుల జోక్యందాకా పోయిన సందర్భాలున్నాయి. అనేక గ్రామాలలో అంబేద్కర్ విగ్రహాలకు పోటీగా శివాజీ విగ్రహం పేరుతో బీసీలను ఎగదోస్తున్నారు. చాలాచోట్ల వీరి వెనుక బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతలుంటున్నారు. భూపాలపల్లి జిల్లాలో ఆటోడ్రైవర్ కూడా వివక్ష సమస్య ఎదుర్కొన్నానని చెప్పాడు. ఒక బీసీ వ్యక్తి ఆటోలో కూర్చుండగా, అదే గ్రామానికి చెందిన ఎస్సీ వ్యక్తి ఆటోలో కూర్చోడానికి అంగీకరించలేదు. ఈ వాదోపవాదాలలో ఆటోడ్రైవర్ కూడా



దళితుడని తెలియడంతో బీసీ వ్యక్తి ఆటో దిగి వెళ్ళిపోయాడు. మెదక్ జిల్లాలో వివక్షకు సంబంధించిన ఘటనలు కలెక్టర్ దృష్టికి తెచ్చిన తర్వాత గ్రామసభలు ప్రారంభించారు. తహసీల్దార్, పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ హాజరై వివక్షలు ప్రదర్శించవద్దని చెపుతున్నారు. ఈ ప్రయత్నం ఎంతకాలం జరుగుతుందో చూడాలి. ఏమైనా.. ఆమేరకు మంచి ప్రయత్నమే.

గ్రామాలూ, పట్టణాలన్న తేడా లేదు. చదువుతో కూడా పెద్దగా సంబంధం లేదు. తరతమ స్థాయిల్లో అన్ని చోట్లా ఈ వివక్ష ఉన్నది. అందుకే ఏప్రిల్ 6 నుంచి 14 వరకు కార్మికవర్గం 'సామాజిక న్యాయ వారోత్సవాలు' నిర్వహించింది. ఈ తేదీలకు ప్రాధాన్యత ఉన్నది. ఏప్రిల్ 6 తొలితరం కార్మికవర్గ నేత బిటి రణదివే వర్ధంతి. కార్మికవర్గ ఐక్యతకు కులం ఆటంకంగా ఉన్నదని ఆనాటికే ఆయన గుర్తించారు. 'కులం, వర్గం, కార్మికవర్గ ఐక్యత' పేరుతో ఒక కరపత్రం విడుదల చేశారు. ఇప్పటికీ ఆ కరపత్రం మార్గదర్శిగా ఉపయోగపడుతున్నది. ఏప్రిల్ 11న మరో సామాజిక ఉద్యమ నేత జ్యోతీరావు ఫూలే జయంతి. ఏప్రిల్ 14 బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి. అందుకే ఈ వారం రోజులు సామాజిక న్యాయ వారోత్సవాలుగా నిర్వహించారు. సరిగా ఇదే సమయంలో ఏప్రిల్ 10న విమలా రణదివే జయంతి కూడా. ఆమె తొలితరం శ్రామిక మహిళా నేత. ఈ సందర్భంగా ఆ మహనీయులను స్మరించుకుంటూ అన్ని జిల్లాలలో నివాళులు

> పట్టణాలలో దళితులు, గిరిజనులు, ముస్లిం, క్రైస్తవులకు ఇండ్లు కిరాయికి దొరకటం సమస్యగా ఉన్నది. ముందే కులం అడుగుతున్నారు. పొరపాటున ఇచ్చినప్పటికీ, కులం తెలియగానే ఖాళీ చేయిస్తున్నారు. అనేకచోట్ల ఇంటిముందు 'శాఖాహారులకు మాత్రమే' అనే బోర్డులు కూడా పెడుతున్నారు. నల్లగొండలో రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు కూడా ఇదే దుస్థితి. ఒక ఉద్యోగికి, ఇంకా ఇంట్లోకి మారకముందే, తీసుకున్న అడ్వాన్స్ తిరిగి ఇచ్చేసారని చెప్పి బాధపడ్డాడు. కాంట్రాక్టు ఉద్యోగులకు ఈ సమస్య మరింత తీవ్రంగా ఉన్నది. సిద్దిపేటలో షాప్ వర్కర్లు కూడా ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నారు. మెదక్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయులు కూడా ఇదే అనుభవాన్ని చెప్పారు.

అర్పించారు. వివక్ష గురించి వివిధ రంగాల కార్మికులలో చేసిన సర్వేలో దిగ్భ్రాంతి కలిగించే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. ఈ వారోత్సవాలను పురస్కరించుకుని కులవివక్షకు, లింగవివక్షకు వ్యతిరేకంగా విస్తృతంగా క్యాంపెయిన్ నిర్వహించింది. అనేక జిల్లాలలో పది కిలోమీటర్ల 'న్యాయం కోసం నడక' (10కె వాక్ ఫర్ జస్టిస్) నిర్వహించారు. ఇవన్నీ కార్మికవర్గంలో ఐక్యతా స్ఫూర్తి నింపేందుకు తోడ్పడతాయి.

ఒక కార్మిక సంఘం సామాజిక న్యాయ వారోత్సవాలు నిర్వహించటం, ఈ సందర్భంగా కార్మికవర్గాన్ని సమీకరించి చైతన్యపరచటం చర్చకు దారితీసింది. ఇవి కూడా కార్మికసంఘం చేస్తే "ఇక మేమేం చేయాలి?" అని కొన్ని కుల సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. సామాజిక న్యాయం గురించి కులసంఘాలే మాట్లాడాలని పెట్టుబడిదారీ వర్గంగానీ, బూర్జువా పార్టీలుగానీ కోరుకుం టున్నాయి. కార్మిక సంఘాలు సామాజిక న్యాయం గురించి మాట్లాడటాన్ని వీరు జీర్ణించుకోలేక పోతున్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లకు కులసంఘాలు మాట్లాడటం కూడా ఇష్టం లేదు. కులవ్యవస్థ, లింగవివక్ష కొనసాగాలని బాహాటంగానే చెపుతున్నారు. అందుకే మనువాదాన్ని బలవంతంగా రుద్దేందుకు ప్రయత్ని స్తున్నారు. సామాజిక న్యాయం కోసం సిఐటియు నిర్వహించిన వారోత్సవాలకు ప్రాధాన్యత సంతరించు కున్నది. కులసంఘాలు నిర్వహించినపుడు ఆయా కులాల ప్రయోజనాలు ముందుకొస్తున్నాయి. కుల చైతన్యమే బలపడుతున్నది. కులాలు మరింత బలపడడానికే దోహదపడుతున్నాయి. ఇందుకు భిన్నంగా కార్మిక వర్గమే ఈ ఉత్సవాలు నిర్వహించటం వల్ల వర్గ చైతన్యం పెరుగుతున్నది. కార్మికవర్గ ఐక్యత ఆవశ్యకత ముందు కొస్తున్నది. కులం, పురుషాధిక్యత కార్మికవర్గ ఐక్యతకు ఆటంకంగా ఉన్నాయి. అందుకే కులవివక్ష, లింగవివక్షలకు వ్యతిరేకంగా కార్మికవర్గం ఐక్యంగా పోరాడవల్సిన అవసరం ఉన్నది. ఇందుకోసం జరుగుతున్న పోరాటాలకు కార్మికవర్గం అండగా నిలువటం కూడా అవసరం. ఈ వారోత్సవాల సందర్భంగా కార్మికవర్గానికి



"ఎన్నికల వేళ... ఉచితాల జోరు"

గత మూడు దశాబ్దాలుగా దేశవ్యాప్తంగా జరుగుతున్న పార్లమెంట్, వివిధ రాష్ట్రాల శాసనసభలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు దండుకునే క్రమంలో రాజకీయ పార్టీలు, వివిధ రకాల పథకాలు, వాగ్దానాలతో ఓటర్ల ముందుకు వస్తున్నాయి. ఒకరికి మించి ఒకరు సాధ్యం కాని, ఆమాటకొస్తే ఆదాయానికి మించి అప్పులు చేసే విధంగా వాగ్దానాలు ఇస్తూ అధికారం చేపట్టడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు. ఆంధ్రప్రదేశ్ నవరత్నాలు పేరుతో అధికారం చేపట్టిన ప్రస్తుతం ప్రభుత్వం ఆ వాగ్దానాలు అమలు కొరకు గత నాలుగేళ్ళుగా ఎన్ని వేల కోట్ల రూపాయలు అప్పులు చేస్తున్నారో... అందరూ చూస్తూనే ఉన్నారు. సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందించుట మంచిదే. కానీ ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించకుండా, ముఖ్యంగా చదువుకున్న యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించకుండా, పరిశ్రమలు స్థాపించకుండా, కేవలం వచ్చిన ఆదాయాన్ని ఉచితాలకు ఖర్చు చేసుకుంటూ పోతే భవిష్యత్తు ఏంటి..!? ఆలోచన చేయాలి.

ఇటీవల కాలంలో పంజాబ్‌లో జరిగిన ఎన్నికల్లో కూడా ఎన్ని పథకాలు, వాగ్దానాలు ఇస్తూ ఆప్ పార్టీ అధికారంలోకి వచ్చిందో అందరికీ తెలిసిందే. ప్రస్తుతం అధికారంలో ఉన్న వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు అన్ని కూడా ఆయా ప్రజలకు అనేక ఉచిత పథకాల హామీలు ద్వారా అధికారంలోకి వచ్చాయి. సంక్షేమ పథకాలు అమలు ద్వారా సమాజంలో అసమానతలు తొలగించేందుకు ప్రయత్నాలు చేయాలి. సంక్షేమ రాజ్య స్థాపనకు కృషి చేయాలని రాజ్యాంగం కూడా సూచిస్తుంది. కానీ ప్రజలను ప్రలోభాలకు గురి చేయకూడదు. ముఖ్యంగా ప్రజలను, యువతను తమ కాళ్ళపై తాము స్వతంత్రంగా బతికే పరిస్థితికి ప్రభుత్వాలు కృషి చేయాలి. దానికనుగుణంగా విద్య, నైపుణ్యా లందించాలి. పరిశ్రమలు స్థాపించి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలి. అప్పుడు మాత్రమే తలసరి ఆదాయం పెరుగుతుంది. పేద, మధ్య తరగతి ప్రజల జీవితాలు మెరుగుపడుతాయి. రాష్ట్ర, దేశ జీడీపీ వృద్ధి చెందుతుంది. వస్తుఉత్పత్తి, రవాణా, ఎగుమతులు ద్వారా ఆదాయం సమకూర్చుకుంటూ రాష్ట్రాలు, దేశం కూడా పురోభివృద్ధి సాధిస్తారు. ఆ విధంగా పార్టీలు తమ ఎజెండాతో ఎన్నికల వేళ ప్రజల ముందుకు రావాలి.

ఇక ప్రస్తుతం జరుగుతున్న కర్నాటక రాష్ట్ర ఎన్నికల వేళ ఆయా పార్టీలు ఎన్నెన్నో వాగ్దానాలు ఇస్తూ అధికారం చేపట్టడానికి విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి డెబ్బై ఐదు సంవత్సరాల పూర్తయినా, అనేక సంవత్సరాలుగా అనేక వర్గాల ప్రజలకు అనేక రాయితీలు ఇస్తున్నా, నేటికీ చాలామంది పేదరికంలో ఉండటానికి కారణం ఏమిటి..!? ఈ వాస్తవాన్ని అందరూ గ్రహించాలి. ప్రజలందరికీ విద్యా, వైద్యం అందించకుండా, తగిన నిధులు మంజూరు చేయకుండా ఎన్ని పథకాలు, అమలు చేసినా దేశంలోని పేదరికం నిర్మూలించడం అసాధ్యం. చదువుకున్న యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ప్రభుత్వాలు ఉత్పాదక రంగాలకు బడ్జెట్ కేటాయింపులు పెంచాలి. మేథోవలసలు అరికట్టాలి. ప్రతీ సంవత్సరం మనదేశం నుంచి అనేక లక్షల మంది దేశ పౌరసత్వం వదులుకుని, ఇతర దేశాలకు శాశ్వతంగా వెళ్ళిపోవడం దేనికి సంకేతమో చెప్పగలరా? ధరల పెరుగుదలకు ముకుతాడు వేయాలి. వ్యవసాయ రంగానికి, రైతులకు ప్రభుత్వాలు భరోసా కల్పించాలి. కేవలం ఉచితాలు ద్వారా వాస్తవ పరిస్థితిని మార్చలేమనేది వాస్తవంగా గ్రహించాలి. ఇటీవల కాలంలో ప్రతి నెలా పేద మధ్య తరగతి ప్రజల కొనుగోలు శక్తి ద్వారా ప్రభుత్వానికి జీఎస్టీఈ రూపంలో వస్తున్న లక్షల కోట్ల రూపాయలు ఏయే రంగాలకు ఖర్చు చేస్తున్నారో ప్రజలందరికీ తెలియాలి.

గత నెల ఏప్రిల్ నెలలో రికార్డు స్థాయిలో 1.87లక్షల రూపాయలు జీఎస్టీ రాబడి వచ్చిందని గణాంకాలు చెబుతున్నాయి. ఈ రాబడులతో వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో ఎక్కువగా ఖర్చు చేస్తే గనుక స్వావలంబన దిశగా అడుగులు వేసే అవకాశం ఉంది. అంతేగానీ, అనుత్పాదక రంగాల్లో ఖర్చు చేయడం ద్వారా ఫలితాలు శూన్యం. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయల అప్పుల ఊబిలో కూరుకు పోయింది. అదేబాటలో వివిధ రాష్ట్రాలూ ఉన్నాయి. ఎఫ్ఆర్‌బియం పరిధి దాటి అనేక వేల కోట్ల రూపాయల అప్పులు చేస్తున్నాయి. ఎన్నికల వేళ పార్టీలు ప్రజల వాస్తవ జీవితాల్లో వెలుగులు నింపేందుకు అవసరమైన విద్యా, వైద్యం ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే వాగ్దానాలు ఇస్తూ అధికారం చేపట్టడానికి ప్రయత్నాలు చేయాలి. అదే విధంగా ప్రజలు కూడా తమ భవిష్యత్తుకు భరోసా ఇచ్చే పార్టీలకు అండగా నిలవాలి. తాత్కాలిక ఉపశమనం పొందే ఉచితాలుకు లొంగరాదు. కుల, మత, వర్గ ప్రాంతీయ భాషా, లింగ వంటి సంకుచిత భావాలకు లొంగకుండా, తమకు, తమ పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించే పార్టీలకు అండగా ఉండుట ద్వారానే భారత్ భవిష్యత్తులో అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో చేరుతుంది.

- రావుశ్రీ

ఆదివాసీ సాంస్కృతిక జీవనంపై హిందుత్వ దాడి



కె. బ్రహ్మచారి

పచ్చని అడుగులు చుట్టూ ఎత్తయిన కొండలు ఆ కొండలపై నుండి జాలువారే అందమైన జలపాతాలు, గలగల పారే జీవనదులు, వాగులు వంకలు, పక్షుల కిలకిల రాగాలతో ప్రశాంతమైన వాతావరణం. అత్యంత రమణీయమైన ప్రకృతి ఒడిలో ప్రకృతితో కలిసి జీవించే ఆదిమ తెగలే ఆదివాసీ ప్రజలు. కల్లాకపటం ఎరుగని, కల్మషం లేని కష్టజీవులు. కళ్ళముందే విలువైన ప్రకృతి సంపద ఎంత ఉన్నా ఆకలి తీర్చుకోవటానికి తప్ప వ్యాపారానికి ఉపయోగించటం నేరంగా భావిస్తారు. అడవిని, అటవీ సంపదను వన్యప్రాణులను సంరక్షిస్తూ, క్రూర మృగాలతో కలిసి జీవిస్తూ పర్యావరణాన్ని రక్షించుకుంటూ భారతదేశ ఆదిమ సంస్కృతికి పునాదిగా జీవిస్తున్న వారు. అలాంటి ఆదివాసుల సాంస్కృతిక, ఆర్థిక జీవనం నేడు ప్రమాదంలో పడింది. పచ్చని అడవిపైన అడవిలోని విలువైన గనులు, ఖనిజాలు, నీరు, అటవీ సంపదపై అంబానీ, ఆదానీ వంటి స్వదేశీ, విదేశీ కంపెనీల కన్నుబడింది. సమిష్టి తత్వానికి ప్రతీకగా స్త్రీ, పురుష వత్యాసాలు లేకుండా కష్టసుఖాలను కలిసి పంచుకునే ఆదిమ సంస్కృతి, ఆదివాసీ ప్రజల భాష, పండుగలు పాటలు, సాహిత్యం, ఆర్థిక సాంస్కృతిక జీవనంపై హిందూ మతోన్మాదుల దాడి, ప్రపంచీకరణ విష సంస్కృతి ఆధిపత్య భావజాలం ఏకకాలం జరుగుతున్నది. స్వచ్ఛమైన ఆదివాసీ జీవనంపైన హిందుత్వశక్తులు కత్తి కట్టాయి. డోలు దరువులపై, అందెల సవ్వడి మధ్య సాగే నా రేలా పాటలపై భక్తి పాటలు, భావ దారిద్ర్యం, డిజె సౌండ్ మధ్య స్వచ్ఛమైన ప్రకృతి భావాలు నలిగి పోతున్నాయి. ఆదిమ కాలపు వారసత్వానికి ఆనవాళ్లుగా ఉన్న ఆదివాసీలపై అభివృద్ధి పేరిట పాలకవర్గాలు సాగిస్తున్న దాడిపై ఆర్థిక సాంస్కృతిక రంగంలో ప్రతిఘటన ఉద్యమం పెల్లుబికవలసిన తరుణం ఆసన్నమైంది.

ఆదివాసీలది హిందూ సంస్కృతి కాదు

ఆదిలాబాద్ నుండి భద్రాచలం వరకు గోదావరి పరివాహక ప్రాంతం అంతా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, ఒరిస్సా ఆంధ్రప్రదేశ్‌లోని ఆదివాసీ ప్రాంతా లకు తెలంగాణ ఆదివాసి భూభాగం ఉన్నది తెలంగాణలో 33 ఆదివాసి తెగలకు సంబంధించిన ఆదివాసి ప్రజలు రాష్ట్రంలో జీవనం సాగిస్తున్నారు. ఆదివాసులకు మతం లేదు, కులం లేదు. వారిదంతా తెగల సంస్కృతి. ఒక సమూహం, సమిష్టి జీవన విధానం. ఆదిమ సమాజపు కొనసాగింపు సంస్కృతికి ప్రతీకలు, పునాదులు ఆదివాసీ ప్రజలు. సమిష్టితత్వం దీనికి పునాది. అసమానతలు ఆధిపత్య భావజాలం లేని గొప్ప ప్రజాస్వామిక సమాజం ఆదివాసి సమాజం. కానీ హిందూ మతం, హిందూ మత సంస్కృతిలో ఉన్న అంతరాలు నిచ్చెన మెట్ల వ్యవస్థ, కులతత్వం భూస్వామ్య వ్యవస్థ తాలూకు ఆధిపత్య భావజాలం, స్త్రీలను తక్కువగా చూడటం, ఆస్తి సంబంధాల్లో సమాన హక్కులు లేకపోవడం చాలా స్పష్టంగా కనబడుతుంది. అటువంటి హిందూ మత సంస్కృతి భావజాలం నేడు ఆదివాసి సాంస్కృతిక జీవనంలో చొచ్చుకుని పోతుంది. కుటుంబ వ్యవహారాలు, ఆచారాలు సాంప్రదాయాల్లో హిందూ మత సనాతన ధర్మాలను చెప్పించడం ద్వారా ఆదివాసులు హిందూ మతంలో భాగమే అనే ఒక కొత్త వాదనను బీజేపీ రాజకీయ సైద్ధాంతిక సంస్థ అయిన ఆర్ఎస్ఎస్ దాని అనుబంధ సంస్థలైన వనవాసి కళ్యాణ్ పరిషత్ గిరిజన మోర్చా వంటి సంస్థలు ఆదిమ సంస్కృతిని విచ్ఛిన్నం చేయడం ద్వారా హిందూ మత సాంస్కృతిక ఆధిపత్యాన్ని ఆదివాసీలపై రుద్దుతున్నారు. ఆదివాసి పండుగలకు, హిందూ పండుగలకు, క్రైస్తవ పండుగలకు ఏమాత్రం సంబంధం లేదు. కానీ ప్రస్తుతం ఆదివాసి పండుగలను కనుమరుగు చేసే స్థాయికి హిందూ ఉన్మాద సంస్థలు ఆయుధాలను ఎక్కుపెట్టాయి. ఆదివాసులు ప్రకృతి ప్రేమికులు, ప్రకృతిని ఆరాధిస్తారు, పూజిస్తారు. దాంతోనే కలిసి



జీవిస్తారు. భూమి, అడవి ఆదివాసీలకు ప్రధానమైన ఉత్పత్తి వనరులు. ప్రకృతిలో కాలానుగుణంగా వచ్చే మార్పులకు అనుగుణంగా ఆదివాసీల పండుగలు జరుగుతాయి. భూమి పండగ చేయకుండా పంటలు వేయరు. పంటలు చేతికొచ్చే సమయాన నవంబర్ నుండి జనవరి మాసాల్లో కొత్తల పండుగ నిర్వహిస్తారు. కానీ ప్రపంచీకరణ, హిందూ మతోన్మాద శక్తుల ప్రమేయం వెరసి అసలైన ఆదివాసీల పండగ స్థానాల్లో వినాయక మండపాలు, దేవీ నవరాత్రులు, అయ్యప్ప పీఠాలు శ్రీరాముని మాలలు వచ్చి చేరుతున్నాయి. రేలా పాటలను డీజే పాటలు తొక్కేస్తున్నాయి. ఆదివాసుల పండుగలను హిందూ దేవతమూర్తుల పండుగలు మింగేస్తున్నాయి. ప్రకృతితో పెన వేసుకున్న ఆదివాసుల సాంస్కృతిక జీవనంపై మతం పేరిట ఉన్మాద శక్తులు సాగిస్తున్న దాడికి ఇదొక సజీవ సాక్ష్యం.

ఆదివాసులను అడవినుంచి వెళ్లగొట్టే కుట్ర

ఆదివాసులను, అడవిని విడదీయలేం. కానీ కేంద్ర బీజేపీ ప్రభుత్వం అదాని, అంబానీ వంటి స్వదేశీ విదేశీ కంపెనీలకు అటవీ సంపదను ప్రకృతి వనరులను దోచిపెట్టడం కోసం ఆదివాసులను అడవుల నుండి వెళ్లగొడుతున్నది. స్వాతంత్రానికి పూర్వం నుండి పోరాడి సాధించుకున్న చట్టాలను భారత పాలకవర్గాలు మార్పులు చేసుకుంటూ వచ్చాయి. చివరికి ఆదివాసీలకు ప్రస్తుతం రాజ్యాంగబద్ధంగా సంక్రమించిన హక్కులను సైతం రద్దు చేసే కుట్రలు చేస్తున్నారు. 1865 నుండి మొదలు 2006 వరకు వచ్చిన అటవీ హక్కుల గుర్తింపు చట్టం దాకా ప్రతి చట్టం రావడం వెనుక వీరోచితమైన ఆదివాసి పోరాటాలు, త్యాగాలు ఉన్నాయి. చారిత్రాత్మక పోరాటాల ఆధారంగా సాధించుకున్న హక్కులను నేడు బీజేపీ ప్రభుత్వం రద్దు చేస్తుంది. 2019 నూతన అటవీ చట్టం పేరుతో అటవీ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతుంది. అందుకు అనుగుణంగానే తెలంగాణ రాష్ట్రంలో నల్లమల్ల అటవీ ప్రాంతంలో ఉన్న విలువైన యురేనియం నిలువలను ప్రయివేటు కంపెనీలకు కట్టబెట్టడం కోసం అక్కడి చెంచు ఆదివాసీలను అడవుల నుంచి గెంటేయాలని చూస్తున్నది. ఆదిలాబాద్ జిల్లాలో వన్యప్రాణుల సంరక్షణ కేంద్రం పేరుతో, ఆసిఫాబాద్ జిల్లాలో పులుల సంరక్షణ పేరిట, భద్రాద్రి జిల్లాలో సింగరేణి గనుల విస్తీరణ, పోలవరం ప్రాజెక్టు పేరిట ఆదివాసి గ్రామాలను ఖాళీ చేయించి అక్కడున్న సకల సంపదలను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టాలని కేంద్రం తీవ్రంగానే ప్రయత్నం చేస్తున్నది. అభివృద్ధి పేరిట ఆదివాసీ హక్కుల పైన ఆదివాసీ సాంస్కృతిక జీవనం పైన కేంద్ర ప్రభుత్వము, హిందూ మతోన్మాద సంస్థలు కార్పొరేట్ కంపెనీలు బహుముఖ రూపాల్లో దాడి సాగిస్తున్నాయి. ఆదివాసీల చరిత్ర మొత్తం పోరాటాల మయం. భారతదేశంలో వర్లి ఆదివాసీల తిరుగుబాటు. బీర్సా ముండా పోరాటం, తెలంగాణ గడ్డమీద కొమరంభీమ్ సాగించిన ఉద్యమం, బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా అల్లూరి సీతారామరాజు పోరాటం ఆదివాసి హక్కులపై, పాలకవర్గాల దాడికి వ్యతిరేకంగా సాగాయి. అటువంటి పోరాట స్ఫూర్తిని, తెగువను ప్రదర్శించాల్సిన తరుణం ఆదివాసీకి సమాజానికి ఆసన్నమైంది. సంస్కృతి పరిరక్షణ అడవి, భూమి మీద హక్కు, విద్య, ఉపాధి అవకాశాల కోసం పాలకవర్గాన్ని ఎదిరించి పోరాడకపోతే ఇంతకాలం పోరాడి సాధించుకున్న హక్కులు అంతరించిపోతాయి. మానవ సమాజానికి పునాదిగా నిలిచిన ఆదిమ తెగలు కనుమరు గయ్యి పోయే పరిస్థితి నేటి బీజేపీ పాలనలో స్పష్టంగా కనబడుతుంది. అందుకని ఆదివాసీ ప్రజలతోపాటు వారి అభివృద్ధిని కోరుకునే సంఘాలు, సంస్థలు, రాజకీయ పార్టీలు ఆదివాసీ సంస్కృతి పరిరక్షణ కోసం సమిష్టిగా పోరాడాల్సిన అవసరం తప్పనిసరి. పోరాటాల ద్వారానే మాత్రమే హక్కులు రక్షిం చబడతాయనేది చారిత్రక వాస్తవం. ఆదివాసి ప్రజలు ఆ పోరాటాల ద్వారానే ఉన్న హక్కుల్ని కాపాడుకోవాలి. కొత్త హక్కుల్ని సాధించుకోవడం లక్ష్యంగా ఉద్యమించాలి.

(మే 5,6 తేదీల్లో భద్రాచలంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర మూడవ మహాసభలు)

> సంస్కృతి పరిరక్షణ అడవి, భూమి మీద హక్కు, విద్య, ఉపాధి అవకాశాల కోసం పాలకవర్గాన్ని ఎదిరించి పోరాడకపోతే ఇంతకాలం పోరాడి సాధించుకున్న హక్కులు అంతరించిపోతాయి. మానవ సమాజానికి పునాదిగా నిలిచిన ఆదిమ తెగలు కనుమరు గయ్యి పోయే పరిస్థితి నేటి బీజేపీ పాలనలో స్పష్టంగా కనబడుతుంది. అందుకని ఆదివాసీ ప్రజలతోపాటు వారి అభివృద్ధిని కోరుకునే సంఘాలు, సంస్థలు, రాజకీయ పార్టీలు ఆదివాసీ సంస్కృతి పరిరక్షణ కోసం సమిష్టిగా పోరాడాల్సిన అవసరం తప్పనిసరి. పోరాటాల ద్వారానే మాత్రమే హక్కులు రక్షిం చబడతాయనేది చారిత్రక వాస్తవం. ఆదివాసి ప్రజలు ఆ పోరాటాల ద్వారానే ఉన్న హక్కుల్ని కాపాడుకోవాలి. కొత్త హక్కుల్ని సాధించుకోవడం లక్ష్యంగా ఉద్యమించాలి.



బియ్యంపిండితో...

కావాల్సిన పదార్థాలు : బియ్యం పిండి - ఒక కప్పు, ఉల్లిగడ్డ - అర ముక్క, టొమాటో - అర ముక్క, క్యాప్సికం - ఒక ముక్క, పచ్చిమిర్చి - ఒకటి, కొత్తిమీర తరుగు - రెండు చెంచాలు, జీలకర్ర పొడి - ఒక చెంచా, ఉప్పు - రుచికి సరిపడా, నూనె - తగినంత.

తయారు చేసే విధానం : ఒక గిన్నెలో బియ్యం పిండి వేసి నీళ్ల కలపాలి. ఉండల్లేకుండా బాగా గిలక్కొట్టాలి. ఉప్పు వేయాలి. ఉల్లిగడ్డ, టొమాటో, క్యాప్సికం, పచ్చిమిర్చి, కొత్తిమీర తరుగులు వేసి బాగా కలపాలి. జీలకర్ర పొడి కూడా వేసి కలపాలి. దోశెలు పోసేంత వీలుగా పిండిని కలుపుకోవాలి. అవసరం అయితే నీళ్ల కలుపుకోవచ్చు. ఆ పిండిని దోశెల్లో పోసుకోవాలి. ఏ చట్నీతో తిన్నా ఇవి టేస్ట్‌గా ఉంటాయి.

కొందరు ఆఫీసుకు ఉదయానే ఏడు గంటల షిఫ్ట్‌కే వెళ్లాల్సి ఉంటుంది. దాంతో ఇంట్లో అన్నీ రెడీ చేసుకొని వెళ్ళడం చాలా కష్టం. ముఖ్యంగా బ్రేక్‌ఫాస్ట్ ఏం చేయాలో అర్థం కాదు. సెలవులతో ఇంట్లో ఉండే పిల్లలు రకరకాల రుచులు కోరుతుంటారు. దాంతో మనకు బ్రేక్

పదినిమిషాల్లో రెడీ

ఫాస్ట్, లంచ్ వండడం కష్టంగా మారుతుంది. సులువుగా వండే బ్రేక్ ఫాస్ట్ రెసిపీలు తెలుసుకుంటే పెద్ద కష్టపడకుండా అప్పటి కప్పుడే టిఫిన్ రెడీ చేసి పెట్టేయచ్చు. ఉదయానే త్వరగా రెడీ అయ్యే బ్రేక్ ఫాస్ట్ వెరైటీలు కొన్ని ఉన్నాయి. పైగా వాటిలో పోషకాహార విలువలు కూడా అధికం. అవేంటో తెలుసుకుందాం...

శెనగపిండితో...

కావాల్సిన పదార్థాలు : శెనగపిండి - ఒక కప్పు, ఉల్లిగడ్డ - ఒకటి, పసుపు - చిటికెడు, పచ్చి మిర్చి - ఒకటి, అల్లం వెల్లుల్లి పేస్టు - ఒక చెంచా, కొత్తిమీర తరుగు - రెండు చెంచాలు, ఉప్పు - రుచికి సరిపడా, నూనె - సరిపడినంత.



తయారు చేసే విధానం : గిన్నెలో శెనగపిండి, ఉప్పు వేసి బాగా కలపాలి. నీళ్ల కలిపి దోశెల పిండిలా కలుపుకోవాలి. ఉల్లిగడ్డ తరుగు, పచ్చిమిర్చి తరుగు, అల్లం వెల్లుల్లి పేస్టు, కొత్తిమీర తరుగు వేసి మళ్ళీ కలపాలి. మనకు ఇష్టమైతే అందులో జీలకర్ర కూడా వేసుకోవచ్చు. పెనంపై నూనె రాసి దోశెలా వేసుకుంటే సరి. పదినిమిషాల్లో ఇది రెడీ అయిపోతుంది.

జొన్నపిండితో...

కావాల్సిన పదార్థాలు : జొన్న పిండి - ఒక కప్పు, పెరుగు - అరకప్పు, ఉల్లిగడ్డ - అర ముక్క, టొమటో - అర ముక్క, క్యాప్సికమ్ - అర ముక్క, ధనియాల పొడి - సగం చెంచా, యాలకుల పొడి - సగం చెంచా, గరం మసాలా పొడి - పావు చెంచా, కొత్తిమీర తరుగు - రెండు చెంచాలు, ఉప్పు - రుచికి సరిపడా, నూనె - సరిపడినంత.



తయారు చేసే విధానం : ఒక గిన్నెలో జొన్నపిండిని వేసి ఉప్పు, మసాలాలు కలుపుకోవాలి. పెరుగు కూడా వేసి బాగా గిలక్కొట్టాలి. దోశెలు పోసుకోవడానికి వీలుగా నీరు పోసి కలుపుకోవాలి. ఉల్లిగడ్డ, టొమాటో, క్యాప్సికం, కొత్తిమీర వంటివి సన్నగా తరుక్కోవాలి. వాటిని పిండిలో కలపాలి. స్టవ్ పై పెనం పెట్టి పైన నూనె రాసి దోశెలు పోసుకోవాలి.

గోధుమ పిండితో...

కావాల్సిన పదార్థాలు : గోధుమ పిండి - ఒక కప్పు, ఉల్లిగడ్డ - అర ముక్క, పచ్చిమిర్చి - ఒకటి, కొత్తిమీర తరుగు - రెండు చెంచాలు, జీలకర్ర పొడి - ఒక చెంచా, ఉప్పు - రుచికి సరిపడా, నూనె - తగినంత.



తయారు చేసే విధానం : ఒక గిన్నెలో బియ్యం పిండి వేసి నీళ్ల కలపాలి. ఉండల్లేకుండా బాగా గిలక్కొట్టాలి. ఉప్పు వేయాలి. ఉల్లిగడ్డ, పచ్చిమిర్చి, కొత్తిమీర తరుగులు వేసి బాగా కలపాలి. జీలకర్ర పొడి కూడా వేసి కలపాలి. దోశెలు పోసేంత వీలుగా పిండిని కలుపుకోవాలి. అవసరం అయితే నీళ్ల కలుపుకోవచ్చు. ఆ పిండిని దోశెల్లా పోసుకోవాలి. ఏ చట్నీతో తిన్నా ఇవి రుచిగానే ఉంటాయి.

ఆసక్తి తగ్గుతుందా..?

జీవితం రొటీన్‌గా ఉన్నప్పుడు నిరాశానిస్పృహలు ఆవరిస్తుంటాయి. దాంతో కొందరికి రోజు రోజుకీ ఉద్యోగ జీవితంలో ఆసక్తి తగ్గిపోతుంటుంది. అనుకున్నంత ఉల్లాసంగా, ఉత్సాహంగా పని చేయలేకపోతారు. ఏదో తెలియని ఒత్తిడికి, ఆందోళనకు గురవుతుంటారు. అయితే ఈ సమస్యల నుంచి బయటపడడానికి కొన్ని చిట్కాలు ఉన్నాయంటున్నారు నిపుణులు...

- ఆఫీసులో చేస్తున్న పని మీద ఆసక్తి తగ్గిపోవడానికి మీరు ఏదో విషయంలో ఒత్తిడికి గురవడమో లేక మీరు పని చేస్తున్న రంగం మీద కాకుండా వేరే రంగం మీద ఆసక్తి ఉండడమో కారణం కావచ్చు. ఇలాంటి సందర్భాల్లో మీరు ఆలోచించి నిర్ణయం తీసుకోవడం మంచిది. లేదంటే మీ కెరీరే ప్రమాదంలో పడే అవకాశం ఉంటుంది.
- రోజూ రొటీన్ జాబ్ చేస్తున్నామనే భావన కలుగుతోందా? పనిలో ఆసక్తి తగ్గడానికి అదే కారణమని భావిస్తున్నారా.. అయితే ఇటువంటి సమయంలోనే మీ పనిని మీకు తగ్గ విధంగా మలచుకోండి. రోజూ చేసే పనినే విభిన్నంగా చేయడానికి ప్రయత్నించండి. అంతకు మించి మీరు చేస్తున్న పనిలోనే రోజుకో కొత్త విషయాన్ని నేర్చుకోవడానికి సంకల్పించండి.
మీ సహచర ఉద్యోగులతో విభేదాలే మీకు ఆఫీసు పనిలో నిరాసక్తతను, నిస్పృహలను కలిగిస్తున్నాయనుకుంటున్నారా? అయితే, అలాంటి విభేదాలను సాధ్యమైనంత వరకు పరిష్కరించుకోవడానికి ప్రయత్నించండి. స్నేహపూర్వకమైన వాతావరణంలో అందరినీ గౌరవిస్తూ, నిబద్ధతతో పని చేయండి.
- ఒక వేళ జీతభత్యాలు, పదోన్నతి విషయాల్లో తగిన ప్రతిఫలం అందడం లేదనే భావనే మీకు పనిలో అనాసక్తిని కలిగిస్తోందా.. అటువంటప్పుడు ఇంకా కష్టపడి పని చేయడానికి ప్రయత్నించండి. మీ నైపుణ్యాలకు మెరుగులు దిద్దుకోండి. ఇలా చేయడం వల్ల మీకంటూ ఆఫీసులో ఒక గుర్తింపు వస్తుంది. కేవలం కొన్ని విషయాలకే పరిమితమైపోకుండా, ఇతర విషయాల్లో కూడా కంపెనీ పురోభివృద్ధిని కోరుకొనే వారినే సంస్థ ప్రోత్సహిస్తుందని గుర్తుంచుకోండి.
- అలాగే మీరు ఏవైనా కుటుంబ సమస్యలు, వ్యక్తిగత సమస్యలతో సతమతమవుతున్నప్పుడు వాటి గురించి పదే పదే ఆఫీసులో ఆలోచించి మనసు పాడు చేసుకోవద్దు. వాటి ప్రభావం మీ పని మీద పడకుండా జాగ్రత్తపడాలి. ఈ విషయంలో ఏ మాత్రం తేడా వచ్చినా మీరు పని మీద దృష్టి కేంద్రీకరించలేక పదే పదే తప్పులు చేస్తూ ఇబ్బంది పడే అవకాశం ఉంటుంది.
- మీ ఆఫీసులో పద్ధతులకు అలవాటు పడకపోవడం వల్ల కూడా మీకు పని మీద ఆసక్తి తగ్గే అవకాశం ఉంది.. అయితే, ప్రతి కంపెనీకి ప్రత్యేకంగా కొన్ని నియమ నిబంధనలుంటాయన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. వాటికనుగుణంగానే పద్ధతులు ఉంటాయి. అందుకే సాధ్యమైనంత వరకు ఉత్సాహంగా పని చేయాలనుకొంటే వాటికి అలవాటు పడడమే మంచిది.



- ప్రణాళికాబద్ధంగా పని చేయకపోవడం కూడా మీ అనాసక్తికి కారణం కావచ్చు. మీకిచ్చిన పనిని నిర్ణీత సమయానికి అనుకున్న విధంగా పూర్తి చేయడానికి ప్రయత్నించండి. అలా చేయడం వల్ల పని ఆలస్యమవుతుందని అనవసర ఆందోళనకు, ఒత్తిడికి గురి కావక్కర్లేదు.
- మరో ముఖ్యమైన విషయమేమిటంటే, పని చేయడానికి బద్ధకం పెంచుకున్నా కూడా పనిలో ఆసక్తి తగ్గుతుంది. అందుకే పనులను వాయిదా వేయడం, ఆలస్యంగా పనులను ప్రారంభించడం వంటివి చేయకూడదు.
- కొంతమంది కొన్ని ఫుల్‌టైమ్ కోర్సులు చేస్తూ కూడా, ఎనిమిది గంటల డ్యూటీ చేయడానికి ప్రయత్నిస్తుంటారు. అలా చేయడం కూడా ఉద్యోగ జీవితంలో ఒత్తిడికి కారణమవుతుంది. అలాంటి వారు రెండు పడవల మీద ప్రయాణం చేయడం మాని, కెరీర్ మీదే దృష్టి కేంద్రీకరించడం మంచిది. అప్పుడే వారు ప్రొఫెషనల్‌గా ఎదగగలరు.

సహజంగా అదుపు చేద్దాం

సాధారణంగా పిరియడ్స్ 28 రోజులకే అవుతుంది. ఇది మహిళలందరిలో ఒకేలా ఉండదు. శరీర తీరును బట్టి మార్పులుంటాయి. హార్మోన్ల ప్రభావం వల్ల కొంతమందిలో అధిక రక్తస్రావం, ఒళ్లునొప్పులు అధికంగా ఉంటాయి. వీటిని సహజంగా అదుపులో పెట్టొచ్చంటున్నారు నిపుణులు..

- నొప్పులను తగ్గించేందుకు హాట్‌ప్యాక్‌లను వినియోగిస్తుంటాం. హాట్‌ప్యాక్‌ను పొత్తి కడుపుపై 20 నిమిషాల పాటు జరుపుతూ మర్దనా చెయ్యాలి. బ్లీడింగ్ ఎక్కువగా అవుతుంటే రోజులో ఇలా 2, 3 సార్లు చేస్తే తగ్గుతుంది.
- శరీరంలో ఐరన్ తగ్గితే కూడా అధిక రక్తస్రావం అవుతుందని అధ్యయనాల్లో తేలింది. నెలసరిలో వైద్యుల సలహాతో ఐరన్ మాత్రలను తీసుకోవచ్చు. దాంతో కొంత వరకూ బ్లీడింగ్‌ను అదుపులో ఉంచొచ్చు.
- ఓ కప్పు నీళల్లో ఓ అంగుళం ముక్క దాల్చిన చెక్కను వేసి కాచుకొని తాగాలి. ఒళ్లు నొప్పులను అదుపులో ఉంచడమే కాక బ్లీడింగ్‌ని కూడా తగ్గిస్తుంది. ఆ సమయంలో వచ్చే ఇన్ఫెక్షన్లనూ నిరోధిస్తుంది.
- విటమిన్ సి అధికంగా ఉండే పండ్లను తీసుకోవాలి. అవి రోగనిరోధక శక్తిని పెంచుతూ, ఇనుముకు గ్రాహకాలుగా పని చేస్తాయి. తగినన్ని నీళ్ల తాగాలి. తేలికపాటి వ్యాయామాలు చేస్తూ, విశ్రాంతి తీసుకోవాలి.



సిట్ దర్యాప్తుపై అసంతృప్తి

(మొదటిపేజి తరువాయి)

వారి వాదనలను సిట్ పరిగణనలోకి తీసుకోలేదని ప్రత్యేక కోర్టు ప్రస్తావించింది. 2008కి ముందు గుజరాత్ పోలీసు అధికారుల ఎదుట వారు ఇచ్చిన సాక్ష్యాలకు, ఆ తర్వాత సిట్ ఎదుట ఇచ్చిన సాక్ష్యాలకు మధ్య వైరుధ్యాలు ఉన్నాయని తెలిపింది.

'వాస్తవానికి గుర్తు తెలియని దుండగుల గుంపు మైనారిటీల ఆస్తులను ధ్వంసం చేసి, వారిని హతమార్చింది. నేరస్తులు కుట్రకు పాల్పడి, చట్టవిరుద్ధంగా గుమిగూడి, విధ్వంసానికి తెగబడ్డారన్న వాస్తవాన్ని నిరూపించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైంది' అని కోర్టు తెలిపింది. ఈ కేసులో నిందితుల తరపు సాక్షులను కూడా దర్యాప్తు అధికారులు విచారించి ఉండాల్సిందనీ, కానీ అది జరగలేదని అసంతృప్తి వ్యక్తం చేసింది. తన తరఫున సాక్ష్యం చెప్పేందుకు కేంద్ర మంత్రి అమిత్ షాను అనుమతించాల్సిందిగా కొడ్నానీ అభ్యర్థించగా అందుకు న్యాయస్థానం అంగీకరించింది. నరోడా గామ్‌లో హింస జరిగిన సమయంలో కొడ్నానీ అక్కడ లేరని అమిత్ షా కోర్టులో సాక్ష్యం చెప్పారు. అయితే సాక్షులు చెప్పిన విషయాలలో వైరుధ్యాలు ఉన్నాయని, అవి విశ్వసనీయమైనవి కావని కోర్టు వ్యాఖ్యానించింది.

నరోడా గామ్ హింసపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు సిట్‌ను ఏర్పాటు చేసింది. అయితే ఈ కేసులో నిందితులుగా ఉన్న మొత్తం 67 మందినీ ప్రత్యేక కోర్టు గత నెల 20న నిర్దోషులుగా విడిచిపెట్టింది. వీరిలో బీజేపీకి చెందిన మాజీ మంత్రి మాయా కొడ్నానీ, వీహెచ్‌పీ మాజీ నాయకుడు జయదీప్ పటేల్, బజరంగ్‌దళ్ నేత బాబూ బజరంగీ కూడా ఉన్నారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్ జిల్లా నరోడా గామ్ ప్రాంతంలో 2002 ఫిబ్రవరి 28న జరిగిన హింసాకాండలో 11 మంది సజీవదహనం అయిన విషయం తెలిసిందే.

విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు

(మొదటిపేజి తరువాయి)

వెచ్చించి పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్నామని మంత్రి తెలిపారు. దాదాపు రూ.150 కోట్లతో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులందరికీ ఒక్కొక్కరికి రెండు జతల యూనిఫారాలను పాఠశాల పున్ణ ప్రారంభం నాటికి అందించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు. జూన్ 12వ తేదీ నుంచి పాఠశాలలు పున్ణ ప్రారంభమవుతున్నందున బడిబాట కార్యక్రమం ఏర్పాటు చేసి అందులోని స్థానిక శాసనసభ్యులను, ప్రజాప్రతినిధులను భాగ్యస్వామ్యం చేయాలని మంత్రి సూచించారు. స్థానిక శాసన సభ్యులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో నోట్ పుస్తకాల పంపిణీ, పాఠ్య పుస్తకాల పంపిణీ, యూనిఫారాలను విద్యార్థులకు అందజేసే విధంగా కార్యక్రమాలను రూపొందించాలని అధికారులను కోరారు. శాసనసభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాఠశాలల్లో హాజరయ్యే సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులను కూడా ఆహ్వానించాలని మంత్రి సూచించారు. పాఠశాల పున్ణ ప్రారంభం రోజున పాఠశాలల్లో పండగ వాతావరణం కల్పించాలని తెలిపారు. మన ఊరు - మనబడి కార్యక్రమంలో చేపట్టిన పనులను జూన్ మొదటి వారంలోగా పూర్తి చేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన, అదనపు సంచాలకులు సిహెచ్ రమణకుమార్, లింగయ్య, జాయింట్ డైరెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హాజరు మినహాయింపు చెల్లింపు ఫీజు గడువు 10 : ఇంటర్ బోర్డు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు రాసే అభ్యర్థులు (కాలేజీలో చదవని వారు) హాజరు మినహాయింపు ఫీజును ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల పదో తేదీ వరకు తుది గడువు ఉందని ఇంటర్ బోర్డు ప్రకటించింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు పరీక్షల నియంత్రణాధికారి జయప్రద బాయి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మే/జూన్‌లో ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. ఆర్ట్స్, హ్యుమానిటీస్ సబ్జెక్టులకు హాజరయ్యే అభ్యర్థులు హాజరు మినహాయింపు ఫీజుల కింద రూ.500 ఆన్‌లైన్‌లో చెల్లించాలని హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాలకు tsbie.cgg.gov.in వెబ్‌సైట్‌ను చూడాలని సూచించారు.

డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని తిరిగి ప్రవేశపెట్టాలి

(మొదటిపేజి తరువాయి)

ఎలాంటి చర్యలు, సమాలోచనలు చేయకుండా ఇష్టారాజ్యంగా సిలబస్‌లోని ముఖ్యాంశాలను తొలగించారని విమర్శించారు. వైరస్‌ల మధ్య సంబంధాలు, పోలికలను తెలుసుకోవడంతో పాటు కోవిడ్-19 ను ఎదుర్కోవడంలో ఈ సిద్ధాంతం ఎంతో ఉపయోగపడిందని తెలిపారు. మోడీ చెప్పిన చప్పట్లు, దీపాలు వెలిగించడం, ఆవు మూత్రం పని చేయలేదనీ, జీనోమ్ సీక్వెన్సింగ్ ఉపయోగపడిందని గుర్తుచేశారు. సైన్సు పుస్తకాల రచయిత డాక్టర్ కేబి గోపాలం మాట్లాడుతూ పరిణామ సిద్ధాంతానికి, మతానికి మధ్య పంచాయతీ లేదని స్పష్టం చేశారు. డార్విన్ పరిణామ సిద్ధాంతం జీవశాస్త్రానికి ఒక పెద్ద రహదారి అని తెలిపారు. సిలబస్ హేతుబద్ధీకరణ పేరుతో పరిణామ సిద్ధాంత పాఠాన్ని పూర్తిగా తొలగించడం సహేతుకం కాదని పేర్కొన్నారు.

జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కోయ వెంకటేశ్వరరావు "ఆవర్తన పట్టిక - మూలకాల ధర్మాలు" పాఠ్యాంశం నుంచి తొలగించడం ఎంత ఆలోచనారహితమో డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం తొలగించడం అంతే అనాలోచితమని విమర్శించారు.. సిలబస్ సమతుల్యత కోసం ఇలా చేశామంటే అంతకంటే హాస్యాస్పదమైన విషయం ఇంకొకటి ఉండదని ఎద్దేవా చేశారు. ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు నిష్ణాతులతో చర్చించడం అవసరమని అభిప్రాయపడ్డారు.

ఇతర సంఘాలతో కలిసి ఉద్యమం

పరిణామ సిద్ధాంతాన్ని తిరిగి పాఠ్యపుస్తకాల్లో చేర్చేంత వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.శ్రీనాథ్, కోశాధికారి రావుల వరప్రసాద్ స్పష్టం చేశారు. ఇతర శాస్త్రీయ సంఘాలతో కలిసి బహిరంగసభలు, పత్రికా సమావేశాలు తదితర రూపాల్లో పోరాటం చేస్తామనీ, అప్పటికీ ప్రభుత్వం దిగి రాకుంటే విద్యార్థులను భాగస్వాములను చేసి పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. చెకుముకి కన్వీనర్, రాష్ట్ర జన విజ్ఞాన వేదిక కార్యదర్శివర్గ సభ్యులు రాజా మాట్లాడుతూ సమతుల్యత కోసం అంటూ అసమతుల్యం చేశారని విమర్శించారు. "డార్విన్ పరిణామ సిద్ధాంతం జీవశాస్త్రంలో ఒక గొప్ప విజయం. ఏ మత ఛాందసులైతే మొదట దానికి వ్యతిరేకంగా పోరాడారో వారే నేడు దాన్ని అంగీకరించక తప్పలేదు. సైన్స్ నిజం. దాని పరిధిని పెంచాలే కానీ తగ్గించరాదన్నారు." ఈ సమావేశంలో జేవీవీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర రావు, ప్రదాన కార్యదర్శి లింగస్వామి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సాయిబాబు, అల్తాఫ్, రాజశేఖర్, సుబ్బారావు, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో షెడ్యూల్ ప్రకారం నవంబర్, డిసెంబర్‌లో ఎన్నికలు జరిగే అవకాశం ఉందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధత, ఓటరు జాబితా సంబంధిత అంశాలపై చర్చించారు. అందుకనుగుణంగా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలను అనుసరించి, సన్నాహాలు ప్రారంభించినట్టు ఆయన వివరించారు. జూన్ నెలలో మొదటి విడత ఈవీఎంల చెకింగ్ చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గస్థాయిలో, జిల్లా కేంద్రంలో ఓటర్ నమోదుపై వారానికోసారి సమీక్షించాలని అధికారులను ఆదేశించారు.

గతంలో వివిధ కారణాలతో తొలగించిన ఓటర్ పేర్లను మరోసారి పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. మునుగోడు ఉప ఎన్నికలో 48 గంటలకు ముందు ప్రచారం ముగిసినప్పటికీ, ఆ నియోజకవర్గానికి సంబంధం లేని నాయకులు చాలా మంది అక్కడే ఉన్నారనీ, రాబోవు ఎన్నికల్లో అటువంటి పరిస్థితులు రాకుండా చూడాలని కాంగ్రెస్ ఉపాధ్యక్షులు జి. నిరంజన్ కోరారు. అటువంటి పరిస్థితులు పునరావృత్తం కాకుండా చూస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు.

నీరాకేఫ్ ప్రారంభం

(మొదటిపేజి తరువాయి)

నీరా కేఫ్‌ను ప్రారంభించుకున్నాం. తాటి చెట్టు ప్రమాదాలను నివారించడానికి 'రక్షిత మోకు' కోసం ఐఐటీ పరిశోధనలు చేస్తున్నది. త్వరలోనే ట్యాంక్‌బండ్‌పై సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం' అని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి డాక్టర్ వి. శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన నీరాకేఫ్‌ను మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తో కలిపి బుధవారం ప్రారంభించారు. రాష్ట్ర ప్రజలకు స్వచ్ఛమైన, ప్రకతి సిద్ధమైన నీరా, అనుబంధ ఉత్పత్తులైన తేనె, బూస్ట్, షుగర్, బెల్లం విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ గీత వృత్తి ప్రోత్సాహానికి సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారన్నారని అన్నారు. రైతు బీమా మాదిరిగా గీత కార్మికుల కోసం రూ.5లక్షల బీమాను కల్పిస్తూ సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా 50 ఏండ్ల వయస్సు పైబడిన, అర్హులైనవారికి దాదాపు లక్షమంది గీత కార్మికులకు ప్రతి నెల రూ.2016 పెన్షన్లు అందిస్తున్నామని చెప్పారు. మద్యం దుకాణాల్లో గౌడ సామాజిక వర్గానికి 15శాతం, ఎస్సీ, ఎస్టీలకు 15శాతం రిజర్వేషన్లు కల్పించటం సాహసోపేతమైన, చారిత్రాత్మక నిర్ణయమని వివరించారు. గీత వృత్తికి ప్రోత్సాహం కోసం హరితహారంలో భాగంగా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో 4.20 కోట్ల తాటి, ఈత మొక్కలు నాటామని పేర్కొన్నారు. తాటి, ఈత చెట్లను అక్రమంగా నరికితే చట్టపరమైన కఠిన చర్యలు, కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు.

తాటి, ఈత చెట్ల రెంటల్‌ను శాశ్వతంగా రద్దుతోపాటు గీత కార్మికుల పాత బకాయిలు రూ.8కోట్లను రద్దు చేశామని గుర్తు చేశారు. గీత కార్మికులు ఎంతో సాహసోపేతంగా గీత వత్తిని కొనసాగిస్తున్నారని వెల్లడించారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహిస్తున్నామని, ఆయన విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పాపన్న నిర్మించిన కోటలను పరిరక్షించి వాటిని పురావస్తు కేంద్రాలుగా, పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నామని, ఇప్పటికే భువనగిరి కోట, జాఫర్‌ఘడ్ కోట, కిలాషాపూర్ కోట, తాటికొండ కోట, కరీంనగర్ జిల్లాలోని సైదాపూర్ మండలం పాపన్నపేటలో ఉన్న సుమారు 400 ఎకరాల కోటను గ్రానైట్ మాఫియా నుండి పరిరక్షించామని, ఆ స్థలాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు.

గీత వత్తిలో ప్రమాదవశాత్తు జరిగే మరణాలను నివారించేందుకు తాటి చెట్టు ఎక్కే అధునాతన యంత్రాల (రక్షిత మోకు) రూపకల్పన కోసం ఐఐటీ లాంటి సాంకేతికత సంస్థల సహకారంతో పరిశోధనలు చేస్తున్నామని చెప్పారు. గీత కార్మికుల కుటుంబాలలో వెలుగులు నింపాలనే లక్ష్యంతో గీత కార్మికుల కోసం 'గీత కార్మికుల భీమా'ను ప్రవేశపెట్టినందుకు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్ర పటాలకు నీరాకేఫ్ ముందు 'నీరాభిషేకం' చేశారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి మాజీ చైర్మెన్ స్వామిగౌడ్ మాజీ ఎమ్మెల్సీలు బాలసాని లక్ష్మీనారాయణ, గంగాధర్‌గౌడ్, రాష్ట్ర చైర్మెన్లు డాక్టర్ ఆంజనేయగౌడ్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, తెలంగాణ టూరిజం కార్పొరేషన్ ఎండి మనోహర్, తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు అజయ్‌కుమార్, డేవిడ్ రవికాంత్, ఖురేషి, దత్తరాజ్‌గౌడ్, చంద్రయ్యగౌడ్, మాజీ ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

161వ స్థానానికి పడిపోయిన భారత్

(మొదటిపేజి తరువాయి)

రేడియా (ఏఐఆర్) నెట్‌వర్క్ నుంచి అన్ని రేడియో స్టేషన్లలోనూ వార్తలు ప్రసారమవుతాయి. ఈ కంపెనీలకు, మోడీ ప్రభుత్వానికి మధ్య బహిరంగంగా పరస్పర ప్రయోజనకరమైన సంబంధాలు ఉన్నట్టు తెలుస్తున్నది. ఇది ఇంకా కొనసాగుతోంది. సుమారు 80 కోట్ల మంది అనుసరించే 70 మీడియా నెట్‌వర్క్‌లు అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ గ్రూప్ అధీనంలో ఉన్నాయి. ఇటీవల ఎన్‌డీటీవీని అదానీ స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. మోడీ అధికారం చేపట్టిన అనంతరం పలువురు జర్నలిస్టులు వేధింపులను ఎదుర్కొంటున్నారు. రాజద్రోహం, పరువునష్టం, కోర్టు ధిక్కారం, జాతీయ భద్రతా చట్టాలతో పాటు తిరుగుబాటుదారులన్న ముద్ర వేస్తున్నది. అలాగే మీడియాలో ఉన్నత కులాలకు చెందిన పురుషులు జర్నలిజంలో సీనియర్ పదవులను కలిగి ఉండటం లేదా మీడియా ఎగ్జిక్యూటివ్‌లుగా ఉంటున్నారు. ఇది మీడియా కంటెంట్‌లో ప్రతిబింబిస్తుంది. సాయంత్రం వేళల్లో వచ్చే ప్రధాన చర్చా కార్యక్రమాల్లో పాల్గనేవారిలో 15శాతం కంటే తక్కువ మంది మహిళలు ఉన్నారు. భారత్‌లో జర్నలిస్టుల భద్రతకు ఎలాంటి చర్యలూ లేవు. ప్రతి ఏడాది సగటున నలుగురు జర్నలిస్టుల్లో ముగ్గురు హత్యకు గురవుతున్నారు. మీడియా రంగానికి ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన దేశాల్లో భారత్ కూడా ఒకటని ఆర్ఎస్ఎఫ్ స్పష్టం చేసింది.

నేడు బీఆర్ఎస్ జాతీయ కార్యాలయం ప్రారంభం

(మొదటిపేజి తరువాయి)

కెసిఆర్ మధ్యాహ్నం 1:05 గంటలకు రిబ్బన్ కట్ చేసిన తర్వాత పార్టీ జెండా ఎగురవేసి.. నూతన భవనంలోకి వెళ్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ జాతీయ కమిటీలో ఒకటి, రెండు నియామకాల ఉత్తర్వులపై కేసీఆర్ సంతకం చేసే అవకాశాలున్నట్టు సమాచారం. కాగా భవన నిర్మాణ పనులను గురువారం మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, ఎంపి జోగినపల్లి సంతోష్ కుమార్‌లు పరిశీలించారు. గత నాలుగు రోజులుగా ఢిల్లీలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఎక్కువ హడావిడిలేకుండా కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్టు నేతలు చెబుతున్నారు.

కాగా, 2021 సెప్టెంబర్ 2న వసంత్ విహార్‌లో బీఆర్ఎస్ పార్టీకి కేటాయించిన స్థలంలో ఆఫీసు భవనానికి కేసీఆర్ భూమి పూజ చేశారు. అయితే కేవలం 20 నెలల్లో పార్టీ కార్యాలయ పనులు పూర్తయ్యాయి.

వాతావరణం కారణంగా సీఎం ప్రయాణంలో మార్పు...!

ఢిల్లీలో భారీ వర్షం కారణంగా సీఎం కేసీఆర్ బుధవారం ఢిల్లీ పర్యటన రద్దు అయినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. వాస్తవానికి బుధవారం సాయంత్రం కేసీఆర్ ఢిల్లీకి రావాల్సి ఉంది. కానీ, ఢిల్లీలో వాతావరణ సహకరించకపోవడంతో గురువారం ఉదయానికి ఆయన ప్రయాణాన్ని మార్చుకున్నట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

కేజీబీవీ సిబ్బంది బదిలీలకు 6 నుంచి దరఖాస్తుల స్వీకరణ

- విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నడుస్తున్న కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల (కేజీబీవీ)ల్లో తాత్కాలిక పద్ధతిపై పనిచేస్తున్న సిబ్బంది బదిలీల ప్రక్రియ ఈనెల ఆరో తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేజీబీవీల్లో పనిచేస్తున్న స్పెషల్ ఆఫీసర్లు, పీజీసీఆర్టీలు, సీఆర్టీలు, ఏఎన్ఎంలు, అకౌంటెంట్లు, పీఈటీలు ప్రస్తుతం ఉన్న కేజీబీవీ నుంచి ఇతర కేజీబీవీలకు మార్పు కోరే సిబ్బంది నుంచి ఆన్‌లైన్‌లో ఈనెల ఆరు నుంచి తొమ్మిదో తేదీ వరకు దరఖాస్తు చేయాలని కోరారు. ఈ ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తామని తెలిపారు. ఇందుకు సంబంధించిన సమగ్ర వివరాలు, సూచనలు, మార్గదర్శకాలు https://transfers.cdse.telanganag.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచామని వివరించారు.

పని బారెడు.. జీతం మూరెడు

- ఏటా ఉమ్మడి జిల్లా పంచాయతీలకు అవార్డులు, రివార్డుల పంట
- పని చేసే సిబ్బందికి అరకొరవేతనాలు, అడ్డగోలు చాకిరీ
- మూడేండ్ల గడువు ముగిసినా పంచాయతీకార్యదర్శుల ప్రొబేషనరీ మరో ఏడాదికి పొడిగింపు
- వెంటనే పర్మినెంట్ చేయాలని సమ్మెకు దిగిన జూనియర్‌పంచాయతీ కార్యదర్శులు
- మల్టీపర్పస్ కింద కారోబార్లకు తప్పని శ్రమదోపిడీ
- ప్రతికూలంగా మారిన 500మందికో కారోబార్ నియామక నిబంధన
- వెయ్యి జనాభా ఉన్న ఊళ్లో ఇద్దరికే రూ.8500జీతం..
- దాన్ని మిగతా వారితో పంచుకోగా చేతికొచ్చేది అరకొరే!

నవతెలంగాణ – కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

జిల్లా, రాష్ట్ర స్థాయి మొదలు దేశంలోనే అత్యుత్తమ పంచాయతీలుగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా జీపీలు అవార్డులు అందుకుంటుంటే.. ఆ గ్రామపంచాయతీల్లో పని చేసే సిబ్బంది, కారోబార్లు, పంచాయతీ సెక్రటరీలకు అరకొర వేతనాలు, అడ్డగోలు చాకిరీయే మిగులుతోంది. 2009లో మల్టీపర్పస్ విధానాన్ని తీసుకొచ్చి డిగ్రీ, పీజీలు చదివి కారోబార్లుగా చేస్తున్న వారితోనూ సఫాయి, డ్రైవర్, ఎలక్ట్రీషియన్ పనులు చేసుకుంటున్న సర్కారు.. టీపీఎస్సీ ద్వారా పంచాయతీ కార్యదర్శులుగా ఉద్యోగాల్లో చేరిన వారిని పర్మినెంట్ చేయకుండా గడువు మేర ముగిసిన మూడేండ్ల ప్రొబెషనరీని మరో ఏడాదిపెంచుతూ సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఉద్యోగభద్రత, కనీస వేతనాల కోసం కారోబార్లు, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మెకు దిగి వారం పది రోజులుగా ఆందోళన చేస్తున్నారు.



గడువు ముగిసినా ఇంకా ప్రొబేషనరీలోనే...

2018 అక్టోబర్ 10న తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా జూనియర్‌పంచాయతీ కార్యదర్శులుగా ఉద్యోగంలో చేరినవారికి ప్రభుత్వం మూడేండ్ల ప్రొబెషనరీ పీరియడ్‌ను విధించింది. ఆ కాలంలో నెలకు రూ.15వేల వేతనం ఇస్తూ వచ్చింది. ఆ ప్రొబెషనరీ పీరియడ్ గడువు గత నెల ఏప్రిల్11తో ముగిసింది. ఇక సర్వీసు ఉద్యోగిగా మారుతామని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ఆశలపై ప్రభుత్వం నీళ్లుచల్లింది. ప్రొబెషనరీ పీరియడ్‌ను మరో ఏడాదికి పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయడంతో వారంతా సమ్మెకు దిగారు. గత నెల 13న రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె నోటీసులు ఇచ్చారు. ఆ వెంటనే ప్రభుత్వం అధికారికంగా అటెండెన్స్, ఇతర సమాచారం కోసం ఏర్పాటు చేసిన వాట్సప్ గ్రూపుల నుంచి స్వచ్ఛందంగా తొలిగి నిరసన తెలిపారు. ప్రస్తుతం వారంతా ఆయా కలెక్టరేట్లు, మండల కేంద్రాల్లో ఆందోళన చేస్తున్నారు.

కష్టాల్లో కారోబార్లు...

గ్రామపంచాయతీల్లో పన్నుల వసూలు, పంచాయతీ రికార్డుల నిర్వహణ కోసం డిగ్రీ ఆపైచదువుకున్న వారికి అప్పగించి వారిని కారోబార్లు కింద నియమించుకుంది. మిగిలిన వారికి సఫాయి, డ్రైవింగ్, ఎలక్ట్రీషియన్, ప్లంబర్, మంచినీటి సరఫరా సహా పనులు చేయించుకునే వారిని సిబ్బందిగా పరిగణించింది. ఇదే క్రమంలో 2009లో అప్పటి ప్రభుత్వం జీవోనెంబర్ 51ని విడుదల చేసి పంచాయతీల్లో పని చేసే సిబ్బందిని మల్టీపర్పస్ వర్కర్లుగా మార్చింది. దీని అర్థం వారిలో ఎవరైనా ఏ పని చెప్పినా చేయాల్సిందే! బిల్లులు, రికార్డుల నిర్వహణ చేసే కారోబార్లు కూడా అవసరమైతే సఫాయి, ఎలక్ట్రీషియన్, ప్లంబర్, డ్రైవర్లుగానూ పని చేయాల్సిందేని చెప్పింది. ఈ మల్టీపర్పస్ విధానంపై గతంలో ఎన్నోసార్లు పోరాటాలు, నిరసనలు తెలిపినప్పటికీ సర్కారు వెనక్కి దగ్గలేదు. పైగా గ్రామంలో కనీసం ఐదుగురు చొప్పున సిబ్బందిని నియమించుకున్న సర్కారు మొదట్లో రూ.2వేల నుంచి రూ.3వేలకు మించి వేతనాలు ఇవ్వలేదు. తరువాత జీవోనెంబర్ 51ని తీసుకొచ్చి రూ.8500 వేతనంగా నిర్ణయిం చింది. అయితే పంచా యతీలో 500మందికి ఒక కారోబార్‌ను లెక్కిస్తూ జీతాలు ఇవ్వడంతో వెయ్యి జనాభా ఉన్న ఊళ్లో ఇద్దరికే ఆ జీతం వస్తోంది. దీంతో ఆ ఇద్దరి వేతనాన్నే ఐదుగురూ పంచుకోవ డంతో చేతికొచ్చేది అరకొరగానే మారింది. మరోవైపు అనుభవం లేక డ్రైవర్, ఎలక్ట్రీషియన్ పనులకు వెళ్లి ప్రమాదవశాత్తు మరణిస్తే కనీసం వారికి బీమాగానీ, పరిహారంగానీ ఇవ్వడం లేదు. ప్రస్తుతం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 1321 గ్రామపంచాయతీల్లో 1008 మంది కారోబార్లు పని చేస్తున్నారు. వీరికాకుండా మిగతా సిబ్బంది 5,192 మంది ఉన్నారు.



జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలి

– సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి



ప్రొబేషనరీ పీరియడ్ ముగిసినప్పటికీ రాష్ట్ర పభుత్వం జూనియర్ పంచాయతీ కార్య దర్శులను రెగ్యులర్ చేయలేదు. సమ్మె బాట పట్టిన కార్యదర్శులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలి. వారి సమ్మెతో గ్రామాల్లో వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు, అనుమతులు, పరిపాలన పర్యవేక్షణ కుంటు పడింది. టీఎస్పీఎస్సీ ద్వారా నియామకమైన జూనియర్ పంచా యతీ కార్యదర్శులు రెగ్యులరైజ్ కోసం నాలుగేండ్లుగా నిరీక్షిస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయం.

జీపీఎస్, కారోబార్ల ప్రధాన డిమాండ్లు ఇవీ...

కారోబార్లను జూనియర్‌పంచాయతీ కార్యదర్శులకు సహాయకులుగా నియమించాలి. బిల్‌వసూలు, రికార్డుల నిర్వహణ మినహా మిగతా పనుల నుంచి మినహాయించాలి. మల్టీపర్పస్ విధానాన్ని ఎత్తివేయాలి. ఏండ్లుగా పని చేస్తున్న కారోబార్లకు సీనియారిటీ లెక్కన పంచాయతీ కార్యదర్శి హోదా కల్పించాలి. రూ.21వేల వేతనం ఇవ్వాలి. ప్రస్తుతం పని చేస్తున్న వారికి రూ.15వేల చొప్పున జీతం చెల్లించాలి. పీఎఫ్, ఈఎస్ఐ, పింఛన్ సౌకర్యాన్ని కల్పించాలి. జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యుల ర్‌జేస్తూ జీవో విడుదల చేయాలి. గడిచిన పెంచిన ప్రొబెషనరీ పీరియడ్‌ను ఎత్తేసి గడిచిన కాలాన్ని సర్వీస్ పీరియడ్‌గా గుర్తించాలి. ప్రస్తుతం ఔట్‌సోర్సింగ్ కింద పంచాయతీ కార్యదర్శులుగా వారికి ప్రమోషన్ కల్పించాలి. అర్హులైన సీనియర్ పంచాయతీ కార్యదర్శులకు ఉద్యోగోన్నతి కల్పించాలి. 317 జీవో వల్ల నష్టపోయిన పంచాయతీ కార్యదర్శులకు న్యాయం చేసి పరస్పర బదిలీలు, స్పౌజ్ బదిలీలకు అవకాశం కల్పించాలి.

కంటి వెలుగు ప్రారంభం

నవతెలంగాణ-మెట్‌పల్లిరూరల్

మెట్‌పల్లి మండలం పెద్దపూర్ గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని తహసీల్దార్ నడిమెట్ల సత్యనారాయణ బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోరేపు రవి, ఉప సర్పంచ్ తెలుకంటీ గంగధర్, ఎంపీటీసీ తెలుకంటీ శంకరయ్య,పాక్స్ వైస్ చైర్మన్ చేపూరి జీవన్‌రెడ్డి, కంటి వెలుగు ఆఫీసర్ డాక్టర్ మారుతి, ఎఎన్‌ఎంలు, పంచాయతీ కార్యదర్శి ఆసిఫ్ బెగ్,ఏపురి శ్రీనివాస్ గౌడ్,కొమ్ముల రమేష్, మిట్టపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కోరేపు వెంకటేష్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న తహసీల్దార్

రైతు కుటుంబానికి బీమా చెక్కు అందజేత

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాలరూరల్ మండల బాలపల్లి గ్రామానికి చెందిన రైతు గాలిపెల్లి ఆనందం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. వారి కుటుంబానికి రూ.5 లక్షల రైతు భీమా ప్రొసీడింగ్‌ను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అందజేశారు. ఆయన వెంట జడ్పీ ఛైర్ పర్సన్ దావా వసంత సురేష్ ఉన్నారు. జగిత్యాల అర్బన్ మండల తిప్పన్న పెట్ గ్రామంలో జిల్లా పరిషత్ నిధులు రూ. 20 లక్షలతో సీసీ డ్రైన్ నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, జడ్పీ ఛైర్‌పర్సన్ దావా వసంత సురేష్ భూమి పూజ చేశారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిం చారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ ఛైర్మెన్ శ్రీకాంత్‌రెడ్డి,ఎంపీపీ ములసాపు లక్ష్మి, ఎఎంసీ ఛైర్మెన్ నక్కల రాధ రవీందర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఎల్లారెడ్డి, జిల్లా పరిషత్ సిఈఓ రామానుజాచార్యులు, డీఈ మిలింద్, ఎఈ రాజ మల్లయ్య, పాక్స్ డైరెక్టర్ పోచమల్లు,నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



బీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

జిందాల్ మెరిట్ స్కాలర్ షిప్ పంపిణీ

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

పట్టణంలోని శ్రీచైతన్య డిగ్రీ కళాశాల విద్యార్థినులకు జిందాల్ స్కాలర్ షిప్ మంజూరు చేశారు. ఈ స్కాలర్ షిప్ చెక్కులను కళాశాల చైర్మన్ ముసిపట్ల రాజేందర్ విద్యార్థినులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీచైతన్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. అందుకే ప్రతి సంవత్సరం జిందాల్ స్కాలర్ షిప్ సాధిస్తున్నారు. మంచి విద్యతో పాటు క్రమశిక్షణ అందిస్తూ, పిల్లలకు మంచి భవిష్యత్తు కోసం పాటుపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ నేరెళ్ల మల్లేశంగౌడ్, ప్రిన్సిపాల్ మామిడిపెల్లి రాజన్న, అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న కళాశాల చైర్మెన్

ఈనెల 31లోపు పట్టణంలోని దుకాణ యజమానులు లైసెన్స్ పొందాలి

చొప్పదండి మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్

నవతెలంగాణ :చొప్పదండి

చొప్పదండి పట్టణంలోని మున్సిపాలిటీ పరిధిలోని వ్యాపార దుకాణ యజమానుదారులు ఈనెల 31 లోపు లైసెన్స్ పొందాలని చొప్పదండి మున్సిపల్ కమిషనర్ పి. శాంతి కుమార్ సూచించారు. చొప్పదండి పట్టణంలోని షాపులను కమిషనర్ పి.శాంతికుమార్ ఆధ్వర్యంలో బుధవారం మేనేజర్ డి.ప్రశాంత్‌కుమార్, ఇన్‌చార్జి సానిటరీ ఇన్స్పెక్టర్ ఏ అంజయ్య, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్‌లు మున్సిపల్ సిబ్బందితో కలిసి షాపులను తనిఖీ చేశారు. వ్యాపారులు 31 లోపు లైసెన్స్ పొందాలని లేదా రెన్యువల్ చేయించుకొని పెనాల్టీ నుండి విముక్తి పొందాలని సూచించారు.



తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్

పెగ్గెర్ల పండగకు బాపురెడ్డి విరాళం

నవతెలంగాణ- కథలాపూర్

మండలంలోనిపెగ్గెర్ల గ్రామంలో జరగనున్న పెద్ద పండుగ జాతర మహోత్సవం సందర్భంగా పెగ్గెర్ల గ్రామస్తులు రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ చైర్మన్ లోకబాపురెడ్డిని ఆహ్వానించారు. జాతర కోసం రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ చెల్లపెల్లి అంజయ్య, మార్గం గంగారెడ్డి, చెదలు మనోజ్ ,ఇల్లందుల రవి,పుంద్ర రాజేశం, తేలు భూమయ్య, జవిడి శేఖర్, చందనగిరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నవతెలంగాణ-మల్యాల

రోడ్డు ప్రమాదంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. మల్యాల సమీపంలో జగిత్యాల-కరీంనగర్ ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో జగిత్యాల మంచినీళ్ల బావి ఏరియాకి చెందిన రాము అనే యువకుడు మృతి చెందగా, మరో యువతికి గాయాలలైనాయి. చికిత్స నిమిత్తం జగిత్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మ్యాచర్‌తో చూడకుండానే తూకం వేయాలి

వేములవాడ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆది శ్రీనివాస్

నవతెలంగాణ-కథలాపూర్

అకాల వర్షాలతో తడిసిన ధాన్యం మ్యాచర్‌తో చూడకుండానే తూకం వేయాలని వేములవాడ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని గంభీర్‌పూర్ గ్రామంలో తడిసిన ధాన్యాన్ని ఆది శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం తడిసిన ధాన్యం లాకలు వచ్చిన ధాన్యం కొంటాం అని గొప్పలు చెప్పుకుంటుందని, కానీ మ్యాచర్ రాక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంచికి 4 నుండి 5 కిలోలు కట్ చేసి తుకం వేస్తున్నారని, అలవేయకుండా సంచిబరువు కిలోతో మాత్రమే తూకం వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ అజీమ్, పీసీసీ కార్యవర్గ సభ్యులు తొట్ల అంజయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జవ్వాజి చౌదరి, పబ్బ శ్రీనివాస్, ఊరుమల్ల కృష్ణమాచారి, మాల్యాల రాము, ఊరుమడ్ల లక్మాన్, ఎమ్.డి. మొయినోద్దీన్, మడిశెట్టి అభిలాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

ఇంటింటికీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

- ఒక్కసీసీ కెమెరా 100 పోలీసులతో సమానం
- కోరుట్ల సిఐ ప్రవీణ్‌కుమార్

నవతెలంగాణ-కోరుట్ల

పట్టణంలోని భీముని దుబ్బలో వారం క్రితం రాజు అనే వ్యక్తి ఇంట్లో బంగారం చోరీ కాగా, వార్రి ఇంట్లో ఉన్న సీసీ కెమెరాల సాయంతో దొంగను గుర్తించినట్లు సిఐ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. సీసీ కెమెరాలు ప్రతి ఇంటి వద్ద ఏర్పాటు చేసుకోవాలని, ఒక్కో సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని ఆయన పేర్కొన్నారు. కోరుట్ల పట్టణంలో పోలీస్‌శాఖ తరపున ప్రధాన కూడళ్లతో పాటు ఇతర వీధుల్లోనూ 1500 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని ప్రజల సహకరించాలని ఆయన కోరారు. అనంతరం ఇంటిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్న రాజును ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో ఎస్ఐ సతీష్ పాల్గొన్నారు.



సన్మానిస్తున్న సీఐ ప్రవీణ్‌కుమార్

తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన ఎమ్మెల్సీ

నవతెలంగాణ-జగిత్యాల

జగిత్యాలరూరల్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో అకాల వర్షానికి తడిసిన వరి ధాన్యాన్ని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లా డుతూ.. సీఎం కేసీఆర్ ప్రకటించిన విధంగా తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలన్నారు.



పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ

రెడ్డి సంఘ భవన నిర్మాణానికి భూమి పూజ

నవతెలంగాణ-జగిత్యాల :

జగిత్యాలరూరల్ మండలం బాలపెల్లి గ్రామంలో రూ.4 లక్షలతో రెడ్డి సంఘం భవన నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్ పర్సన్ దావా వసంత సురేష్, ఎఎంసీ చైర్మన్ నక్కల రాధ,రైతుబంధు సమితి మండల కన్వీనర్ నక్కల రవీందర్‌రెడ్డి, సర్పంచ్ భూపతి రెడ్డి, ఎంపీటీసీలు రెడ్డి రత్న, గుంటి రవి, ఆరే సౌజన్య తిరుపతి, ఎంపీటీసీల ఫోరం మహేష్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు నాగిరెడ్డి గంగారెడ్డి, ఏఈ రాజ మల్లయ్య,రెడ్డి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు కల్పించాలని

కలెక్టరేట్ ఎదుట నిరసన

నవతెలంగాణ-జగిత్యాల

రాయికల్, మెట్‌పెల్లి, కోరుట్ల, ధర్మపురి మున్సిపాలిటీలో ఉపాధి హామీ పనులు కల్పించాలంటూ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి, అనంతరం కలెక్టర్‌కు ప్రజలు వినతి పత్రం అందజేశారు. మున్సిపాలిటీగా ఆవిర్భావించినప్పటి నుంచి తమ గ్రామాల్లో ఉపాధి హామీ పనులు కల్పించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.



ధర్నా చేస్తున్న ప్రజలు

మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన డాక్టర్ సంజయ్

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా గ్రామానికి చెందిన బక్కురి నరేష్ అనారోగ్యంతో మృతి చెందాడు. వారి కుటుంబ సభ్యులను కల్వకుంట్ల సంజయ్ బుధవారం పరామర్శించారు. అనంతరం అన్ని విధాలా ఆదు కుంటామని వారికి ధైర్యాన్ని చెప్పారు. ఆయనతోపాటు డబ్బా సర్పంచ్ లింగం పల్లి గంగాధర్, మాజీ సర్పంచ్ పుప్పాల నర్సయ్య, నాయకులు దేశెట్టి జీవన్, ఉపసర్పంచ్ దేవరెడ్డి, జాజాల జగన్‌రావు, సుంకరి రాజేష్ పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న సంజయ్

కొనుగోలు కేంద్రాల సందర్శన

నవతెలంగాణ-వెల్గటూర్

మండలంలోని కిషన్‌రావుపేట, మొక్కట్రావుపేట, ముత్తునూర్, రాంనూర్, తల్లకొత్తపేట, చెగ్యం, వరి కొనుగోలు కేంద్రాలను బుధవారం ఎంపీపీ కున్నామల్ల లక్ష్మి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పత్తిపాక వెంక టేష్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చల్లూరి రాంచందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి జూపాక,రామిల్ల సనీల్, యా గాండ్ల తిరుపతి, ధ్యవనపల్లి లక్ష్మి ఎల్లయ్య, యువజన సంఘం అధ్యక్షుడు బిడారి తిరుపతి, కుష మధుకర్, నాయకులు రైతులు పాల్గొన్నారు..



సందర్శిస్తున్న ప్రజాప్రతినిధులు

పారిశుధ్య కార్మికులకు సన్మానం

నవతెలంగాణ-కొత్తపల్లి

కొత్తపల్లి మండలం మల్కాపూర్ గ్రామంలో రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి జాడిబాలారెడ్డి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి రూరల్ మండల పార్టీ అధ్యక్షులు రతన్ కుమార్, పశ్చిమ జోన్ అధ్యక్షులు మారెడ్డి ప్రహరి లక్ష్మారెడ్డి, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి ఎడమ సత్యనారాయణ రెడ్డి, కొత్తపల్లి మండల ఎస్సీ మోర్చ ప్రధాన కార్యదర్శి బండారి శ్రావణ్ కుమార్, జిల్లా ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధులు ఎర్రోళ్ల ప్రశాంత్ పాల్గొన్నారు.

కంటి వెలుగును ప్రారంభించిన సర్పంచ్

నవతెలంగాణ-తిమ్మాపూర్

మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామంలో కంటి వెలుగును ఎంపీడీవో రవీందర్‌రెడ్డితో కలిసి సర్పంచ్ కరివేద పద్మజ శ్యామ్ సుందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కరివేద సురేందర్‌రెడ్డి, డాక్టర్ ప్రియాంక, ఎంపీఓ కిరణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.



మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర పొందాలి

జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో జొన్నలు అమ్ముకుని మద్దతు ధర పొందాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. టీఎస్ మార్క్‌ఫెడ్ ద్వారా కేడీసీఎంఎస్, ఏఎంసీ జగిత్యాల ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ బీట్ బజార్‌లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్ పర్సన్ దావా వసంత సురేష్, డీసీఎంఎస్ చైర్మెన్ శ్రీకాంత్‌రెడ్డి, అదనపు కలెక్టర్ బిఎస్ లత ప్రారంభించారు. అనంతరం 4.5 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న సమకృత మార్కెట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జగిత్యాల నియోజకవర్గంలో గతంలో 22 వేల ఎకరాలలో పంట సాగు చేస్తే, ప్రస్తుతం 63 వేల ఎకరాలలో పంట సాగు చేస్తున్నారన్నారు. వ్యవసాయ రంగంలో కేసీఆర్ కృషి తో పంటల విస్తీర్ణం పెరిగిందన్నారు. నిర్మాణం, కాళేశ్వరం,మిషన్ కాకతీయ, 24గంటల కరెంట్ దేశానికే మార్గదర్శకం అన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ మాట్లా డుతూ... జగిత్యాలకు మూడు కొనుగోలు కేంద్రాలు మంజూరు చేసిన డీసీఎంఎస్ వారికి ధన్యవాదాలు తెలిపారు. ప్రకృతి వైపరిత్యాలు వల్ల రైతు నష్టపోతే...ప్రతి పక్షాలు రైతులను మరింత ఆగం చేస్తున్నాయని ఆరోపించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకురావడం ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. కొనుగోలులో ఎలాంటి కటింగ్ చేసిన రైతులు అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. మున్సిపల్ చైర్మెన్ గోలి శ్రీనివాస్, ఎఎంసీ చైర్మెన్ నక్కల రాధ, జెడ్పీటీసీ మహేష్, పాక్స్ చైర్మెన్ మహిపాల్ రెడ్డి,రైతు బందు సమితి మండల కన్వీనర్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్ సమిండ్ల వాణి శ్రీనివాస్, డీసీవో రామనుజ చార్యులు,జిల్లా వ్యవసాయ అధికారి సురేష్, ఎఎంసీ వైస్ చైర్మన్ అసిఫ్, డీఎం దివ్య భారతి, మార్కెటింగ్ సెక్రెటరీ రాజశేఖర్, డిఎంఓ ప్రకాష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

మల్లన్నపల్లెలో బోర్స్ రిపేర్ చేయాలి



వినతి పత్రం అందజేస్తున్న యువకులు


నవతెలంగాణ-చొప్పదండి

మండలంలోని కాట్నపెల్లి అనుబంధ గ్రామమైన మల్లన్నపల్లె గ్రామంలో ఐదు బోర్లు రిపేర్ చేయాలని కోరుతూ గ్రామ అంబేద్కర్ యువజన సంఘం నాయకులు బుధవారం చొప్పదండి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సూపరిండెంట్ శ్రవణ్ కుమార్ వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామంలో ఇటీవల రెండుసార్లు అకాలవడగళ్ల వర్షంతో గ్రామానికి త్రీఫేస్ కరెంటు రావడం లేదని అన్నారు. త్రీఫేస్ కరెంటు వస్తేనే గ్రామంలో మంచినీళ్ల బావి నుంచి నీరు వస్తుందని గుర్తు చేశారు. మూడు నాలుగు రోజుల నుండి గ్రామంలో ప్రజలకు నీళ్ల లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్న ఐదు బోర్లు పనిచేయకుండా రిపేర్‌లో ఉన్నాయని ఈ సమస్య గ్రామ సర్పంచ్ వార్డు సభ్యులు కూడా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మల్లన్న పల్లె అంబే ద్కర్ యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

పోలంపల్లిలో పొడిసిన తొలిపొద్దు

నవతెలంగాణ-తిమ్మాపూర్

మండలంలోని పోలంపల్లి గ్రామంలో బుధవారం వేకువ జామున నుంచి రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మెన్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ విస్తృతంగా పర్యటించారు. గ్రామంలోని ప్రధాన వీధులలో కాలి నడకన పర్యటిస్తూ ప్రజలతో మమేకమయ్యారు. అదేవిధంగా లబ్దిదారుల ఇళ్లకు నేరుగా వెళ్లి కల్యాణ లక్ష్మీ, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వేల్పుల మల్లయ్య యాదవ్ తల్లి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రసమయి

బీఆర్ఎస్‌లో చేరిక..

శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామంలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన మైనార్టీ నాయకులు క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రావుల రమేష్, మాజీ మండలాధ్యక్షులు దుంద్ర రాజయ్య యాదవ్, సర్పంచ్ బొజ్జ తిరుపతి,ఆత్మ కమిటీ చైర్మన్ పాశం అశోక్ రెడ్డి, ఖమ్మం కృష్ణ, గట్టుదుద్దెనపల్లి సహకార సంఘం చైర్మన్ అనభేరి రాధాకిషన్ రావు,జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ మెంబర్ ఎలుక ఆంజ నేయులు పాల్గొన్నారు.



హార్వెస్టర్ యజమానులపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-చొప్పదండి

మండలంలో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న హార్వెస్టర్ యజమానులపై చర్యలు తీసుకోవాలని మండలంలోని రుక్మాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గాండ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. చొప్పదండి మండలంలోని రుక్మాపూర్ గ్రామంలో హార్వెస్టర్ యజమానులు రైతుల పంట పొలాలను కోసేందుకు ఒక్కొక్క రైతు వద్ద రూ.3500 నుంచి రూ.4000 వరకు ఒక గంటకు కోసేందుకు డిమాండ్ చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పంట పొలాలను హార్వెస్టర్ యజమానులు కోసేలా చేయాలని అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

ఆరో రోజు పంచాయతీ కార్యదర్శుల సమ్మె

నవతెలంగాణ- జగిత్యాల

జగిత్యాలరూరల్, అర్బన్ మండలాల జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఆరో రోజు సమ్మె కొనసాగించారు. సమ్మెకు మద్దతుగా సీనియర్ కార్యదర్శులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయితీ కార్యదర్శుల అధ్యక్షులు రాజరెడ్డి, జనరల్ సెక్రెటరీ వనజ, సంతోష్ మహేష్, శ్రీనివాస్, స్వప్న, స్రవంతి పాల్గొన్నారు.



సమ్మెలో పంచాయతీ కార్యదర్శులు

మెట్‌పల్లి: రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ఉద్యోగాల్ని క్రమబద్దీకరించి ఆదుకోవాలని తెలంగాణ జన సమితి కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కంతి మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెట్‌పల్లి ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో చేస్తున్న సమ్మె ఐదో రోజుకూ చేరింది. వారి సమ్మెకు కంతి మోహన్‌రెడ్డి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్ పల్లి పట్టణ అధ్యక్షుడు పసునూరి శ్రీనివాస్, జిల్లా విద్యార్థి సమితి అధ్యక్షుడు జిల్లాపెల్లి దిలీప్, నాయకులు బొడ్డు సుధాకర్, రంజాన్, మురళి, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లిరూరల్ :జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు వెంటనే రెగ్యులర్ చేయాలని మెట్‌పల్లి మండలంలో సమ్మె చేస్తున్న కార్యదర్శులకు బీజేపీ మెట్ పల్లి మండల శాఖ పక్షాన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బిజెపి యువ నాయకులు సురభి నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. కార్యదర్శులు చేస్తున్న న్యాయబద్ధమైన సమ్మెకు మద్దతు తెలిపినట్లు చెప్పారు. ఈ కార్య క్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు కొమ్ముల రాజుపాల్‌రెడ్డి, భోగ గంగాధర్, మారు జనార్ధన్, ఆకుల శ్రీనివాస్, గడ్డం శివారెడ్డి, కొట్టాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండిలో జియో 5జీ సేవలు ప్రారంభం

నవతెలంగాణ-చొప్పదండి

చొప్పదండి పట్టణంలో జియో 5జి సేవలు ప్రారంభమైనట్టు జేసీఎం కమలాకర్‌రావు తెలిపారు. చొప్పదండి పట్టణంలోని మణికంఠ మొబైల్స్ పాయింట్ వద్ద బుధవారం జియో 5జి సేవలను ఏర్పాటు చేయగా, ఎయిర్టెల్, ఐడియా కంటే మెరుగైన 5జి నెట్వర్క్ ను అందిస్తామని అన్నారు. జియో 5జి సేవలు అన్ని పట్టణాలకు గ్రామాలకు విస్తృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంల్ అర్షద్, జేపీఎల్ శ్రీకాంత్, జేపీఎం గంగాధర్, రిటైలార్స్ చెటిపెల్లి వెంకటేష్ నేత, లక్ష్మణ్, రాజు, అఖిల్ పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న జీవో సేవలు

ఉరేసుకుని బీహార్‌కు చెందిన వ్యక్తి ఆత్మహత్య



నవతెలంగాణ-వెల్గటూర్

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈఘటన వెల్గటూర్ మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంఖిట్ కుమార్(21) వ్యక్తి ఉపాధి కోసం బీహార్ నుండి వచ్చి జీవీఆర్ క్రషర్‌లో ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 1న కూరగాయలు తేవడానికి బయటికి వెళ్లి తిరిగి రాకపోవడంతో మృతుడి బావ రంజాన్ కుమార్ ఇంటికి ఫోన్ చేసి తెలుసుకున్నాడు ఇంటికి రాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. వాగు సమీపంలోని చెట్టుకు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. వేలాడుడుతున్న వ్యక్తిని గొర్ల కాపరి చూసి క్రాషర్‌లో పని చేసే వ్యక్తికి సమాచారం ఇచ్చాడు.సంఘటనా స్థలానికి పోలీసులు పరిశీలించి, కసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

ఉచిత బ్యాడ్మింటన్ శిక్షణా శిబిరం

నవతెలంగాణ-కరీంనగర్

కరీంనగర్ క్లబ్ ఇండోర్ కోర్టులో స్థానిక కరీంనగర్ ఆఫీసర్స్ క్లబ్, కరీంనగర్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 5 నుంచి ఉచిత వేసవి శిక్షణా శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ కార్యదర్శి ఉపేందర్ రావు, కరీంనగర్ క్లబ్ కార్యదర్శి అశోక్ రావు, సంయుక్త కార్యదర్శి కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని కరీంనగర్‌లోని 15ఏండ్లలోపు ఔత్సాహిక బాల బాలికలు వినియోగించుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9246976567, 9666308050 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఎన్‌ఆర్సీ సమీక్షా సమావేశం

నవతెలంగాణ-కరీంనగర్



: మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి

జిల్లాలోని రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమం (ఆర్బీఎస్కె), పోషకార పునరావాస కేంద్రం (ఎన్‌ఆర్సీ), డిస్టిక్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ (డీఈఐసీ) సిబ్బందిపై సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి లలితాదేవి మాట్లాడుతూ..జిల్లాలో పని చేస్తున్న ఆర్బీఎస్కె టీంలో ప్రస్తుతం పాఠశాలలకు సెలవు దినాలు కావడంతో అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి పరీక్షలు నిర్వహించాలని, పోషణ లోపం ఉన్న వారిని గుర్తించి ఎన్‌ఆర్సీ కేంద్రానికి పంపించాలన్నారు. ఆర్బీఎస్కె టీములు వారి పరిధిలోని గ్రామాలలో వారానికి రెండు శిబిరాలను నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో తులసి రవీందర్, డీపీఓ, చల్లా రంగారెడ్డి, డెమో వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మాతృ మరణాలపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ లలితాదేవి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానంగా రక్తహీనత ఎక్కువగా ఉండటం వల్ల మరణాలు సంభవించడానికి అవకాశాలు ఉన్నందున గర్భిణీ స్త్రీలలో హెచ్‌బీ లెవెల్ 11శాతంపైన ఉండే విధంగా గర్భిణీలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో డాక్టర్ మంజుల, డాక్టర్ వినీత, డాక్టర్ హరిత, ఆర్‌ఎల్ కాంతారావు, చల్లా రంగారెడ్డి పాల్గొన్నారు.

తిరువీధి ఉత్సవాలను అడ్డుకోవడం హేయమైన చర్య

జానంపేట మారుతి స్వామి

నవతెలంగాణ-కరీంనగర్

చాత్తాద శ్రీవైష్ణవులు ప్రతి యేటా ఎన్నో ఏళ్లుగా తిరుచానూరు వద్ద నిర్వహిస్తున్న రామానుజుల వారి తిరువీధి ఉత్సవాలను టీటీడీ, విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ సిబ్బంది అడ్డుకోవడం అత్యంత హేయమైన చర్య అని చాత్తాద శ్రీవైష్ణవ సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ అధ్యక్షుడు జానంపేట మారుతి స్వామి అన్నారు. హిందువులు, చాత్తాద శ్రీవైష్ణవుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్న ఈ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తిరుమలలో ఆలయ వ్యవస్థ ఏర్పాటుచేసిన ఆచార్యులు, తిరుపతి పట్టణానికి అంకురార్పణ చేసిన జగదాచార్యులు, ఆయన తిరువీధి ఉత్సవాలనే అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమన్నారు. భగవద్రామానుజులవారిని శత్రు దాడి నుంచి కాపాడి మేల్కోట తీసుకెళ్లి సంప్రదాయ పరిరక్షణ చేసిన రామానుజులకి అత్యంత ప్రీతి పాత్రులైన చాత్తాద శ్రీవైష్ణవులు తలపెట్టిన తిరువీధి ఉత్సవ వేడుకలను అడ్డుకోవడం అత్యంత హేయమైన చర్య అని, దీన్ని యావత్ చాత్తాద శ్రీవైష్ణవ సమాజం ఖండిస్తుందని తెలిపారు. ఈ చర్యలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు ఇకముందు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. లేకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

నవతెలంగాణ-రాయికల్



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు రైతులకు గిట్టుబాటు ధర పొందేందుకు వరి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుతోపాటు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచిందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం రాయికల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో డీసీఎంఎస్ వారి ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని జడ్పీ చైర్పర్సన్ దావ వసంత, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డిలతో కలసి ఎమ్మెల్యే ప్రారం భించారు. మొక్కజొన్న అధిక దిగుబడి రావడంతో రైతులకు గిట్టుబాటు కల్పించేందుకు మక్కల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు,ఎంపీపీ సంధ్యారాణి సురేందర్ నాయక్ ,జడ్పీటిసి అశ్విని జాదవ్, సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి,మున్సిపల్ వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, మున్సిపల్ కౌన్సిలర్లు తురగ శ్రీధర్ రెడ్డి, మహేందర్, సాయి కుమార్,వ్యవసాయ శాఖ అధికారులు దివ్య భారతి ,ప్రకాష్, పట్టణ పార్టీ అధ్యక్షులు ఇంతియాజ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

నవతెలంగాణ-హుజురాబాద్

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. ఈఘటన హుజూ రాబాద్ పట్టణంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజురాబాద్ పట్టణంలోని సైదాపూర్ క్రాస్ రోడ్ వద్ద బుధవారం తెల్లవారుజామున వరంగల్ నుంచి కరీంనగర్ వైపు వేగంగా వెళుతున్న కారు ముగ్గురు వ్యక్తులను ఢీకొట్టింది. ఈ సంఘటనలో హుజురాబాద్ మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికురాలుగా పని చేస్తున్న నల్గొండ సమ్మక్క (55) తీవ్ర గాయలై అక్కడికక్కడే మృతి చెందింది. మరో కార్మికురాలు రాచపల్లి రాజేశ్వరి, బుర్ర భాస్కర్‌గౌడ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని హుజురాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి 108లో వైద్య చికిత్స నిమిత్తం తరలించగా ప్రథమ చికిత్స అనంతరం రాజేశ్వరి పరిస్థితి విషమంగా ఉండడంతో ఆమెను వరంగల్ ఏకశిలా ఆసుపత్రికి తరలించారు. కాగా వరంగల్లో ఆమె చికిత్స పొందుతున్న ఆసుపత్రికి హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ సందర్శించి ఆరోగ్య సమాచారాన్ని తెలుసుకున్నారు. అజాగ్రత్తగా నడిపిన కారు డ్రైవర్ అల్లెపు రాజేష్ పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు_న్నారు. మృతు రాలు సమ్మక్కకు భర్త యాదగిరి కూతురు రజితలు ఉన్నారు .మరో ఘటన హుజురాబాద్ పట్టణ శివారులోని కేసీ కెనాల్ వద్ద శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామానికి చెందిన దగ్గు కిషన్ రావు రోడ్డు దాటుతుండగా ఐచర్ వ్యాన్ వెనక నుంచి ఢీకొనడంతో తీవ్ర గాయాలైన కిషన్‌రావు మృతి చెందాడు. కాగా వ్యక్తి మతికి కారణమైన వ్యాన్ డ్రైవర్ మక్కల బిక్షపతిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జంగపల్లిలో శ్రీభక్త మార్కండేయ దేవాలయ పనులు ప్రారంభం

నవతెలంగాణ-గన్నేరువరం

మండలంలోని జంగపల్లి గ్రామంలో పద్మశాలి సంఘం ప్రజలు కలిసి శ్రీ భక్త మార్కండేయ ఆలయానికి బుధవారం భూమి పూజ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ అటికం శారధ శ్రీనివాస్, ఎంపీటీసీ అటికం రాజేశం, మండల పద్మశాలి సంఘం అధ్యక్షులు గుంటుక లింగయ్యకులం పెద్దలు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బాధిత చిన్నారులకు అండగా బీ.ఎన్. రావు హెల్త్ ఫౌండేషన్

- బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారులు
- పేదలకు భరోసా కల్పిస్తాం: బీఎన్‌రావు హెల్త్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ .బి.ఎన్.రావు



చెక్కులు అందజేస్తున్న బీ.ఎన్‌రావు, డాక్టర్లు

నవతెలంగాణ-కరీంనగర్

కుటుంబ ఆర్థిక పరిస్థితితో ఇబ్బందులు పడుతూ చికిత్స తీసుకోకుండా కొట్టుమిట్టడుతున్న బ్లడ్ క్యాన్సర్ చిన్నారులకు డాక్టర్ బీఎన్‌రావు అండగా నిలిచి, ఆర్థిక భరోసా కల్పించారు. బుధవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని సాగర్ క్యాన్సర్ కేర్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో క్యాన్సర్‌తో బాధపడుతున్న కాగజ్‌నగర్‌కు చెందిన అఖిలేష్(5), శనిగరంకు చెందిన హరిచందన(5), హుజురాబాద్‌కు చెందిన ప్రణయ్ (10)లకు రూ.45వేల చెక్కులను హెల్త్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బీ.ఎన్‌రావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా బీ.ఎన్‌రావు మాట్లాడుతూ.. లుకేమియాతో బాధపడుతున్న చిన్నారుల చికిత్స అందజేస్తున్న ప్రముఖ మెడికల్ అంకాలజీ డాక్టర్‌చేతన వారి ఆర్థిక పరిస్థితిని తమ బి.ఎస్.రావు హెల్త్ ఫౌండేషన్ దృష్టికి తీసుకొచ్చినట్టు తెలిపారు. చిన్నారుల ఇబ్బందులు తెలపగానే చిన్నారులకు అండగా నిలువాలని నిర్ణయించుకున్నట్టు చెప్పారు. మున్ముందు కూడా పేదలకు బి.ఎస్.రావు హెల్త్ ఫౌండేషన్ అండగా ఉంటుందని తెలిపారు. వైద్యం చేయించుకోలేని నిరుపేదల తమను సంప్రదిస్తే వైద్య సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం డాక్టర్ చేతన మాట్లాడుతూ.. చిన్నారులకు అండగా నిలిచిన బి.ఎస్.రావు హెల్త్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బి.ఎస్.రావుకు కృతజ్ఞతలు తెలిపారు. చిన్నారులు లూకేమియా (బ్లడ్ క్యాన్సర్)తో బాధపడుతున్నరిని మరో రెండేళ్ల చికిత్స అందించాల్సి ఉందన్నారు. దాతలు ముందుకు వచ్చి వారికి ఆర్థిక సాయం అందిస్తే వారి భవిష్యత్ బంగారుమయం అవుతుందన్నారు. హుజురాబాద్‌కు చెందిన ప్రణయ్ తండ్రి కరోనా సమయంలో మరణించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.ఎస్.రావు హెల్త్ ఫౌండేషన్ డాక్టర్.జాన్సీ, డాక్టర్. మానస , డాక్టర్ . అరుణ్‌కతారి పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలి

మంత్రి గంగుల కమలాకర్

నవతెలంగాణ-కరీంనగర్



మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

రాష్ట్రంలోని ప్రతి కార్మికుడు ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలన్నదే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర బీసీ సంక్షేమం పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని జ్యోతినగర్‌లో తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ఆధ్వర్యంలో ఉచిత పరీక్షల ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..కార్మికుల శ్రేయస్సు దృష్ట్యా కేంద్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలను నిర్వహిస్తుందన్నారు. ముంబాయి సీఎస్సీ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో మొత్తం 19 రకాల్లో 140 పరీక్షలను ఉచితంగా చేస్తుందన్నారు. భవన నిర్మాణ కార్డు, ఆధార్ కార్డు ఉన్న ప్రతి కార్మికుడికి పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 7 ల్యాబ్‌లను ప్రారంభించడం జరిగింద న్నారు. కరీంనగర్ ల్యాబ్‌లో కరీంనగర్ జిల్లాతో పాటు జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మంచిర్యాల, సిద్దిపేట, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలకు చెందిన కార్మికులకు ఈ ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహిం చడం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమ ంలో మేయర్ సునీల్ రావు, కలెక్టర్ ఆర్వీ కర్ణన్, కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ రమేష్ బాబు, వైద్యులు పాల్గొన్నారు.

విద్యానగర్‌లో గొల్ల, కురుమల కుల దైవం బీరప్ప నాగవెల్లి కళ్యాణోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన నాగవెల్లి పట్నం కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ హాజరయ్యారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..మన సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవన్నారు. మహంకాళి, బీరప్ప, కామరాతి దేవతల ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కురుమ సంఘం ప్రతినిధులు గొంగడితో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేయర్ సునీల్ రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ కార్పొరేటర్ బీర్ల బీరయ్య కర్రే పావని, కర్రే అనిల్, తొంటి రాజేందర్, నాయకులు పాల్గొన్నారు.



కేబుల్ బ్రిడ్జీ పనులు పరిశీలిస్తున్న మంత్రి గంగుల

కేబుల్ బ్రిడ్జీ నిర్మాణాన్ని పూర్తి చేయాలి

జిల్లా ప్రతిష్టను పతాక స్థాయికి ఎగరవేసేలా నిర్మిస్తున్న కరీంనగర్ కేబుల్ బ్రిడ్జీ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ సూచించారు. బుధవారం కరీంనగర్ కేబుల్ బ్రిడ్జీ నిర్మాణ పనులను కలెక్టర్ ఆర్వీ కర్ణన్, మేయర్ సునీల్ రావులతో కలిసి మంత్రి గంగుల కమలాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా, అత్యాధునిక హంగులతో నిర్మిస్తున్న కేబుల్ బ్రిడ్జీ, మానేరు రివర్ ఫ్రంట్ పనులు రాత్రింబవళ్లు చేపట్టి, ప్రారంభించడానికి సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారి రాజశేఖర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పగటి కలలు మానుకోవాలి

మీడియా సమావేశంలో మేయర్ సునీల్ రావు

నవతెలంగాణ-కరీంనగర్



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్

బీజేపి అధికారంలోకి వస్తుందని పగటి కళలు కనడం మానుకోవాలని, బండి సంజయ్‌కి అది ఒక పగటి కళగానే మిగులుతుందని నగర మేయర్ యాదగిరి సునీల్ మండిపడ్డారు. కరీంనగంలోని ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్‌లో మీడియాతో మాట్లాడారు. మే డే సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పారిశుద్య కార్మికులకు వెయ్యి రూపాయలు అదనంగా వేతనం పెంచుతున్నామని చేసిన ప్రకటనపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. పొరపాటున ఎంపీగా గెలవగానే కరీంనగర్ మున్సిపాలిటీలో కౌన్సిలర్‌గా పని చేసిన అనుభవాన్ని మరిచిపోవడం విడ్డూర మన్నారు. అభివృద్ధి అంటే ఎరగని ఎంపీ బండి సంజయ్ పార్టీ అధ్యక్షుడు కాగానే నోటికి ఎంతొస్తే అంత మాట్లాడటం సరికాదని హెచ్చరించారు. గత ప్రభుత్వాల పాలనలో తెలంగాణ ప్రభుత్వ పాలనలో పారిశుధ్య కార్మికుల వేతనాల మధ్య వ్యత్యాసం తెలుసుకొని మాట్లాడాలని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం పారిశుధ్య కార్మికులకు అందిస్తున్న వేతనాలకు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మీ ప్రభుత్వం ఇస్తున్న వేతనాలకు అసలు పొంతనే లేదని ముందు బండి సంజయ్ ఆ విషయాన్ని గమనించి హామీలు ఇవ్వాలన్నారు. బండి సంజయ్ అబద్ధాలు, అసత్యాలతో ప్రజలను, కార్మికులను మభ్యపెట్టే చేష్టలు మానుకోవాలని హెచ్చరించారు.. ఈ మీడియా సమావేశంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెగ్యులర్ చేయాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్

నవతెలంగాణ-కరీంనగర్

వైద్య శాఖ అర్బన్ సెంటర్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్‌ను రెగ్యులర్ చేయాలి సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ అన్నారు. కరీంనగర్‌లోని స్థానిక ముకుందలాల్ మిశ్రా భవన్‌లో జిల్లా అర్బన్ హెల్త్ సెంటర్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ సమావేశం జిల్లా అధ్యక్షురాలు ముదం రమాదేవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడ్ల రమేష్ మాట్లాడుతూ. రాష్ట్ర వ్యాప్తంగా వైద్యశాఖ డిపార్ట్‌మెంట్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్స్ ఉద్యోగులు అధిక పని ఒత్తిడి భారంతో పని చేస్తారన్నారు. వెయ్యి జనాభాకి ఒకరు సేవలు అందించాలి కానీ 20 వేల జనాభాకు ఒకరు సేవలు అందిస్తున్నారన్నారు. వీరికి ఇప్పటివరకు అదనపు ఆశా కార్యకర్తల సిబ్బందిని నియమించకుడా అదనపు పనులు ప్రభుత్వం చేపిస్తుందన్నారు. ఏండ్లుగా రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాలకు విన్నవిం చుకున్న, పోరాటాలు నిర్వహించిన ప్రభుత్వంలో చలనం లేదన్నారు. రాష్ట్రంలో లక్ష అరవై వేల మంది కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు రెగ్యులరైజ్ కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. అర్బన్ సెంటర్ ఉద్యోగులకు పర్మినెంట్ చేసే వరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పని భారం తగ్గించడానికి వెయ్యి జనాభాకు ఒక ఆశా కార్యకర్త నియమించాలని డిమాండ్ చేశారు. 7వ తేదీ నుంచి ప్రతి రోజు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, నాయకులు సంతోష, సంపూర్ణ, మంగదేవి, స్రవంతి, పుష్ప తదితరులు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్

సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి

మున్సిపల్ చైర్ పర్సన్ ముత్యం సునీత రమేష్‌గౌడ్

నవ తెలంగాణ-సుల్తానాబాద్:

అత్యవసర సమయంలో గుండెపోటుకు గురైన వారిని ఆదుకునేందుకు సిపిఆర్ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ చైర్ పర్సన్ ముత్యం సునీత రమేష్ గౌడ్ అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్పీ, అంగన్వాడీలకు, వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న పలువురికి గర్రెపల్లి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ మధుకర్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ, గుండెపోటుకు గురైన వారికి శ్వాస అందించే విధానాన్ని గుండె కృత్రిమంగా కొట్టుకునే విధంగా చేయు పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ రాజశేఖర్, డాక్టర్ మహేందర్ కుమార్, వార్డు కౌన్సిలర్, మేనేజర్ అలిమోద్దీన్, అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆర్పీ (రీసోర్స్ పర్సన్)లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వారం రోజుల్లోగా చలాన్లు పూర్తి చేసుకోవాలి

తహసీల్దార్ చల్ల రామ్మోహన్

నవ తెలంగాణ-రామగిరి:

సుందిళ్ల, ముత్యాల గ్రామస్తులు వారం రోజుల్లోగా చలాన్ల ప్రక్రియ పూర్తి చేసుకోవాలని రామగిరి మండల తాహసీల్దార్ చల్ల రామ్మోహన్ అన్నారు. ఈ మేరకు బుధవారం రెండు గ్రామాల్లో ఏర్పాటు చేసిన గ్రామ సభల్లో ఆయన మాట్లాడుతూ, రామగిరి మండలంలో జి.ఓ. 59 కింద సుందిల్ల, ముస్త్యాల గ్రామంలో అంగీకరించబడిన (170) దరఖాస్తులకు సంబంధించిన పూర్తి చలాన్ రూపాయలు 7 రోజుల్లో ఎస్‌బీఐ ద్వారా చెల్లించి కార్యాలయంలో సమర్పిస్తే సబ్-రిజిస్ట్రార్ మంథని ద్వారా దరఖాస్తుదారు పేరున రిజిస్ట్రేషన్ చేస్తామని తహసీల్దార్ అన్నారు. పూర్తిగా డబ్బులు చెల్లించిన ముగ్గురికి ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిపారు. పూర్తి డబ్బులు చెల్లించని వారి దరఖాస్తులు తిరస్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి రాజలింగు, ఆర్ఐ రాజబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పొన్నంను విమర్శించే అర్హత జీవీకి లేదు..

నవతెలంగాణ-మానకొండూర్



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ చేసిన కృషి ఏమిటో తెలుసుకొని మాట్లాడాలని, ఆయనను విమర్శించే అర్హత బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావుకు లేదని డీసీసీ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సంపత్ గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సంపత్ మాట్లాడారు. పొన్నం, కవ్వంపల్లిలపై జీవీ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి దాదాపు 20 రోజులు గడిచిన రైతుల ధాన్యం కొనుగోలు చేయడంలో జాప్యంపై కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్, డిసిసి అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణ పలు కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు అండగా ఉంటామని భరోసా కల్పిస్తే ఓర్వలేక విఆర్ రాజకీయ వ్యాఖ్యాలు చేయడం ఎంత వరకు సబబు అని విమర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులు లేక అకాల వర్షాలతో అనేక ఇబ్బం దులు ఎదుర్కుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులకు అండగా కాంగ్రెస్ పార్టీ పోరాడు తుందని హెచ్చరించారు.ఈ సమావేశంలో మండల అధ్యక్షులు నందగిరి రవీంద్రాచారి, ఎంపీటీసీ చలిగంటి సంపత్, సాయిరి దేవయ్య, గట్టు శ్రీధర్, గసిగంటి సంపత్, రామిడి తిరుపతి, మర్రి ఓదెలు, భారత్ గాంధీ రెడ్డి, మీస సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టులో సస్పెన్స్ థ్రిల్లర్ షూటింగ్

ప్రారంభించిన ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

నవతెలంగాణ-మల్యాల



క్లాప్ కొడుతున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

మండలంలోని కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో క్రైం సస్పెన్స్ థ్రిల్లర్ సినిమా షూటింగ్‌ను చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ బుధవారం ప్రారంభించారు. జమ్మికుంటకు చెందిన దర్శకుడు గౌతమ్ కృష్ణ, నిర్మాత సతీష్‌లు అమ్మ బ్యానర్‌లో నిర్మిస్తున్న సస్పెన్స్ థ్రిల్లర్ సినిమా ముహూర్తం కొండగట్టులో చేపట్టగా, ఎమ్మెల్యే క్లాప్ కొట్టి ప్రారంభించారు. ఈ సినిమాలో ఎమ్మెల్యే తనయుడు సుంకె దీక్షిత్ ఏసీపీ క్యారెక్టర్‌లో హీరో, హైదరాబాద్‌కి చెందిన నవ్య శ్రీనివాస్ హీరోయిన్‌గా చేస్తున్నారు. అంతకుముందు ఎమ్మెల్యే రవిశంకర్ కుటుంబ సభ్యులతో పాటు సినిమా యూనిట్ సభ్యులందరూ అంజన్న సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. అనం తరం ఆలయ అర్చకులు వారిని ఆశీర్వదించి, తీర్థప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో మిట్టపల్లి సుదర్శన్, జనగాం శ్రీనివాస్, ఆలయ ఏఈవో బుద్ది శ్రీనివాస్, సూపరింటెండెంట్ సునీల్, మాజీ డైరెక్టర్ కొంక నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీఓస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి సన్మానం

నవతెలంగాణ-కరీంనగర్

టీఎన్జీఓస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మారం జగదీష్ ఏకగ్రీవంగా ఎన్నికై మొట్ట మొదటిసారిగా జిల్లాకు విచ్చే యగా కరీంనగర్‌లోని స్థానిక రామ్‌నగర్‌లో గల తన నివా సంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్, జిల్లా అధ్యక్షులు నాగుల కనకయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్‌లు శాలువా, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మర్రి శ్రీనివాస్ యాదవ్, బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు పెంట శ్రీనివాస్, సంకూరి వెంకటేశ్వర్లు, పసుల రవికుమార్, కిషన్ పటేల్ తదితరులున్నారు.

జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి

నవతెలంగాణ-కరీంనగర్



ప్రొబేషనరీ పీరియడ్ ముగిసినా రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయకపోవడంతో సమ్మె బాట పట్టిన కార్యదర్శులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి డిమాండ్ చేశారు. మూడు సంవత్సరాల ప్రొబేషనరీ పీరియడ్ ముగిసినా రెగ్యులర్ చేయకపోవడంతో విధిలేని పరిస్థితిలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మె బాట పట్టి వారం కావస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. జిల్లాలో జూనియర్ పంచా యతీ కార్యదర్శుల సమ్మెతో గ్రామాల్లో ప్రజలు వివిధ రకాల ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు, అనుమ తులు, పరిపాలన పర్యవేక్షణ కుంటు పడిందన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించి గ్రామాలు అభివృద్ధి చెందేలా చూడాలని పేర్కొన్నారు.

ముగిసిన బీరప్ప పట్నాలు

నవతెలంగాణ-కరీంనగర్



ఉత్సవాల్లో పాల్గొన్న పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

స్థానిక రాంనగర్‌లోని బీరప్ప దేవాలయంలో అంగరంగ వైభవంగా ఉత్సవాలు జరిగాయి. ఉత్సవాలలో పాల్గొన్న మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లా డుతూ.. 5 సంవత్సరాల కొకసారి జరిగే ఈ ఉత్సవాల వల్ల వృత్తి పని వారు, వ్యవసాయదారులు, వ్యాపారులు, అన్ని రంగాల్లో ఉన్న ప్రజలు బీరప్ప ఆశీర్వాదంతో సుభిక్షంగా జీవించాలని కోరుకున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మేకల నర్సయ్య, కర్రె అనిల్, బీర్ల భీరయ్య, లింగయ్య, బీర్ల నర్సయ్య, పెద్దిగారి ఎల్లయ్య, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, కటకం వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో 99 పర్సంటైల్కుపైగా సాధించిన ముగ్గురు ఆకాష్ జూస్ విద్యార్థులు

నవతెలంగాణ - కరీంనగర్



కరీంనగర్‌లోని ఆకాష్ జూస్ విద్యార్థులు ముగ్గురు ఇటీవల జరిగిన జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (జెఈఈ) 2023 మెయిన్‌లో 99 పర్సంటైల్, ఆపైన సాధించారు. ఈ ముగ్గురు విద్యార్థుల్లో 99.84 పర్సంటైల్‌ను వేముల సిద్ధార్థ సాధించగా, సంకిటి ఐశ్వర్య రెడ్డి 99.68 పర్సంటైల్ను కార్యాడ వరప్రసాద్ రెడ్డి 99.60 పర్సంటైల్ సాధించి తల్లిదండ్రులతో పాటుగా ఇనిస్టిట్యూట్‌కు గర్వకారణంగా నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించిన ఆకాష్ బైజూస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అభిషేక్ మహేశ్వరి మాట్లాడుతూ... అసాధారణ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్నానన్నారు. పర్సంటైల్ టాపర్‌గా వీరు సాధించిన విజయం, వారు పడిన కష్టం, అంకిత భావం, అతని తల్లిదండ్రులు అందించిన మద్దతు గురించి ఎంతో వెల్లడిస్తుందన్నారు. భవిష్యత్లో మరిన్ని విజయాలను వారు సాధించాలని ఆకాంక్షిస్తున్నామన్నారు.

దేవాలయానికి భూమి పూజ

నవతెలంగాణ - కొనరావుపేట

దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని కొనరావుపేట సర్పంచ్ పోకల రేఖ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో రేణుక దేవి ఆలయ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు రైతు సమన్వయ కమిటీ జిల్లా ఉపాధ్యక్షులు అబ్బాయిని పాల్గొన్నారు.

అన్నదాత ఆగమాగం

- తీవ్రంగా దెబ్బతిన్న వరి, నువ్వు పంటలు
- ఇదే అదనుగా హార్వెస్టర్ యజమానుల దోపిడీ



నవతెలంగాణ - చందుర్తి : ఇటీవల కురిసిన అకాల వర్షాలకు అన్నదాతలు అతలకుతలం అవుతున్నారు. చందుర్తి మండలంలోని 18గ్రామాల పరిధిలో 30వేల ఎకరాలు సాగు చేశారు. కాగా కోతలు 5శాతం కూడా కాలేదు. మండలంలో 100ఎకరాల వరకు నువ్వుపంట దెబ్బతిన్నట్టు అంచనా.

ఐదు గ్రామాల్లో నేల రాలిన ధాన్యం

మండలంలోని ఆశిరెడ్డిపల్లి, తిమ్మాపూర్ ,రామన్న పేట,చందుర్తి, మాల్యాల గ్రామాలలో ఆదివారం వడగండ్లు భారీగా కురవడంతో ధాన్యం మొత్తం నేలపాలైనది. వ్యవసాయశాఖ అధికారులు మంగళవారం సర్వే చేయగా 1000ఎకరాల వరకు నష్టం వాటిల్లినట్లుగా అంచనా వేశారు. మొత్తంగా 30వేల ఎకరాల సాగులో పదిహేను వందల ఎకరాల వరకు కోతలు జరిగాయి. ఐదు గ్రామాల్లో 1000ఎకరాల నష్టం వాటిల్లగా పదమూడు గ్రామాల పరిధిలో 500ఎకరాలు వడ్లు నేల రాలాయని అధికారులు తెలిపారు. మొత్తంగా 1500ఎకరాల్లో పంటలు దెబ్బతినగా అన్నదాతకు కోట్ల రూపాయల మేర ఆర్థికంగా నష్టం జరిగినట్టు తెలుస్తోంది. మరో 28500ఎకరాల్లో వరి కోతకోయకపోవడంతో నష్టం తీవ్రత పెరిగే అవకాశం ఉంది. వారం రోజులుగా 7నుంచి 15సెంటీమీటర్ల వర్షం కురిసినట్లుగా అధికారులు తెలిపారు. మరో వారం వర్షాలు ఉన్నట్టు సమాచారం.

పంట కోత యంత్రాలకు డిమాండ్

వర్షాలు కురవడంతో ఫోర్ వీలర్ హార్వెస్టర్లకు భారీగా డిమాండ్ పెరిగింది. గతంలో రూ.3వేలకు గంటకు ఉండగా ప్రస్తుతం రూ.5వేల వరకు వసూలు చేస్తున్నారు.

ఎకరానికి 25 వేలు నష్ట పరిహారం ఇవ్వాలి : ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు

పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేలు నష్టపరిహారం ఇవ్వాలి. ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేలు ఇస్తే అది పెట్టుబడి ఖర్చులకు కూడా సరిపోవు. దెబ్బతిన్న నువ్వు పంటకు కూడా పరిహారం ఇవ్వాలి. జిల్లా వ్యాప్తంగా 40వేల ఎకరాల్లో వడగండ్లకు 40వేల ఎకరాల వరకు నష్టం జరిగింది.ప్రభుత్వం వెంటనే రైతులను ఆదుకోవాలి.

జూన్ 2కల్లా డబుల్ బెడ్రూం ఇండ్లు ప్రారంభానికి సిద్ధమవ్వాలి

రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

నవతెలంగాణ - సిరిసిల్ల : జూన్ 2వ తేదీ నాటికి సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు ,శాంతినగర్, పెద్దూర్ లలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ప్రారంభించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని తన చాంబర్లో సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనుల పురోగతిపై మున్సిపల్, సెస్, రెవెన్యూ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు, శాంతినగర్, పెద్దూర్‌లలో డబుల్ బెడ్రూం ఇండ్లకు సంబంధించి సూయుజ్ నెట్‌వర్క్, వాటర్ సంప్, సెప్టిక్ ట్యాంక్, రోడ్డు నెట్ వర్క్ వంటి పెడింగ్ పనులను మిషన్ మోడ్‌లో పూర్తి చేయాలన్నారు. జూన్ 2నాటికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం అభివృద్ధి పనులను కూడా పూర్తిచేసి ప్రారంభానికి సర్వసన్నద్ధం చేయాలని అధికారులకు సూచించారు. మన ఊరు-మనబడి కార్యక్రమం కింద చేపట్టిన పనులను జూన్ 2వ తేదీ లోగా పూర్తి చేయాలన్నారు. బైపాస్‌లకు రెండు వైపులా అవెన్యూ ప్లాంటేషన్‌తోపాటు మీడియం ప్లాంటేషన్ పనులను జూన్ మొదటి వారంలో పూర్తిచేసి వర్షాలు కురిసిన వెంటనే మొక్కలు నాటేలా ప్లాన్ చేసుకోవాలన్నారు. ప్లాంటేషన్‌కు అవసరమైన మొక్కలను హైదరాబాదులోని హెచ్ఎండిఏ నుంచి తెప్పించుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. సిరిసిల్ల పట్టణంలో నిర్మాణంలో ఉన్న సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ (ఎస్టిపి) పనులను ఆగస్టు 15 కల్లా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మున్సిపల్ అధికారులకు సూచించారు. పెద్దూరులో మెడికల్ కళాశాల పక్కన చేపడుతున్న మోడల్ టౌన్ షిప్ లేఅవుట్ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. సిరిసిల్ల పట్టణంలో ఇప్పటివరకు 28 కమ్యూనిటి హాల్‌ల నిర్మాణం చేపట్టాల్సి ఉండగా ఇప్పటివరకు 15కమ్యూనిటీ భవనాల నిర్మాణ పనులు ప్రారంభ మయ్యాయని, మిగతా 13కమ్యూనిటీ నిర్మాణం పనులకు సాధ్యమనంత త్వరగా టెండర్‌లను పిలిచి పనులను ప్రారంభించాలన్నారు. సిరిసిల్ల పట్టణంలో అగ్ని ప్రమాదాలకు సంభవించకుండా అన్ని కమర్షియల్ ఎస్టాబ్లిష్మెంట్లకు ఫైర్ సేఫ్టీ ఎడిట్ నిర్వహించాల్సిందిగా ఇదివరకే ఆదేశించినందున నిర్దేశించిన లక్ష్యం మేరకు వెంటనే ఫైర్ సేఫ్టీ ఆడిట్ చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలో అక్రమ లేఅవుట్లపై ఉక్కుపాదం మోపాలని, అక్రమ లేఅవుట్ ప్లేసులో ఆ విషయం ప్రజలకు తెలిసేలా బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. సిరిసిల్ల పట్టణంలో ఏదైనా ప్రధాన కూడలిలోని ఒకే స్ట్రెచ్‌లో సెస్, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా విద్యుత్, టెలిఫోన్, నెట్, కేబుల్ వైర్లు బయటకు కనిపించకుండా ఉండేలా అండర్ గ్రౌండ్‌లో ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో సెస్ ఎండీ రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, తాసిల్దార్ విజయ్ కుమార్ టౌన్ ప్లానింగ్ అధికారి అన్సర్ తదితరులు పాల్గొన్నారు.

కనీస మద్దతు ధరకే తడిసిన ధాన్యాన్ని కొంటాం

జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ ఖీమ్యా నాయక్

నవతెలంగాణ - సిరిసిల్ల : జిల్లాలో అకాల వర్షాలకు తడిసిన, రంగుమారిన, దెబ్బతిన్న ధాన్యాన్ని కూడా చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ ఖీమ్యా నాయక్ భరోసా ఇచ్చారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్లో పౌరసరఫరాల అధికారులు, రైస్ మిల్లర్లతో జిల్లా అదనపు కలెక్టర్ ధాన్యం కొనుగోలుపై సమావేశం నిర్వహించారు. రైతులు ఎవ్వరూ ఆందోళన చెందవద్దన్నారు. మామూలు వరి ధాన్యానికి చెల్లించినట్టుగానే తడిసిన ధాన్యానికి కూడా కనీస మద్దతు ధర చెల్లిస్తామని తెలిపారు. నిర్దేశిత తేమ శాతం 17 కు ఒకశాతం అటూ ఇటూగా ఉన్న కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని జిల్లా అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల దృష్ట్యా రైస్ మిల్లర్లు అన్నదాతలకు అండదండగా ఉండాలన్నారు. జిల్లాలోని రైస్ మిల్లర్లు రైస్ మిల్‌కు వచ్చిన ధాన్యాన్ని వెను వెంటనే అన్‌లోడ్ చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డీసీఎస్ఓ జితేందర్ రెడ్డి, డీఎమ్సీఎస్సీ, జితేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణి

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

ఎల్లారెడ్డిపేట మండలంలోని బండలింగం పల్లి గ్రామంలో ఎంపిటిసి కొత్తపల్లి పద్మ దేవయ్య ఆధ్వర్యంలో బుధవారం లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణి చేశారు. ఈ సందర్భంగా కొత్త పల్లి పద్మ దేవయ్య మాట్లాడుతూ ప్రభుత్వం కళ్యాణలక్ష్మి పథకంలో భాగంగా రూ.100116 మంజూరు చేయడం జరుగుతుందన్నారు. వివాహలు జరిగిన నిరుపేదలకు కళ్యాణలక్ష్మి దరఖాస్తు చేసుకోవడానికి ఇబ్బందులు జరుగుతున్నాయని గెజిటేడ్ సంతకాల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి కళ్యాణ లక్ష్మి వేబ్‌సైట్‌లో ఇబ్బందులు ఉన్నాయని వాటిని ప్రభుత్వం వెంటనే సరిచేయాలన్నారు. ఆన్‌లైన్‌లో చదువుకున్న వారి పదవ తరగతి వివరాలు చదువుకున్న పెట్టినట్లయితే డాటా చూపెట్టడం లేదని ఆన్‌డిపాయిన్‌డ్ అని చూపెడుతుందన్నారు. చదువుకోలేదని పెడితే ఆన్‌లైన్ దరఖాస్తు తీసుకుంటుందని దానిని సరిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ప్రవీణ్‌రెడ్డి, టి స్వామి, టి. దేవరాజు, ఎంయి మూసుఫ్, కొడుముంజ దేవరాజు, చింతల రాజులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం రెగ్యులర్ చేయాలి

టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి సత్యం




నవతెలంగాణ-ఇల్లంతకుంట : కొద్ది రోజులుగా సమ్మె చేస్తున్న పంచాయతీ కార్యదర్శుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టిటిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి దామెర సత్యం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సమ్మె చేస్తున్న కార్యదర్శులకు బుధవారం ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. సమ్మెతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని, ఉద్యోగుల సమస్యల పరిష్కారం లో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలన్నారు. ఇప్పటికైనా వారి సమస్యలు పరిష్కరించి, చాలీచాలని జీతంతో పనిచేస్తున్న కార్యదర్శుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎల్లోజి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామ కార్యదర్శుల సమ్మెకు బీఎస్పీ మద్దతు

నవతెలంగాణ - ముస్తాబాద్ : కార్యదర్శులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని కార్యదర్శులు చేస్తున్న రిలే దీక్షకు బీఎస్పీ జిల్లా అధ్యక్షులు చాకలి రమేష్ మండల నాయకులు బుధవారం మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో కార్యదర్శులు లేకుంటే ఏ పని కూడా కాదని ప్రభుత్వం వారికి న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ఎజెండా


ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



నవతెలంగాణ - ఇల్లంతకుంట : గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ఎజెండా అని తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మెన్ రసమయి బాలకిషన్ అన్నారు. బుధవారం మండలంలోని రంగంపేట గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్రం ఏర్పాటు కాకముందు గ్రామాల్లో అభివృద్ధి శూన్యమని, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై కేసీఆర్ సీఎం అయ్యాక రాష్ట్రంలోని గ్రామాలు అభివృద్ధిలో దూసుకుపోతున్నాయన్నారు. ప్రజల సౌలభ్యం కోసం చిన్న గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేయడం జరిగిందని సూచించారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేసే యోచనలో ప్రభుత్వం ఉందన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో జరిగిన వివాహ శుభకార్యాల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మెన్ సిద్ధం వేణు, ఏఎంసీ చైర్మెన్ మామిడి సంజీవ్, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మెన్ గొడుగు తిరుపతి, సర్పంచ్‌లు వజ్రవ్వ, శ్రీనివాస్‌రెడ్డి, ఇల్లంతకుంట ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్యయాదవ్, రంగంపేట ఉపసర్పంచ్ భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మెన్ ఎండ్ర చందన్, ఉడుతల వెంకన్న, ర్యాగటి రమేష్, తూటి పర్శరాం, కడగండ్ల తిరుపతి పాల్గొన్నారు.

మనోధైర్యానికి ప్రతీక, మానసిక సమస్యల పరిష్కార వేదిక "కిరణం"

- రాష్ట్రంలోనే తొలి సారిగా మానసిక సమస్యల పరిష్కారం కోసం కిరణం సలహా కేంద్రం ఏర్పాటు
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రారంభించిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి
- పైలట్ ప్రాజెక్టుగా జిల్లాలో అమలు



కిరణం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి, వైద్య అధికారులు

నవతెలంగాణ - సిరిసిల్ల

ఆత్మస్థైర్యం కోల్పోయిన జీవితాల్లో నూతన ఆశలు చిగురించేలా కిరణం మానసిక సలహా కేంద్రం రాజన్న సిరిసిల్ల జిల్లాలో పని చేస్తుందని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో సైకాలజిస్ట్‌లు, సైకియాట్రిస్ట్‌లు, కౌన్సెలర్‌లు, వైద్యాధికారులతో జరిగిన సమావేశంలో టోల్ ఫ్రీ నంబర్ 1800 425 3333ను లాంఛనంగా ప్రారంభించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ మానసిక అనారోగ్యాన్ని తొలి దశలోనే గుర్తించడం, ప్రాథమిక చికిత్స, మానసిక మద్దతు, ఒత్తిడి నిర్వహణ, మానసిక ఆరోగ్యం, సానుకూల ధోరణిని పెంచడం వంటి లక్ష్యాలతో మానసిక ఆరోగ్య సేవలను కిరణం టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ నెంబర్ అందిస్తుందని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఆత్మహత్య ఆలోచనలు, డిప్రెషన్, ఒత్తిడి, ఆతృత, నిరాశ, భయాందోళనలు, పోస్ట్ ట్రామాటిక్ స్ట్రెస్ డిజార్డర్లు, మత్తు పదార్థాలు, సంక్షోభ ప్రేరేపిత మానసిక సమస్యలు, గృహహింస, మానసిక ఆరోగ్య అత్యవసర పరిస్థితులతో మానసిక సమస్యలతో బాధ పడేవారి సమస్యల పరిష్కారానికి ఈ హెల్ప్‌లైన్ సేవలు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఈ టోల్ ఫ్రీ నంబర్ 24/7 గంటలు పనిచేస్తుందని అన్నారు. ఈ నంబర్ కు ఫోన్ చేసిన వెంటనే నిపుణులైన సైకాలజిస్టులు, సైక్రియాటిస్టులు, కౌన్సెలర్‌లు ఫోన్ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహిస్తారని.. మానసిక సమస్యలను ఎలా అధిగమించాలో దిశా నిర్దేశం చేస్తారని చెప్పారు. అవసరమైన సందర్భంలో జిల్లా వైద్యశాలలో కౌన్సెలింగ్, చికిత్స కొరకు వారిని పంపడం ద్వారా చికిత్స కొనసాగిస్తారని తెలిపారు. రోగి కొలుకునేంత వరకు ఫాలో అప్ చికిత్స కొనసాగుతుందని తెలిపారు. మానసిక సమస్యలతో బాధపడే ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా విస్తత ప్రచారం కల్పించాలని జిల్లా కలెక్టర్ జిల్లా పౌర సంబంధాల అధికారి మామిండ్ల దశరథంకు సూచించారు. వైద్యాధికారులు తమ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు ఉప ఆరోగ్య కేంద్రాలలో ప్రచార గోడ పత్రికలను ప్రదర్శించాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా వీటిని ప్రదర్శించి ప్రజలందరికీ కిరణం టోల్ ఫ్రీ నెంబర్ తెలిసేలా చూడాలన్నారు. జిల్లాలోని ప్రజలందరు ఇట్టి సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుమన్ మోహన్‌రావు, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళీధర్‌రావు, సైకాలజిస్ట్ కె.పున్నంచందర్, ఈడీఎం శ్రీనివాస్, సైకియాట్రిస్ట్‌లు డాక్టర్ సతీష్, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ నయీమ, వైద్యాధికారులు పాల్గొన్నారు.

జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాల్సిందే

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్ కుమార్
- సీఎం కేసీఆర్‌కు బహిరంగ లేఖ



నవతెలంగాణ - తంగళ్ళపల్లి : తంగళ్లపల్లి మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న సమ్మెకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్ కుమార్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న సమ్మె న్యాయబద్ధమైనదని, వెంటనే వారిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం కేసీఆర్‌కు రాసిన బహిరంగ లేఖను మీడియా ఎదుట విడుదల చేశారు. అనంతరం వారిని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ప్రొబేషనరీ పీరియడ్ పూర్తయి నాలుగేళ్లయినా రెగ్యులరైజ్ చేయకపోవడం అన్యాయమ న్నారు. పోరాటాల ద్వారానే డిమాండ్లు సాధించుకోవాలని, ఉద్యమానికి తాము మద్దతిస్తామని తెలిపారు.

మిడ్ మానేర్ నిర్వాసితులవి న్యాయమైన డిమాండ్లు : బండి సంజయ్

నవతెలంగాణ - వేములవాడ : శ్రీ రాజరాజేశ్వరి జలాశయం(మిడ్ మానేరు) జలాశయంలో సర్వం కోల్పోయిన నిర్వాసిత ప్రజల డిమాండ్లు అన్ని న్యాయబద్ధమైనవని, వారి సమస్యలన్నీ పతిష్కారం అయ్యేవరకు బీజేపీ అండగా ఉంటుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎంపీ బండి సంజయ్ హామీ ఇచ్చారు బుధవారం వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం, చీర్లవంచ ఆర్ అండ్ ఆర్ కాలనీలో పర్యటించిన ఆయన ముంపు గ్రామాల ప్రజలకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా చీర్లవంచలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మిడ్ మానేరు ప్రాజెక్టు ప్రారంభమై 17 ఏళ్లు గడుస్తున్న ఇంతవరకు సమస్యలు పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట ముంపు గ్రామాల ఐక్యవేదిక నాయకులు ఎర్రం మహేష్, పిల్లి కనుకయ్య, బుర్ర శేఖర్ గౌడ్, జింక అనిల్ ఉన్నారు.

బీఎస్పీ సభ పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ - ఇల్లంతకుంట : ఈ నెల 7న హైదరాబాద్‌లో జరిగే బీఎస్పీ అధినేత కుమారి మాయావతి సభను విజయవంతం చేయాలని మండల నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో తెలంగాణ భరోసా సభ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మాంకాలి అమర్ మాట్లాడుతూ సమ సమాజ నిర్మాణంలో తమ వంతు సహాయంగా బహుజన్ సమాజ్ పార్టీని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగుల లింగన్న, జిల్లా కార్యదర్శి ఎంకన్నగౌడ్, సీనియర్ నాయకులు గజ్జెల సత్తన్న, కొంపెల్లి పర్శరాములు, మండల అధ్యక్షుడు మాంకాలి అమర్, కార్యదర్శి రాయినిపట్ల రాజకుమార్ పాల్గొన్నారు.

సర్పంచ్‌కు షోకాజ్ నోటీస్ జారీ

నవతెలంగాణ - వేములవాడ : వేములవాడ అర్బన్ మండలం మారుపాక సర్పంచ్ స్వయంప్రభ కు పంచాయతిరాజ్‌శాఖ షోకాజ్ నోటీసు జారీ చేసింది. గ్రామంలో ఉన్న చెరువు పూటిక మట్టి తీసి వ్యాపారులకు అమ్ముకున్నారనే ఆరోపణలతో వేములవాడ అర్బన్ మండలంలోని మారుపాక గ్రామ సర్పంచ్ చెన్నమనేని స్వయం ప్రభకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. వారం రోజుల లో నోటీసులకు వివరణ ఇవ్వాలని, లేకుంటే అందుబాటులో ఉన్న ఆధారాలు పరిగణనలోకి తీసుకుని చర్యలు తీసుకుంటామని నోటీస్‌లో పేర్కొన్నారు. కాగా కొద్ది రోజుల కిందట గ్రామానికి చెందిన దొబ్బల శ్రీనివాస్, తుమ్మల రాజవ్వ, నర్సింగోజి శంకర్,గుగ్గిళ్ల సత్తయ్య, మూడికే కొండస్వామి, మెరుగు జల, రుద్రవేని రవి తదితరులు ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా స్పందించిన అధికారులు సర్పంచ్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది.

పరీక్షలకు సమయానికి హాజరు కావాలి...

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండలంలోని దుమాల గ్రామంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో ఈ నెల 7న 6వ తరగతిలో పూర్తిగా, 7,8,9వ తరగతులలో బ్యాక్‌లాగ్ ఖాళీల కొరకు ఈ నెల 7న ఆదివారం రోజున పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని పరీక్షలు రాసే విద్యార్థులు సకాలంలో హజరుకావాలని ఏకలవ్య మాడల్ గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామారావు అన్నారు. ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హల్‌టికేట్‌ను సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. జిల్లాలో పరీక్షలు రాసే విద్యార్థులందరు వారికి కేటాయించబడిన పరీక్ష కేంద్రానికి సకాలంలో చేరుకోవాలని రీజనల్ కోఆర్డినేటర్ వెంకన్న సూచించారని ఏకలవ్య మాడల్ గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామారావు తెలిపారు.

రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కామర్స్ విద్యార్థులు

నవతెలంగాణ - వేములవాడ : కళాశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టుల సమర్పణ ఎంపిక పోటీలలో వేములవాడ అర్బన్ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ విద్యార్థులు తమ ప్రాజెక్టును సమర్థవంతంగా సమర్పించి పలువురి మన్ననలను పొందారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్ తెలిపారు. కళాశాలకు చెందిన కామర్స్ సహాయ ఆచార్యులు డాక్టర్ ఎం. మల్లారెడ్డి పర్యవేక్షణలో విద్యార్థులు వి. సుష్మ, ఎం.లహరిక, ఈ. రాజేష్, జి యశ్వంత్, పి. అనిరుద్ లు "పర్సెప్షన్ ఆఫ్ స్ట్రీట్ వెండర్స్ టువార్డ్స్ డిజిటల్ పేమెంట్స్ - ఏ స్టడీ ఆఫ్ సిరిసిల్ల టౌన్" అనే అంశంపై రూపొందించిన స్టడీ ప్రాజెక్టు ఇటీవల రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందని, ఈ ప్రాజెక్టును బుధవారం హైదరాబాదులోని ఇందిరా ప్రియదర్శిని మహిళా డిగ్రీ కళాశాల నాంపల్లిలో విద్యార్థులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తో సమర్పించి న్యాయ నిర్ణేతలు సహ విద్యార్థుల పర్యవేక్షకుల మన్ననలను పొందినట్లు తెలిపారు. ప్రాజెక్టుతో డిజిటల్ చెల్లింపుల పట్ల సిరిసిల్ల పట్టణంలోని వీధి వ్యాపారుల అవగాహన, వారు ఉపయోగిస్తున్న వివిధ డిజిటల్ వ్యాలెట్లు, డిజిటల్ చెల్లింపులలో ఎదుర్కొంటున్న సమస్యలు తెలుపుతూ వాటికి పరిష్కారం మార్గాలను తమ ప్రాజెక్టుతో నివేదించగా, కళాశాల విద్యాశాఖ ఏజీవో డాక్టర్ డిౕటి చారి, న్యాయ నిర్ణేతలు ప్రొఫెసర్ పాట్రిక్ ఆంథోనీ చేతుల మీదుగా సర్టిఫికెట్లు పొందినట్లు తెలిపారు. ఈ క్రమంలో రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీలలో పాల్గొన్న కామర్స్ అధ్యాపకులు డాక్టర్ ఎం. మల్లారెడ్డిని, విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ టి. శ్రీనివాస్ లతో పాటు అధ్యాపక బందం సభ్యులు అభినందించారు.

రాజన్న అలయాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

త్వరలోనే యాదాద్రి వలే వేములవాడను తీర్చిదిద్దుతాం

దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



నవతెలంగాణ - వేములవాడ : తెలంగాణ రాష్ట్రంలోనే అతిపెద్ద శైవ క్షేత్రంగా విరాజిల్లుతున్న వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, సీఎం కేసీఆర్ సహకారంతో యాదాద్రి వలే వేములవాడను తీర్చిదిద్దుతామని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ మంత్రి అల్లోల్ల ఇంద్రకరణ్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం వేకువజామున శ్రీ రాజరాజేశ్వరస్వామి వారిని దర్శించుకున్న ఆయన స్వామివారికి అభిషేకంతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే రూ.100 కోట్లతో గుడి చెరువును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది, భక్తుల వాహనాల పార్కింగ్ కొరకు ఏర్పాటు చేయడం జరిగిందని, మంత్రి కేటీఆర్ సహకారంతో జీహెచ్ఎంసీ నిధులు రూ.10కోట్లతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని, కొద్ది రోజుల కిందటే శ్రీ బద్ది పోచమ్మ అమ్మవారి ఆలయ విస్తరణ ప్రారంభించామని, త్వరలోనే అక్కడ పనులు పూర్తయి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని దేవాలయాలకు ధర్మకర్తల మండలిని ఏర్పాటు జరిగిందని, కేవలం వేములవాడ మాత్రమే పెండింగ్‌లో ఉందని, త్వరలోనే పాలకమండలి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అంతకుముందు వేములవాడకు వచ్చిన మంత్రిని స్థానిక ఎమ్మెల్యే రమేష్ బాబు, ఇతర ప్రజాప్రతినిధులు కలిసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

దేవాలయాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్రదేవదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి
- నాగారం గ్రామంలో శ్రీ కోదండ రామస్వామి దేవాలయ పునఃప్రతిష్ట
- మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్, వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు హాజరు



నవతెలంగాణ - కొనరావుపేట : తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ దేవాలయాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నాడని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని నాగారం గ్రామంలో శ్రీ కోదండ రామస్వామి దేవాలయ పునఃప్రతిష్ట, శ్రీ సీత రాముల కళ్యాణ మహోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఆయనకు ఆలయ పూజారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన దేవాలయాలు గత ప్రభుత్వాలు హయాంలో అభివృద్ధికి నోచుకోలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ఆలయాల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులను కేటాయిస్తూ ఆలయాలను పునఃరుద్ధరించారన్నారు. ఆలయాల అభివృద్ధిలో భాగంగానే గ్రామంలోని కోదండ రామస్వామి ఆలయాన్ని రూ.80 లక్షలతో పునర్నిర్మానం చేస్తున్నట్టు తెలిపారు. రానున్న రోజుల్లో నాగారం గామాన్ని పర్యటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు పర్యాటక శాఖకు ప్రతిపాదనలు పంపించామన్నారు. యాదాద్రి తరహాలో వేములవాడ రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. పేదల దేవుడిగా వేములవాడ రాజన్న క్షేత్రం విరాజిల్లుతున్నదని, ఆలయాల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినిపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్యే రమేష్ బాబు, జడ్పీ చైర్పర్సన్ న్యాలకొండ అరుణ, పవర్ లూమ్ టెక్స్టైల్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, అధికారులు , జిల్లా రైతు బంధు సమితి అధ్యక్షులు గడ్డం నర్సయ్య,ఆర్డీఓ పవన్ కుమార్, వేములవాడ మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి, ఎంపీపీ చంద్రయ్య, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికారిక సంస్థ జిల్లా యువజన, క్రీడలశాఖ రాజన్నసిరిసిల్ల జిల్లా సౌజన్యంతో ఎల్లారెడ్డిపేట మండలంలోని గొల్లపల్లి కాలంలో వేసవి శిక్షణ శిభిరాలు నిర్వహించడం జరుగుతుందని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పాశం సరోజన దేవారెడ్డి అన్నారు. బి. అనిల్ గౌడ్ పిఈటి, జిల్లా పరిషత్ గొల్లపల్లి ఆధ్వర్యంలో ఈ నెల 1 నుండి 31వ తేది వరకు నెల రోజుల పాటు రాచర్ల గొల్లపల్లి విద్యార్థులకు వేసవి క్రీడా శిక్షణ శిభిరాలను రాచర్ల గొల్లపల్లి క్రీడా ప్రాంగణంలో జరుగుతాయన్నారు. క్రీడాలను గొల్లపల్లి గ్రామంలో నిర్వహించడానికి కృషిచేసిన పిఈటి అనిల్ గౌడ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసి చైర్మన్ కొండ రమేష్‌గౌడ్, ప్రధానోపాధ్యాయులు పి.మురళీధర్, ఉపసర్పంచ్ పెంజర్ల దేవయ్య ఎస్ఎంసి చైర్మన్ గోగూరి శ్రీనివాస్‌రెడ్డి, వార్డు సభ్యులు పాటి దేవయ్యలు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ తిరిగి అప్పగింత

నవతెలంగాణ - వేములవాడ

వేములవాడ పట్టణంలోని భగవంతారావు నగర్ కు చెందిన సుజాత అనే మహిళ తన మొబైల్ ఫోన్ పోయిందని పట్టణ పోలీస్ స్టేషన్లో దరఖాస్తు సమర్పించింది. దీనికి స్పందించిన పోలీసులు సిఐఈఆర్.జిఓవి.ఇన్ అనే అప్లికేషన్ సాయంతో ఫోన్‌ను వెతికి పట్టుకొని బుధవారం సదరు మహిళకు అప్పగించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేష్ మాట్లాడుతూ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి దరఖాస్తు చేసుకొని, సిఐఈఆర్.జిఓవి.ఇన్ సేవలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వెంకట్రాజం, మహిళ కానిస్టేబుల్ తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

బీఎస్పీ సీనియర్ నాయకుడు మహంకాళి తిరుపతి

నవతెలంగాణ-బోయినిపల్లి : మండల కేంద్రంలో బీఎస్పీ ఆధ్వర్యంలో బుధవారం నాడు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిఎస్పి జిల్లా కమిటీ సభ్యుడు మహంకాళి తిరుపతి హాజరై మాట్లాడారు. వెంటనే స్థానిక ఎమ్మెల్యే సుంకే రవి శంకర్ చొరవచూపి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు అల్వాల అజయ్, సెక్టాం అధ్యక్షులు బొడ్డు రాజలింగం, పెగ్గెర్ల మహేందర్, ఎడపెల్లి అఖిల్ పాల్గొన్నారు.

డయాలసిస్ సెంటర్ మంజూరుకు ప్రతిపాదనలు

నవతెలంగాణ-మంథని: మంథని నియోజకవర్గంలో కిడ్నీ ఫెయిల్యూర్ వ్యాధిగ్రస్తులు రోజురోజుకు అధిక సంఖ్యలో నమోదు అవుతున్న నేపథ్యంలో మంథనిలో కిడ్నీ డయాలసిస్ సెంటర్ మంజూరు చేయాలని మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ కు ప్రతిపాదనలు సమర్పించారు. మంథని పీహెచ్‌సీలో డయాలసిస్ కేంద్రం లేకపోవడంతో రోగులు చికిత్స కోసం కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ తదితర దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుండడంతో రోగులు డయాలసిస్ చేయించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.రవాణా ఖర్చులు, బస ఖర్చులు ఆ దూర ప్రాంతాల్లో చికిత్స పొందేందుకు అవసరమైన నిరీక్షణ సమయం వారి కుటుంబాలకు పెద్ద భారంగా మారిందన్నారు. దీంతో చాలా మంది రోగులు సకాలంలో వైద్యం అందక అనేక ఇబ్బందులు పడుతున్నారని, కావున మంథని పీహెచ్‌సిలో 5 పడకల డయాలసిస్ సెంటర్‌కు అవసరమైన మానవ వనరులు, మౌలిక సదుపాయాలతో కూడిన కేంద్రాన్ని మంజూరు చేయాలని ఆయన వినతి పత్రంలో కోరారు. ఆయన అభ్యర్థన మేరకు వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ డయాలసిస్ సెంటర్, సిబ్బందిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వ కార్యదర్శికి ప్రతిపాదనలు పంపారు. డయాలసిస్ సెంటర్ ఏర్పాటు అయితే మంథని నియోజకవర్గంలోని వ్యాధిగ్రస్తుల వ్యయ ప్రయాసలు తగ్గనున్నాయి.

కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన తహసీల్దార్


వరి ధాన్య కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్న తహసిల్దార్, ఏఎంసీ చైర్మన్

నవ తెలంగాణ-రామగిరి: పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం రామగిరి మండలంలోని సుందిళ్ల, ముస్త్యాల, నాగేపల్లి, లద్నాపూర్ గ్రామాల్లో వడ్ల కొనుగోలు కేంద్రాలను మండల తహసీల్దార్ చల్ల రాంమోహన్, మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి రాజలింగు పరిశీలించారు. వడ్ల కొనుగోలు కేంద్రంలోని ఇబ్బందులను, లారీలు, లోడింగ్ రైస్ మిల్లులో ఆగి ఉన్న లారీలు ఎన్ని ఉన్నాయో తెలుసుకొని రైతులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. మరో రెండు మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని.. రైతులు తమ పంటను కాపాడుకోవాలని తెలిపారు.

రైతులు ఆందోళన చెందవద్దు.. అండగా ఉంటాం


కొనుగోలు కేంద్రాలను సందర్శించిన బీఆర్ఎస్ మండల అధ్యక్షులు శంకర్ గౌడ్

నవతెలంగాణ - మంథని: జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ ఆదేశాల మేరకు మంథని మండలంలోని లక్కేపూర్ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఏగొలపు శంకర్ గౌడ్ బుధవారం సందర్శించారు. తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతులు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

కేటీఆర్ బహిరంగ సభను జయప్రదం చేయండి

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు,
రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-గోదావరిఖని: రామగుండం నియోజకవర్గంలో ఈ నెల 8న పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ప్రత్యేక అతిథిగా హాజరవుతున్నారని, స్థానిక జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగే భారీ బహిరంగ సభకు అధిక సంఖ్యలో ప్రజలు హాజరై జయప్రదం చేయాలని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు. స్థానిక మార్కండేయ కాలనీలోని శ్రీ లక్ష్మీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన రామగుండం నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు.

బహిరంగ సభాస్థలిని పరిశీలించిన ఎమ్మెల్యే...

మంత్రి కేటీఆర్ బహిరంగ సభా స్థలిని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై తగు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో నగర మేయర్ బంగి అనిల్ కుమార్, జడ్పిటిసి అముల నారాయణ, డిప్యూటీ మేయర్ నడిపల్లి అభిషేక్ రావు, రాష్ట్ర నాయకురాలు మూల విజయా రెడ్డి, టిబిజికేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, కార్పొరేటర్లు సాగంటి శంకర్, దాతు శ్రీనివాస్, ఇంజపురి పులేందర్, కుమ్మరి శ్రీనివాస్, పాముకుంట్ల భాస్కర్, పెంట రాజేష్, కల్వచర్ల కృష్ణవేణి తదితరులు ఉన్నారు.

పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి వరం


బాధితునికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-రామగిరి: పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి వరమని రామగిరి మండలంలోని రత్నాపూర్ గ్రామ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు, ఎంపీటీసీ ధర్ముల రాజసంపత్ అన్నారు. రత్నాపూర్ గ్రామానికి చెందిన కెక్కర్ల రాములుకు రూ.24 వేల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు మంజూరు కాగా... చెక్కును ఆయనకు అందజేశారు. పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ సహకారంతో ఈ చెక్కు మంజూరు అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షులు భాద్రపు ప్రశాంత్, యూత్ అధ్యక్షులు మన్నాల రాహుల్, ప్రధాన కార్యదర్శి సందేవేన కుమార్, బాద్రపు కృష్ణ, జక్కుల ఆశాలు, భోగే సతీష్ పాల్గొన్నారు.

గీత కార్మికుల సంక్షేమానికి సర్కార్ పెద్దపీట

ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం హర్షణీయం
గౌడ సంఘం నాయకులు ఏగోళపు శంకర్‌గౌడ్



నవతెలంగాణ-మంథని: గీత కార్మికుల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని గౌడ సంఘం డివిజన్ అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్ అన్నారు. గీత కార్మికుల సంక్షేమం కోసం రైతుబీమా తరహాలో గీత కార్మికులకు బీమా సౌకర్యాన్ని కల్పించడం హర్షనీయమన్నారు. గీత వృత్తిని నమ్ముకుని జీవనం సాగించే గీత కార్మికులు గతంలో ప్రమాదవశాత్తు మరణించినా, గాయపడ్డా ఎక్స్‌గ్రేషియా మంజూరీ కావడంలో ఆలస్యం అయ్యేదని,.. కానీ ఈనాడు సీఎం కేసీఆర్ నిర్ణయంతో రైతుబీమా తరహాలో గీత కార్మికుడికి ప్రమాదం జరిగితే వెంటనే ఎక్స్‌గ్రేషియా లభిస్తుందని వివరించారు. కల్లుగీత వృత్తిని ప్రోత్సహించేలా నీరా కేఫ్‌లను ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. గీత కార్మికుల బీమా సౌకర్యం అమలుకు శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు గౌడ సంఘం పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట మంథని గౌడ సంఘం అధ్యక్షుడు మాచిడి మోహన్‌గౌడ్, రేణుకా ఎల్లమ్మ ఆలయ చైర్మన్ మాచిడి సత్యనారాయణ గౌడ్, ఆరెల్లి కొమురయ్య గౌడ్ ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శుల దీక్షకు సంఘీభావం


దీక్షలో పాల్గొన్న ఎంపీపీ, సర్పంచులు

నవ తెలంగాణ-రామగిరి: మంథని డివిజన్‌లోని మంథని, రామగిరి, ముత్తారం, కమాన్‌పూర్ మండల జూనియర్, అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు రామగిరి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ముందు చేస్తున్న సమ్మె 6వ రోజుకు చేరుకుంది. బుధవారం రామగిరి మండల ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్, పన్నూర్, నాగేపల్లి గ్రామాల సర్పంచులు అల్లం పద్మ తిరుపతి, కొండవేన ఓదెలు యాదవ్ కార్యదర్శుల సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో మంథని, రామగిరి, కమాన్ పూర్, ముత్తారం మండల జూనియర్ ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

శ్రమశక్తి అవార్డుతో తనపై మరింత బాధ్యత

టీబీజీకేఎస్ బ్రాంచి సెక్రటరీ కొల్లూరి బాలయ్య


సన్మానిస్తున్న గని మేనేజర్

నవతెలంగాణ-గోదావరిఖని: శ్రమశక్తి అవార్డుతో తనపై మరింత బాధ్యత పెరిగిందని భావిస్తున్నానని అవార్డు గ్రహీత టిబిజికెఎస్ బ్రాంచి సెక్రటరీ కొల్లూరి బాలయ్య అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ద్వారా మే డే సందర్భంగా శ్రమశక్తి అవార్డు అందుకున్న కొల్లూరి బాలయ్యను సింగరేణి ఆర్జీ 1 పరిధిలోని జిడికె 1, 3వ గని టిబిజికెఎస్ నాయకులు, కార్మికులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన గని మెనేజర్ రమేష్ బాబు, ఫిట్ సెక్రటరీ నారాయణలు బాలయ్యకు శాలువాలు కప్పి, పూలబొకే అందజేసి ఘనంగా సన్మానించారు. అవార్డు అందుకోవడం పట్ల బాలయ్యను వారు అభినందించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత కొల్లూరి బాలయ్య మాట్లాడుతూ తనకు ఈ అవార్డు రావడంతో సహకరించిన రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్, టిబిజికెఎస్ అధ్యక్షులు బి.వెంకట్రావ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన సేవలను గుర్తించినందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు. కార్యక్రమంలో వెల్ఫేర్ ఆఫీసర్ హనుమంతరావు, ఇంజనీర్ రాజు, ఫోర్ మెన్ సురేష్, ఫోర్ మెన్ శ్రీనివాస్, అసిస్టెంట్ సెక్రటరీ సుధాకర్, బోరే మల్లేష్, మల్లేష్, తాటి కమ్మరి రాములు, సిహెచ్ శ్రీను, కమలాకర్ రావు, సురేష్, శ్రీను తదితరులున్నారు.

వివాహ వేడుకల్లో పాల్గొన్న శ్రీను బాబు


వధూవరులను ఆశీర్వదిస్తున్న దుద్దిల్ల శ్రీను బాబు

నవతెలంగాణ-మంథని: కరీంనగర్ ఎం.ఆర్ వైశ్య భవన్ మంకమ్మతోటలో కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి యంసాని నాగరాజు శ్వేత వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే దుద్దిల్ల శ్రీధర్ బాబు సోదరుడు దుద్దిల్ల శ్రీను బాబు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కరీంనగర్‌లోని లైఫ్ కేర్ హాస్పిటల్ లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న మంథని మండలం ఆరెంద గ్రామానికి చెందిన జోడు సరోజనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఆరెల్లి కిరణ్ గౌడ్‌తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శ్రీధర్ బాబు చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-మంథని: మంథని మున్సిపల్ పరిధి లోని బోయిన్‌పేటలో యాదవ్ సంఘం కమ్యూనిటీ హాల్ భవనానికి సిడిపి నిధుల ద్వారా రూ.10 లక్ష లు మంజూరు చేసిన మం థని ఎమ్మెల్యే శ్రీ దుద్దిల్ల శ్రీధర్ బాబుకు యాదవ సంఘం కాంగ్రెస్ పార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలిపి, ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మంథని టౌన్ అధ్యక్షులు పోలు శివ, కిసాన్ సెల్ పెద్దపల్లి జిల్లా చైర్మన్ ముస్కుల సురేందర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఇనుముల సతీష్, బీసీ సెల్ డివిజన్ అధ్యక్షులు గోటుకారి కిషన్ జి, బీసీ సెల్ టౌన్ అధ్యక్షులు బండారి ప్రసాద్, నాయకులు పర్శవేని మోహన్ యాదవ్, గంట బాలయ్య యాదవ్, ఆర్కే రాజు యాదవ్, గుండా రాజు, తాత కొమరయ్య, పులి రాజయ్య, మహేష్, శ్రీకాంత్, శేఖర్, సంతు, నరేడ్ల కిరణ్, మబ్బు.తిరుపతి, తాత అంకుసు, రవి, శ్రీధర్, మదనయ్య తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాలకు పాల్పడిన ఏడుగురు నిందితులపై పీడీ యాక్ట్


పీడి యాక్ట్ పత్రాలను అందజేస్తున్న మంథని సీఐ సతీష్

నవతెలంగాణ-మంథని: వరుసగా వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్ ధ్వంసం చేసి అందులో ఉన్న కాపర్ కాయిల్స్ దొంగలించి నేరాలకు పాల్పడిన ఏడుగురు నిందితులపై రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి పీడీ యాక్ట్ ఉత్తర్వులు జారీ చేశారు. రామగుండం పోలీస్ కమిషనర్ పరిధిలో పెద్దపల్లి, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల పరిధిలో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్ఫార్మర్స్ ధ్వంసం చేసి అందులో ఉన్న కాపర్ వైర్లను దొంగలించి నేరాలకు పాల్పడిన మద్దిపల్లి సాయి తేజ, ధోనిపల్లి సురేష్, మీనుగు మల్లేష్, రేగుంట వర్ధన్, చిన్నకుర్తి రాకేష్, పులి భరద్వాజ్, మినుగు బానేష్ అనే నిందితులపై పీడి యాక్ట్ పోలీస్ కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వులను బుధవారం మంథని సర్కిల్ ఇన్స్పెక్టర్ సతీష్ నిందితులకు కరీంనగర్ జిల్లా కారాగారంలో అందజేశారు. అనంతరం నిందితులను చర్లపల్లి జైల్ కు తరలించారు. పీడి యాక్టు అందుకున్న నిందితులపై గతంలో మంథని పోలీస్ స్టేషన్‌తో పాటు పలు పోలీస్ స్టేషన్ లో కేసులు నమోదయ్యాయి. మంథని సీఐ సతీష్ వెంట మంథని ఎస్సై వెంకటేశ్వర్ తో పాటు సిబ్బంది ఉన్నారు.

భూ లక్ష్మీ-మహాలక్ష్మి విగ్రహ ప్రతిష్ట


విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ఎమ్మెల్యే దాసరి

నవతెలంగాణ-ఓదెల: మండలంలోని మడక, శానగొండ గ్రామాల్లో బుధవారం భూ లక్ష్మీ-మహాలక్ష్మీ, బొడ్రాయి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పిఏసీఎస్ చైర్మెన్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఆళ్ల రాజి రెడ్డి, రైతు సమితి మండలాధ్యక్షుడు కావటి రాజు యాదవ్, యూత్ మండలాధ్యక్షుడు మ్యాడగోని శ్రీకాంత్, ఆకుల మహేందర్, అనుబంధ సంఘాల మండలాధ్యక్షులు గుండేటి మధు, పోతుగంటి రాజు, చిన్న స్వామి, సర్పంచులు భాగ్యలక్ష్మీ-కొమురయ్య, గుంటి సునితా శ్రీనివాస్, ఎంపీటీసీలు పద్మావతి-ఇంద్రారెడ్డి, తిరుపతి, ఉప సర్పంచులు నిరంజన్ రెడ్డి, రంగు శంకర్, గ్రామ శాఖ అధ్యక్షులు గొర్ల కుమార్, రాజురైతు సమితి గ్రామ కో ఆర్డినేటర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి, నాయకులు గుంటి సదయ్య, రాకేష్,అజేయ్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-గోదావరిఖని: కర్ణాటక రాష్ట్రంలో ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే భజరంగ్ దళ్ హిందుత్వ సంస్థని నిషేధిస్తామని మాట్లాడిన అనుచిత వ్యాఖ్యలకి నిరసనగా గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో బుధవారం కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను భజరంగ్ దళ్ నాయకులు దహనం చేశారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి అయోధ్య రవీందర్, భజరంగ్ దళ్ నాయకులు మాట్లాడుతూ దేశం కోసం, హిందూ ధర్మం కోసం, భరతమాత సేవలో పనిచేస్తూ సమాజంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న భజరంగ్ దళ్ సంస్థని ఉగ్రవాద సంస్థ అయిన పిఎఫ్ఐ తో పోల్చడం కాంగ్రెస్ పార్టీ సిగ్గుపడాల్సిన విషయం అని అన్నారు. హిందూ సంస్థలపై ఇలాంటి ఆలోచనతో ఉన్న కాంగ్రెస్ పార్టీలో ఉన్న హిందూ నాయకులు భవిష్యత్తును ఆలోచించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు మోడం సురేందర్ గౌడ్, జిల్లా సహ కార్యదర్శి బండ సమ్మన్న, పొన్నం అంజన్న, భజరంగ్ దళ్ నగర సంయోజక్ ములుకుంట్ల శ్రీనివాస్, నగర సహకార్యదర్శి మునిగల సంపత్, సత్యనారాయణ, నగర గోరక్ష మేకల కుమార్, దుబాసి తిరుపతి, తిప్పర్తి శివ, అనిల్, రాజేష్, అరవింద్, భరత్, లడ్డూ, శ్యాం, రమేష్, మనోహర్, వినయ్, అభి, రాకేష్, కుమ్మరి మల్లేష్ తదితరులున్నారు.

ఎల్ఓసి అందజేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-గోదావరిఖని: అనారోగ్యంతో బాధపడుతున్న రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 36వ డివిజన్‌కు చెందిన మేరగోని అజయ్ కు రూ.1.50లక్షల విలువ గల ఎల్ఓసిని బుధవారం రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అందజే శారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ.. నిరుపేద ప్రజానిక కా ర్పొరేట్ వైద్యానికి ఎల్ఓసి ఎంతగా నో ఉపయోగపడుతుందన్నారు. రామగుండం నియోజకవర్గంలో ఇప్పటి వరకు సుమారు రూ.12 కోట్ల వరకు ఎల్ఓసి, సిఎంఆర్ఎఫ్ లను అందజేసినట్లు తెలిపారు.

నష్టపోయిన ప్రతి రైతుని ప్రభుత్వం ఆదుకోవాలి

సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కల్లెపల్లి అశోక్

నవ తెలంగాణ-పెద్దపల్లి: అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పెద్దపల్లి మండలంలోని పాలితం గ్రామంలో అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను కలిసి నష్టపోయిన పంటను పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా వేల ఎకరాల మేర పంట నష్టం జరిగి ధాన్యాన్ని సరైన సమయంలో కొనుగోలు చేయకపోవడం వల్ల అనేక క్వింటాళ్ల వరి ధాన్యం తడిసి ముద్దయిందన్నారు. మొలకెత్తిన, తడిసి వాసన పట్టిన ప్రతి గింజను మద్దతు ఇచ్చి కొనాలన్నారు. ప్రభుత్వం వెంటనే గ్రామాల్లో సర్వే చేయించి పంట నష్టపోయిన రైతులను గుర్తించి ప్రతి రైతును ఆదుకోవాలని కోరారు. ఇప్పటికి కూడా అనేక గ్రామంలో అధికారులు పంటనష్ట సర్వే చేయలేదన్నారు. సంబంధిత అధికారులు పంట నష్టాన్ని ప్రభుత్వానికి సమర్పించి రైతులకు నష్ట పరిహారాన్ని వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నష్ట పరిహారం చెల్లించేవరకు ప్రభుత్వంతో పోరాడుదామని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు సమ్మయ్య, సాగర, తీరు శ్రీనివాస్, భూమయ్య, సిపిఎం పార్టీ నాయకులు మోదంపల్లి శ్రావణ్, కుమ్మరి నవీన్, ఆది కృష్ణ, కుమ్మరి సదయ్య, శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అవగాహన అవసరం



నవతెలంగాణ-మంథని: విద్యుత్ ప్రమాదాలపై అవగాహన అవసరమని, విద్యుత్ వినియోగదారులు భద్రతా సూచనలు పాటించాలని పెద్దపెల్లి జిల్లా ఆపరేషన్ సర్కిల్, సూపరింటెంట్ ఇంజనీర్ బొంకూరి సుదర్శన్ అన్నారు. బుధవారం మంథని పట్టణంలోని విద్యుత్ కార్యాలయంలో పెద్దపెల్లి జిల్లా ఆపరేషన్ సర్కిల్, సూపరింటెంట్ ఇంజనీర్ బొంకూరి సుదర్శన్ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రమాదాల నుండి రక్షించుకుందాం భద్రత సూచనలు పాటిద్దాం అనే అంశం పై వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యుత్ వినియోదారుడు కచ్చితంగా విద్యుత్ ప్రమాదాల పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏదైనా విద్యు త్ సమస్య తలెత్తినప్పుడు తప్పకుండా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ శివరాములు, ఏ.డి హేమంద్ర బాబు, ఏఈ మల్లయ్య, సంబంధిత విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.


విద్యుదాఘాతంతో మేకలు మృతి



నవతెలంగాణ-మంథని: విద్యుదాఘాతంతో మేకలు మృతి చెందిన సంఘటన మంథని మండలంలోని కన్నాల, ఎక్లాస్ పూర్ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. కన్నాల గ్రామానికి చెందిన ఉడత చంద్రయ్య అనే రైతుకు సంబంధించిన మేక పశుగ్రాసం తింటున్న సమయంలో ఆకస్మికంగా విద్యుత్ షాక్ తో మరణించింది. మంథని మండలం ఎక్లాస్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని నెల్లిపల్లి గ్రామానికి చెందిన వేముల రాజ్యం అనే మేకల కాపరి తన మేకులను తీసుకొని గ్రామ శివారులో మేకలను మేపుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ కు తగిలి మృతి చెందింది. చంద్రయ్యకు చెందిన మేక విలువ సుమారు రూ.15 వేలు, వేముల రాజంకు చెందిన మేక సుమారు రూ.12 వేలు విలువ గల మేకలు మృతి చెందడంతో చంద్రయ్య, రాజం బోరున విలపించారు.ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని వారు కోరారు.

ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగును చేపడుతున్న ప్రభుత్వం

46వ డివిజన్ కార్పొరేటర్ పాతపల్లి లక్ష్మి ఎల్లయ్య యాదవ్


ప్రారంభిస్తున్న కార్పొరేటర్

నవతెలంగాణ-గోదావరిఖని: అంధత్వ రహిత తెలంగాణ కోసం రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతుందని 46వ డివిజన్ కార్పొరేటర్ పాతపల్లి లక్ష్మి ఎల్లయ్య యాదవ్ అన్నారు. కంటి వెగులు కార్యక్రమం 46వ డివిజన్ పరిధిలోని రీజనల్ హాస్పిటల్‌లో బుధవారం ప్రారంభం అయ్యింది. ముఖ్య అతిథిగా కార్పొరేటర్ పాతపల్లి లక్ష్మి ఎల్లయ్య యాదవ్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ కంటి సమస్యలతో బాధ పడుతున్న వారి కోసం ఈ కంటి వెలుగు శిబిరాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, ఈ కార్యక్రమం ద్వారా ఉచితంగా కంటి అద్దాలను కూడా అందించడం, శస్త్ర చికిత్సలు చేయించడం జరుగుతుందని, డివిజన్ ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ గౌతమ్, వి.గణేష్, ఏఎన్ఎం రాధా, శ్రీమతి, విమల, ఆశా వర్కర్లు పి.రాజేశ్వరి, తదితరులున్నారు.

విద్యుత్ భద్రత వారోత్సవాలు

నవతెలంగాణ-జూలపల్లి: జూలపల్లి మండలంలోని విద్యుత్తు కార్యాలయంలో భద్రత వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్తు పొదుపు గురించి విద్యుత్తు అధికారి ఏఈ ఎస్.అశోక్ వివరించారు. విద్యుత్ సమస్యలు ఉంటే తమ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ సునీల్, ఎస్ఎల్ఐ వాగు నాయక్, లైన్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ, లైన్‌మెన్ సంపత్, జేఎల్ఎం వినోద్, సతీష్, రాజేష్ ఉన్నారు.

అగ్ని ప్రమాదాల నియంత్రణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

పెద్దపల్లి స్టేషన్ అగ్ని మాపక అధికారి డి.శ్రీనివాస్

నవ తెలంగాణ-పెద్దపల్లి: అగ్ని ప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యల పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పెద్దపల్లి స్టేషన్ అగ్ని మాపక అధికారి దేవనంది శ్రీనివాస్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా అగ్ని ప్రమాదాల నియం త్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, తనిఖీ లు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పెద్దపల్లి అగ్నిమాపక స్టేషన్ పరిధిలో బుధవారం పెద్దపల్లి పట్టణంలోని శాంతినగర్ లో గల లక్ష్మీ శ్రీనివాస డయాగ్నోస్టిక్ అండ్ ఇమేజింగ్ సెంటర్‌లో అగ్ని ప్రమాదాల నియంత్రణకు ఏర్పాటు చేసిన జాగ్రత్తలను పరిశీలించి, అగ్ని ప్రమాదాల నియంత్రణకు, ప్రమాదాల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి స్టేషన్ అగ్ని మాపక సిబ్బంది ఎం.డి. సిరాజుద్దిన్, జి. శ్రీనివాస్, బి.శ్రవణ్ కుమార్, పి. నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

సాల్మన్ రాజుకు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలి



నవతెలంగాణ-మంథని : క్రిస్టియన్ ఎమ్మెల్సీగా గోనె సాల్మన్‌కు అవకాశం కల్పించాలని తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్ మంథని డివిజన్ అధ్యక్షుడు పాస్టర్ వల్లూరి ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి సిరిపురం అబ్రాహం ఒక ప్రకటనలో తెలిపారు. క్రిస్టియన్ నామినేటెడ్ ఎమ్మెల్సీగా ప్రస్తుతం కొనసాగుతున్న ఎమ్మెల్సీ పదవీ కాలం ముగిసిందని, దక్షిణ తెలంగాణ ప్రాంతానికి చెందిన గోనె సాల్మన్ రాజుకు ఈసారి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కోరారు. క్రిస్టియన్ సోదరులకు సహకరిస్తున్న గొనె సొలమన్ రాజ్‌ను ఎమ్మెల్సీ పదవికి నామినేట్ చేస్తే రాష్ట్రంలోని క్రిస్టియన్‌లకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని, ఇప్పటికే 33 జిల్లాల క్రైస్తవులను ఐక్యతను తెచ్చి క్రైస్తవ సమస్యలు పరిష్కార దిశగా పని చేస్తున్నారని అన్నారు. మంథని నియోజకవర్గ క్రిస్టియన్ సోదరులందరు మద్దతు ప్రకటిస్తూ, వచ్చే ఎన్నికల్లో క్రిస్టియన్ కుటుంబాల శ్రేయస్సు కోరే వారికి తమ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు.

సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోండి : ఆర్జీ 1 జీఎం

నవతెలంగాణ-గోదావరిఖని: వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సింగరేణి ఆర్జీ 1 ఏరియాలో ఉద్యోగుల పిల్లలకు, మాజీ ఉద్యోగుల పిల్లలకు, పరిసర ప్రభావిత ప్రాంత 8 నుంచి 18 సంవత్సరాల పిల్లలకు స్థానిక జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 6 నుంచి 31 వరకు ఉచిత వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు జీఎం చింతల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపా రు. ఆసక్తి గల అభ్యర్థులు పర్సనల్ డిపార్ట్‌మెంట్, జవహర్ లాల్ నెహ్రూ స్టేడి యంలో పేర్లు నమోదు చేయించుకోవాలని, అదే విధంగా ఈ క్యాంప్‌లో శిక్షణ ఇచ్చేందుకు శిక్షకులు కూడా తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు స్పోర్ట్స్ సూపర్ వైజర్ రమేష్‌ను 9849655877 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పంచాయతీ కార్యదర్శుల దీక్షకు సంఘీభావం

నవతెలంగాణ-సుల్తానాబాద్: పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న నిరసనకు బుధవారం బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ పార్లమెంటు సభ్యుడు గడ్డం వివేక్ వెంకటస్వామి, గొట్టిముక్కుల సురేష్ రెడ్డి సంఘీభావం తెలిపారు. వారి వెంట మీస అర్జున్ రావ్, సయ్యద్ సజ్జాద్, పల్లె తిరుపతి, సోదాబాబు, ప్రమోద్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ముత్తారం: ముత్తారం మండల కేంద్రంలోని ముత్తారం టౌన్ 11 కెవి లైన్ పరిధిలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని టిఎస్ఎన్‌పిడిసిఎల్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-జూలపల్లి: మండలంలోని కోనరావుపేట గ్రామంలో బుధవారం పీఏసీఎస్ చైర్మన్ కొంజర్ల వెంకటయ్య వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. రైతులు అధైర్య పడొద్దని ..
తడిసిన ధాన్యం తడిసినా కొనుగోలు చేస్తామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. వారి వెంట గ్రామ సర్పంచ్ కూసుకుంట్ల మంగ రవీందర్ రెడ్డి, ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి రాంగోపాల్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ రఘువీర్ సింగ్, కత్తెర్ల రాయమల్లు, సుధాకర్, మల్లెత్తుల అంజి, హమాలీ సంఘ నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ పట్నాలకు హాజరై పూజలు నిర్వహించిన అట్లూరి లక్ష్మణ్ కుమార్

నవ తెలంగాణ-ధర్మారం: మండలంలోని కానంపల్లి గ్రామంలో బుధవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఎల్లమ్మ తల్లి పట్నాలకు మాజీ జిల్లా పరిషత్ చైర్మన్, జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అట్లూరి లక్ష్మీ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. అనంతరం గౌడ సంఘం ఆధ్వర్యంలో అట్లూరి లక్ష్మణ్ కుమార్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఆవుల శ్రీనివాస్, గుర్రం రాజేశం, కాల్వ రవి, సంతోష్, తిరుపతి, రవి తదితరులు పాల్గొన్నారు.



లక్నో-చెన్నై మ్యాచ్ వర్షంతో రద్దు

ఇరుజట్లు చెరో పాయింట్
బడోనీ అర్ధసెంచరీ



లక్నో: లక్నో సూపర్ జెయింట్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మధ్య బుధవారం జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. వర్షం కారణంగా మ్యాచ్‌ను నిలిచే సమయానికి లక్నో జట్టు 19.2 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 125పరుగులు చేసింది. ఆయుష్ బదోని(59నాటౌట్) క్రీజ్‌లో ఉన్నాడు. కష్ణప్ప గౌతమ్(1) రహానెకు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరగానే భారీ వర్షం కురిసింది. దీంతో మ్యాచ్‌ను అంపైర్లు నిలిపివేశారు. ఎంతసేపటికీ వర్షం తగ్గకపోవడంతో మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. దీంతో ఇరుజట్లకు చెరో పాయింట్ కేటాయించారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లక్నోకు బౌలింగ్‌కు అనుకూలించిన పిచ్‌పై చెన్నై స్పిన్నర్లు చెలరేగారు. కైల్ మేయర్స్(10)ని నాలుగో ఓవర్‌లో మొయిన్ అలీ ఔట్ చేయగా.. ఆరో ఓవర్‌లో తీక్షణ వరుస బంతుల్లో మనన్ వోహ్రా(10), కృనాల్ పాండ్యా(0)లను పెవిలియన్‌కు పంపాడు. తర్వాత ఆల్‌రౌండర్ మార్కస్ స్టొయినిస్(6)ను జడేజా అద్భుతమైన బంతితో బోల్తా కొట్టించగా.. కరన్ శర్మ(9) మొయిన్ అలీకి రిటర్న్ క్యాచ్ ఇవ్వడంతో లక్నో జట్టు 10 ఓవర్లకు 5వికెట్లు కోల్పోయి 44 పరుగులు చేసి కష్టాల్లో పడింది. ఆ తర్వాత నికోలస్ పూరన్, ఆయుష్ బడోని నిలకడగా ఆడి ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టారు. 15వ ఓవర్ నుంచి బడోని దూకుడు పెంచాడు. తీక్షణ వేసిన ఆ ఓవర్‌లో బడోని సిక్స్ బాదాడు. మ్యాచ్‌లో నమోదైన తొలి సిక్సర్ అదే. తీక్షణ వేసిన 17వ ఓవర్‌లో బడోని ఓ సిక్స్, ఫోర్ రాబట్టాడు. మరోవైపు, నెమ్మదిగా ఆడుతున్న నికోలస్ పూరన్.. పథీరణ వేసిన 18 ఓవర్‌లో మొయిన్ అలీకి క్యాచ్ ఇచ్చి క్రీజ్‌ను విడిచాడు. దీపక్ చాహర్ వేసిన 19 ఓవర్‌లో బడోని మరింత రెచ్చిపోయాడు. వరసగా ఫోర్, సిక్స్ బాది 30బంతుల్లోనే అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. ఈ ఓవర్‌లో చివరి బంతిని కూడా నేరుగా బౌండరీ అవతలికి పంపి మొత్తం 20 పరుగులు రాబట్టాడు. చెన్నై బౌలర్లలో మొయిన్ అలీ, పథీరణ, తీక్షణ తలో రెండు వికెట్లు పడగొట్టగా.. జడేజా ఒక వికెట్ తీశాడు.

స్కోర్‌బోర్డు...

లక్నో సూపర్‌జెయింట్స్ ఇన్నింగ్స్: వోహ్రా (బి)తీక్షణ 10, మయర్స్ (సి)రాజపక్సె (బి)మొయిన్ 14, కరణ్ శర్మ (సి అండ్ బి)మొయిన్ 9, కృనాల్ పాండ్యా (సి)రహానే (బి)తీక్షణ 0, స్టొయినీస్ (బి)జడేజా 6, పూరన్ (సి)మొయిన్ (బి)పథీరణ 20, బడోనీ (నాటౌట్) 59, కృష్ణప్ప గౌతమ్ (సి)రహానే (బి)పథీరణ 1, అదనం 6. (19.2ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 125పరుగులు.

వికెట్ల పతనం: 1/18, 2/27, 3/27, 4/34, 5/44, 6/103, 7/125

బౌలింగ్: దీపక్ చాహర్ 4-0-41-0, దేశ్‌పాండే 1-0-1-0, మొయిన్ అలీ 4-0-13-2, తీక్షణ 4-0-37-2, జడేజా 3-0-11-1, పథీరణ 3.2-0-22-2.

లక్నోకు ఎదురుదెబ్బ

గాయంతో కెఎల్ రాహుల్ దూరం?



లక్నో: లక్నో సూపర్ జెయింట్స్ జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు కెప్టెన్ కేఎల్ రాహుల్ ఈ ఐపిఎల్ మొత్తానికి దూరం కానున్నట్లు సమాచారం. బెంగళూరుతో సోమవారం జరిగిన మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తున్న సందర్భంగా తొడ కండరాలు పట్టేయడంతో రాహుల్ మైదానంలో కుప్పకూలిన సంగతి తెలిసిందే. బెంగళూరు ఇన్నింగ్స్ రెండో ఓవర్‌లో డుప్లెసిస్ ఎక్స్‌ట్రా కవర్స్ వైపు కొట్టిన బంతిని ఆపే క్రమంలో రాహుల్ గాయపడ్డాడు. అతడి కుడి తొడ పట్టేయడంతో మైదానంలో కూప్పకూలిన రాహుల్.. ఫిజియో సహాయంతో స్టేడియాన్ని వీడాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన రాహుల్ పరిగెత్తడానికి ఇబ్బంది పడ్డాడు. అయితే, కేఎల్ రాహుల్ ప్రస్తుతం లక్నో జట్టుతోనే ఉన్నాడని బిసిసిఐ సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. రాహుల్‌కు ముంబయిలో స్కానింగ్ పరీక్షలు జరుగుతాయని, రాహుల్‌తోపాటు జయదేవ్ ఉనద్కత్ పరిస్థితిని కూడా బిసిసిఐ నిశితంగా పరిశీలిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఇక బుధవారం చెన్నైతో మ్యాచ్ సందర్భంగా టాస్‌కు కేఎల్ రాహుల్ బదులు కృనాల్ పాండ్యా వచ్చాడు. దీంతో అతడు ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడు.

నిషాంత్ సంచలనం

- తొలిరౌండ్‌లో 8వ సీడ్‌పై గెలుపు
- ప్రపంచ బ్యాక్సింగ్ ఛాంపియన్‌షిప్స్



తస్కెంట్(ఉబ్జెకిస్తాన్): ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్-2023 రెండోరౌండ్‌లోకి నిషాంత్ దేవ్ ప్రవేశించాడు. బుధవారం జరిగిన 71కిలోల విభాగం తొలిరౌండ్ పోటీలో నిషాంత్ 5-0పాయింట్ల తేడాతో అజర్‌బైజాన్‌కు చెంఇన 8వ సీడ్ సర్కాన్ అలియెవ్‌పై సంచలన విజయం సాధించాడు. నిషాంత్ ఎడమచేతి పంచ్‌లతో ప్రత్యర్థిపై పిడిగిద్దులు ఝుళిపించాడు. తొలి రెండు రౌండ్‌లు పూర్తయ్యేసరికి 4-1, ఆ తర్వాత 5-0 ఆధిక్యతలో నిలిచిన నిషాంత్ ఆ తర్వాత రౌండ్‌లోనూ తన ఆధిక్యతను నిలుపకుంటూ చివరిరౌండ్ 3నిమిషాల పోటీలోనూ 5-0తో ఆధిక్యతను సంపాదించి మ్యాచ్‌ను ముగించాడు. రెండుసార్లు జాతీయ ఛాంపియన్, 2021 ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో క్వార్టర్‌ఫైనల్‌కు చేరిన 22వ నిషాంత్ రెండోరౌండ్‌లో 2021 ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత, కొరియాకు చెందిన సంగ్‌మిన్ లీతో అమీతుమీ తేల్చుకోనున్నాడు. ఇక గోవింద్(48కిలోలు), దీపక్ భోరియా(51), శివ థాపా(63.5), నరేంద్ర బెర్వాల్(+92) గురువారం తొలిరౌండ్ బౌట్‌లలో పాల్గొననున్నారు. ఈ టోర్నమెంట్‌లో 13మందితో కూడిన భారత బాక్సర్ల బృందం పాల్గొంటోంది.



ఉన్నత విద్యా వ్యవస్థ పతనమే..!

ప్రమాణాలను దిగజారుస్తున్న కేంద్రం

- కోజికోడ్ సెమినార్‌లో ప్రముఖ ఆర్థికవేత్త ప్రభాత్ పట్నాయక్ విమర్శ

కోజికోడ్ : దేశంలో ఉన్నత విద్యా వ్యవస్థలో ప్రమాణాలను కేంద్ర ప్రభుత్వం దిగజారుస్తోందని ప్రముఖ ఆర్థికవేత్త ప్రభాత్ పట్నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. తిరువనంతపురంలోని ఏకేజీ సెంటర్ ఫర్ స్టడీ అండ్ రీసెర్చ్, కోజికోడ్‌లోని కేలూటన్ సెంటర్ ఫర్ స్టడీ అండ్ రీసెర్చ్ సంయుక్తంగా విద్యపై నిర్వహించిన మూడు రోజుల సెమినార్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. విద్యార్థి ఏం తెలుసుకోవాలి, ఏం తెలుసుకోకూడదనే విషయంలో ఏకపక్ష జోక్యం చాలా ఎక్కువగా వుందని పట్నాయక్ తెలిపారు. "ఇటువంటి మార్పులు పాఠ్యపుస్తకాల్లో ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. చార్లెస్ డార్విన్ సిద్ధాంతం ఎక్కడా కనిపించదు, మొఘల్ సామ్రాజ్యం ఊసే వుండదు, దేశంలో దారిద్ర్యం మాటే లేదు. స్వాతంత్ర్యోద్యమంలో ప్రభావవంతమైన పాత్ర పోషించిన మౌలానా అబ్దుల్ కలామ్ అజాద్ గురించి చర్చే లేదు." అని ఆయన పేర్కొన్నారు.మరో స్థాయిలో చూసినట్లైతే, విద్యాబోధనతో అస్సలేమాత్రం సంబంధం లేని వ్యక్తులను యూనివర్శిటీల వైస్ ఛాన్సలర్లుగా లేదా ఫ్యాకల్టీ సభ్యులుగా చేస్తున్నారు. "ఢిల్లీ యూనివర్శిటీలో, ఏండ్ల తరబడి తాత్కాలిక హోదాలో బోధిస్తున్న అనుభవజ్ఞులైన వారి స్థానంలో ఆర్ఎస్ఎస్, బీజేపీలకు సన్నిహితులైన వారిని నియమిస్తున్నారు." అని ఆయన విమర్శించారు.

కేంద్ర నూతన విద్యా విధానాన్ని ప్రస్తావిస్తూ, గత విద్యా విధానాల ప్రస్తావన లేకుండానే దీన్ని తీసుకువచ్చారని విమర్శించారు. "గతంలోని వాటికన్నా మెరుగైన రీతిలో తీసుకువస్తున్నామనే కాకుండా, విద్య పట్ల ప్రస్తుత గుత్తాధిపత్య ధోరణిని ప్రజల ముందు ప్రతిబింబించేలా ఈ విద్యా విధానం వుంది. భారత రాజకీయాల్లో ప్రస్తుత గుత్తాధిపత్యాన్ని కార్పొరేట్-హిందూత్వ కూటమి అనుసరిస్తోంది. నయా ఉదారవాదం, నయా ఫాసిజం మధ్య పొత్తు ద్వారా వ్యక్తమవుతున్న అంతర్జాతీయ పోకడల్లో ఇదొక భాగంగా కూడా వుంది." అని ఆయన పేర్కొన్నారు.

రాజకీయాల్లో, సమాజంలో ఈ కూటమి స్థానాన్ని మరింత బలోపేతం చేయాలన్నదే ప్రస్తుత విధానం లక్ష్యంగా వుంది. "ఇటువంటి కూటమి సమాజంలోని ఏ విమర్శనాత్మక ఆలోచననైనా లేదా సృజనాత్మకతనైనా ధ్వంసం చేయగలదు. సమాజంలో విమర్శనాత్మకంగా ఆలోచించే వారిని అణగదొక్కడం వారిని జాతి వ్యతిరేక శక్తిగా పేర్కొనడం నయా ఉదారవాద, నయా ఫాసిస్ట్ కూటమి ప్రయోజనంగా వుంది.

విద్యా కార్యకలాపాల పరిధి నుంచి సాధారణ ప్రజలు మినహాయించబడుతున్నారు. విశ్వవిద్యాలయాల కోసం నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష అనేది విశ్వవిద్యాలయ ప్రవేశ వ్యవస్థను ఒక వ్యాపార వస్తువుగా మార్చడానికి దారి తీస్తోందని అన్నారు. "మీకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష వుంటే, కోచింగ్ తరగతులు వుండాలి, దాని కోసం మీరు డబ్బు చెల్లించాలి, ఇంతా చేస్తే మీ తుది ఫలితాలు మీరు అడ్మిషన్ పొందడానికి సరిపడా వుండవు, నిరుపేద నేపథ్యం కలిగిన ఒక విద్యార్థి వద్ద కోచింగ్ క్లాస్‌లకు వెళ్లడానికి సరిపడా డబ్బు వుండదు" అని పట్నాయక్ పేర్కొన్నారు. రిజర్వేషన్ రేంజ్ అనేది విద్యా విధానంలో ప్రస్తావించని కారణంగా రిజర్వేషన్ ప్రయోజనాలను తిరస్కరించడం మరో అంశంగా వుందన్నారు.

పిచ్చిచేష్టలు మానుకోండి


- ఆకతాయికి టీఎస్ఆర్టీసీ ఎమ్‌డీ సజ్జనార్ హితవు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

నడిరోడ్డుపై కారు, ఆటో, స్కూటర్ వంటి వాహనాలు ఆగిపోతే వాటిని వెనుక నుంచి మరో వాహనం సాయంతో కాలుతో నెట్టుకుంటూ వెళ్తుంటారు. అయితే తానో బాహుబలిని అనిపించుకోవడం కోసం ఓ యువకుడు మిధానీ డిపోకు చెందిన టీఎస్ఆర్టీసీ బస్సు (104-ఎ రూట్) వేగంగా వెళ్తుంటే, దాని వెనుకనుంచి ఒక కాలుతో బస్సును తోస్తున్నట్టు వీడియో షూట్ చేయించుకున్నాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీనిపై టీఎస్ఆర్టీసీ ఎమ్‌డీ వీసీ సజ్జనార్ ఘాటుగా స్పందించారు. సోషల్ మీడియాలో పాపులారిటీ కోసం ఇలాంటి పిచ్చి పనులు చేయొద్దంటూ హితవు చెప్పారు. 'వెర్రి వేయి విధాలు అంటే ఇదే! సోషల్ మీడియాలో పాపులారిటీ కోసం రోడ్లపై ఇలాంటి పిచ్చి వేషాలు వేయకండి. ప్రమాదాల బారినపడి మీ తల్లితండ్రులకు శోకాన్ని మిగల్చకండి' అంటూ సజ్జనార్ ట్వీట్ చేశారు. దీంతో ఈ ట్వీట్ కూడా ట్రెండింగ్‌గా మారింది.

నవచిత్రం



జగపతిబాబు

'లక్ష్యం', 'లౌక్యం' వంటి బ్లాక్ బస్టర్స్ తర్వాత గోపీచంద్, డైరెక్టర్ శ్రీవాస్ కలయికలో వస్తున్న హ్యాట్రిక్ మూవీ 'రామబాణం'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రానికి వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత. ఈనెల 5న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తున్న నేపథ్యంలో ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన జగపతి బాబు మీడియాతో మాట్లాడుతూ, "రామబాణం' ఒప్పుకోవడానికి కారణం ఇప్పుడన్నీ హారర్, యాక్షన్, థ్రిల్లర్స్ ఎక్కువగా వస్తున్నాయి. ఫ్యామిలీ డ్రామా వచ్చి చాలా కాలమైంది. అలాగే గోపీచంద్, శ్రీవాస్, నేను కలిసి 'లక్ష్యం' చేశాం.దీంతోపాటు ఇందులో అన్నదమ్ముల కాన్సెప్ట్ అద్భుతంగా

మంచి సినిమా చూశామనే అనుభూతినిస్తుంది..

కుదిరింది. ఇది చాలా మంచి ఉద్దేశంతో చేసిన సినిమా. హాయిగా ఓ మంచి సినిమా చూసామనే అనుభూతినిస్తుంది. పాత్ర పరంగా నాకు సంతృప్తినిచ్చిన చిత్రమిది. ఎందుకంటే ఇప్పటి వరకూ దాదాపు 70కి పైగా క్యారెక్టర్ రోల్స్ చేశాను. అయితే ఇందులో చెప్పుకోవడానికి ఏడెనిమిది సినిమాలే ఉన్నాయి. ముఖ్యంగా ఈ సెకెండ్ ఇన్నింగ్స్‌లో 'లెజెండ్', 'అరవింద సమేత', 'రంగస్థలం' చేసిన పాత్రలు చాలా తృప్తినిచ్చాయి. కొన్ని సరిగ్గా వాడుకోలేదనే చెప్పాలి. దర్శకుడు శ్రీవాస్ ఈ చిత్రాన్ని పవర్‌ఫుల్‌గా తెరకెక్కించాడు. అలాగే పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మాతలు మోస్ట్ కంఫర్ట్‌బుల్ ప్రొడ్యూసర్స్. సెకండ్ ఇన్నింగ్స్‌లో మార్కెట్, స్టార్ డమ్ పెరిగాయి. అలాగే నా జీవితమే పెరిగింది.(నవ్వుతూ) పాత్రల పరంగా గాడ్‌ఫాదర్, అలాగే 'గాయం'కు మరో స్థాయిలో ఉండే పాత్ర చేయాలని ఉంది' అని అన్నారు.

మెప్పించే వినూత్నమైన కథ



దృషికా చందర్, నిహాల్ కోదాటి

ఛార్మి ముఖ్య పాత్రధారిణిగా జెన్ నెక్ట్స్ మూవీస్ బ్యానర్‌పై తెరకెక్కించిన 'మంత్ర' సినిమా పెద్ద సెన్సేషనల్ హిట్‌గా నిలించింది. ఇదే బ్యానర్‌లో అనుపమ పరమేశ్వరన్‌తో 'బటర్ ఫ్లై' చిత్రాన్ని నిర్మించి మరో విజయాన్ని అందుకుంది. ఇదే బ్యానర్‌పై మంత్ర సినిమా రచయిత రవి ప్రకాశ్ బోడపాటి నూతన దర్శకత్వంలో తెరకెక్కిన థ్రిల్లర్.. 'ది స్టోరి ఆఫ్ ఏ బ్యూటిఫుల్ గర్ల్'. ఈ సినిమా ఈనెల12న ప్రపంచవ్యాప్తంగా రిలయన్స్ సంస్థ ద్వారా విడుదలకు రెడీ అయ్యింది. రవి ప్రకాష్ బోడపాటి రచన-దర్శకత్వంలో ప్రసాద్ తిరువల్లూరి, పుష్యమి ధవళేశ్వరపులు సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రంలో నిహాల్ కోదాటి హీరోగా, దృషికా చందర్ హీరోయిన్‌గా నటించారు. మధునందన్, భార్గవ పోలుదాసు, భావన దుర్గం, సమర్థ యుగ్ అలాగే ప్రముఖ జర్నలిస్ట్ దేవి నాగావల్లీ, మెహెర్ శ్రీరామ్ తదితరులు ముఖ్య పాత్రలను పోషించారు. చాలా వైవిధ్యమైన కథతో నేటితరం యువతకు నచ్చేలా ఈ సినిమాను తెరకెక్కించామని, యువతకు కావల్సిన అన్ని అంశాలతో పాటు ఓ మంచి సందేశం కూడా ఈ సినిమాలో ఉంటుందని మేకర్స్ తెలిపారు. నాన్నకు ప్రేమతో, సీతారామమ్ వంటి సినిమాలను విడుదల చేసిన ప్రతిష్టాత్మకమైన రిలయన్స్ ఎంటర్ టైన్మెంట్ సంస్థకి ఈ సినిమా ఎంతగానో నచ్చి.. ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేస్తుండటం సంతోషంగా ఉందని మేకర్స్ తెలిపారు.



అల్లరి నరేష్

కామెడీ పాత్రలు చాలా సునాయాసంగా చేసిన నాకు యాక్షన్ రోల్స్ చేయడం సవాల్‌గా అనిపించింది. అయితే క్రిష్ 'గమ్యం', సముద్రఖని 'శంభో శివ శంభో' ఇప్పుడు విజయ్ 'నాంది, ఉగ్రం'తో వచ్చింది. నన్ను దర్శకుడు నమ్మితే దాని రిజల్ట్ వేరేలా ఉంటుంది. ఇంత ఇంటెన్స్ రోల్ చేస్తానని కలలో కూడా అనుకోలేదు. ఈ క్రెడిట్ అంతా విజయ్‌కి వెళ్తుంది' అని హీరో నరేష్ అన్నారు. 'నాంది' వంటి విజయవంతమైన చిత్రాన్ని అందించిన అల్లరి నరేష్, డైరెక్టర్ విజయ్ కనకమేడల మరో యూనిక్, ఇంటెన్స్ మూవీ 'ఉగ్రం'తో వస్తున్నారు. ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్ బ్యానర్ పై సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మించారు. మిర్నా మీనన్ నాయిక. ఈనెల 5న సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న నేపథ్యంలో అల్లరి నరేష్ మీడియాతో ముచ్చటించారు.

ప్రేక్షకాదరణ వల్లే సాధ్యమైంది..

'ఇందులో మూడు వేరియేషన్స్‌లో ఉండే పాత్రలో కనిపిస్తాను. ఈ చిత్ర ట్రైలర్‌కి మంచి రెస్పాన్స్ వస్తోంది. యాంగ్రీ మ్యాన్ పాత్రలో నన్ను ప్రేక్షకులు ఇష్టపడుతున్నారని అర్థమైంది. ఇందులో యాక్షన్ సహజంగా ఉంటుంది. దర్శకుడు విజయ్ ఏం కావాలో చాలా క్లారిటీగా తెలుసు. ఈ సినిమాలో తాను అనుకున్నది డెలివర్ చేశాడు. మీర్నా, కూతురుగా నటించిన ఊహా అద్భుతంగా చేశారు. మా నిర్మాతలు ఎక్కడా రాజీపడలేదు. ఇది నా 60వ సినిమా. ఇన్ని సినిమాలు కేవలం ప్రేక్షకుల ఆదరణ వల్లే సాధ్యమైంది. దర్శకత్వం చేసే ఆలోచన ఉంది. కానీ దానికి చాలా సమయం ఉంది. నాన్న (ఇవివి) చివరి రోజుల్లో అలీ బాబా అరడజను దొంగలకి సీక్వెల్‌గా అలీ బాబా డజను దొంగలు చేద్దామని అనుకున్నాం' అని నరేష్ చెప్పారు.

నటుడు, దర్శకుడు, నిర్మాత మనోబాల కన్నుమూత



మనోబాల

ప్రముఖ తమిళ నటుడు, దర్శకుడు, నిర్మాత మనోబాల (69) చెన్నైలో తుదిశ్వాస విడిచారు. గత రెండు వారాలుగా కాలేయ సంబంధ సమస్యలతో బాధపడుతూ చికిత్స పొందుతున్న ఆయన బుధవారం కన్నుమూశారు. 35 ఏండ్ల సినీ ప్రస్థానంలో ఆయన 450కిపైగా చిత్రాల్లో నటించారు. అలాగే పలు సీరియల్స్‌లోనూ నటించి మెప్పించారు. మనోబాలకు భార్య ఉష, కుమారుడు హరీష్ ఉన్నారు. భారతీరాజా 'పుతియ వర్పుగల్'తో కెరీర్‌ను ప్రారంభించిన ఆయన ఇటీవల విడుదలైన చిరంజీవి 'వాల్తేరు వీరయ్య'లోనూ కనిపించారు. నటుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా, డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా.. ఇలా బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన మనోబాల మృతిపట్ల కమల్‌హాసన్, రజనీకాంత్ వంటి ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

థ్రిల్ చేసే అథర్వ

ప్రస్తుతం కంటెంట్ చిత్రాలకు ఎంతటి ఆదరణ ఉందో అందరికీ తెలిసిందే. అటు కమర్షియల్ చిత్రాలను ఆదరిస్తూనే, ఇటు ప్రయోగాత్మక చిత్రాలకూ తెలుగు ప్రేక్షకులు పెద్ద పీట వేస్తున్నారు. నూతన దర్శకులు కొత్త కొత్త కాన్సెప్ట్‌లతో ఆడియెన్స్ ముందుకు వస్తున్నారు. ఈ తరహాలోనే ఉన్న 'అథర్వ' సినిమా త్వరలోనే ఆడియెన్స్ ముందుకు రానుంది.



కార్తీక్ రాజు, సిమ్రాన్ చౌదరి

నూతలపాటి నరసింహం, అనసూయమ్మ సమర్పణలో పెగ్గో ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై కార్తీక్ రాజు, సిమ్రాన్ చౌదరి, ఐరా నటీ నటులుగా తెరకెక్కుతున్న సినిమా 'అథర్వ'. డిఫరెంట్ కాన్సెప్ట్‌ని టచ్ చేస్తూ క్రైమ్ థ్రిల్లర్ మూవీగా రూపొందుతున్న ఈ సినిమాకు మహేష్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. సుభాష్ నూతలపాటి నిర్మాణ బాధ్యతలు చేపట్టారు. విజయ, ఝాన్సీ ఎగ్జిక్యూటీవ్ ప్రొడ్యూసర్స్‌గా వ్యవహరిస్తున్న ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు ప్రస్తుతం చివరి దశలో ఉన్నాయి. ఇప్పటికే విడుదల చేసిన టైటిల్ లోగో, మోషన్ పోస్టర్, టీజర్, ఫస్ట్ లుక్.. ఇలా అన్నింటికి మంచి రెస్పాన్స్ వచ్చింది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రపంచ వ్యాప్తంగా రాబోతోన్న ఈ మూవీకి సంబంధించిన అప్డేట్‌ను మేకర్లు తాజాగా అనౌన్స్ చేశారు. ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు ప్రస్తుతం చివరి దశలో ఉన్నాయని, ఈ సినిమాను జూన్‌లో పెద్ద ఎత్తున రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని దర్శక నిర్మాతలు ఈ అనౌన్స్‌మెంట్‌లో తెలిపారు.

పదేళ్ల కష్టం బలగంతో ఫలించింది



సంజయ్ కృష్ణ

పదేళ్ల కష్టం బలగంతో ఫలించిందని నటుడు సంజయ్ కృష్ణ చెప్పారు. ఈనెల 5న ఆయన పుట్టినరోజు. ఈ సందర్భంగా సంజయ్‌కృష్ణ మాట్లాడుతూ, 'అమెరికాలో ఎంబీఏ చేసి, ఇండియాలో ఎల్ఎల్‌బీ చేశా. నటుడిగా చేసిన ప్రయత్నాల్లో తొలిసారి 'కాళీ చరణ్'లో ఛాన్స్ వచ్చింది. తర్వాత 'అప్పట్లో ఒకడుండేవాడు'లో మంచి క్యారెక్టర్ రావడంతో 'కాటమ రాయుడు'లో నటించే ఛాన్స్ వచ్చింది. 'ఆచార్య, గని, అఖండ, భీమ్లానాయక్'.. అలా మొత్తం 32 సినిమాల్లో నటించినప్పటికీ సరైన బ్రేక్ రాలేదు. కానీ 'బలగం' పెద్ద హిట్ కావడంతో ఇన్నేళ్ల కష్టం ఫలించింది. ఈ మూవీ తర్వాత నాలుగైదు ప్రాజెక్ట్‌లు లైన్‌లో ఉన్నాయి. అలాగే ప్రస్తుతం నాగశౌర్య 'రంగబలి'లోనూ నటిస్తున్నా' అని చెప్పారు.

సామాజిక ప్రయోజనం కోసంమహిషాసురుడు

సామాజిక ప్రయోజనం, బాధ్యతలను దృష్టిలో పెట్టుకుని 'మహిషాసురుడు' చిత్రాన్ని నిర్మిస్తున్నామని మేకర్స్ తెలిపారు. అనిరుధ్, అపరాజిత సమర్పణలో శ్రీ శివరామ ఆర్ట్స్ పతాకంపై ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎస్.గురుప్రసాద్ ప్రధాన పాత్రలో వినోద్, రిచా కర్లా, ధరణి రెడ్డి హీరో హీరోయిన్లుగా ఈ సినిమా రూపొందుతోంది. రవికుమార్ గోనుగుంట దర్శకత్వం వహించిన ఈ చిత్ర ఆడియో బుధవారం ఫిలిం ఛాంబర్‌లో జరిగిన వేడుకలో విడుదలైంది. ఈ సందర్భంగా ప్రధాన పాత్రధారి, నిర్మాత డాక్టర్ ఎస్.గురుప్రసాద్ మాట్లాడుతూ, 'ప్రాణాలను కాపాడే కోట్లాది రూపాయలు ఖర్చయ్యే వైద్య పరికరాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకునే బదులు వాటిని మన దేశంలోనే తయారు చేసుకుంటే తక్కువ ఖర్చుతో వైద్య సహాయం అందివచ్చు అనే పాయింట్‌తో ఈ సినిమాను తీశాం. మన దేశంలో పరిశోధనలు చేసే సైంటిస్ట్‌లకు తగినంత గుర్తింపు లేదనే వాస్తవ అంశాలను సమాజానికి, ప్రభుత్వాలకు తెలియజేయాలనే సంకల్పంతో, అలాగే ఫైనాన్స్ కంపెనీల ప్రలోభాలకు లొంగి డబ్బులు తీసుకొని, వాళ్ల ఉచ్చులో చిక్కుకొని బయటకు రాలేక ఎన్నో కుంటుబాలు ఆత్మహత్యలు చేసుకొం టున్నాయి అ నే మరో అం శాన్నికూడా ఈ చి త ంలో చూ ంచాం' అని చెప్పారు.ా వీ లవ్ తుందన్న ఆయన తపనే ఈ చిత్ర నిర్మాణానికి మూలం. సినిమా చాలా బాగా వచ్చింది' అని దర్శకుడు అన్నారు.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.